తెలంగాణ ప్రభుత్వం

# వ్యవసాయ పాడి పంటలు


( VYAVASAYA PADIPANTALU )

సంపుటి-83 సంచిక-03 వ్యవసాయ శాఖ పేజీలు - 52 మార్చి - 2025

రాష్ట్ర రైతాంగానికి, ప్రజలకు, వ్యవసాయశాఖ సిబ్బందికి

## ఉగాది శుభాకాంక్షలు... రంజాన్ శుభాకాంక్షలు



2025 ఫిబ్రవరి 25న 45వ రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ సంచాలకులు డా.బి.గోపి, ఐ.ఎ.ఎస్.,
566 రైతు వేదికల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 4,62,205 మంది రైతులకు శిక్షణ ఇచ్చారు.
వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పాల్గొని చెరుకు పంటలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు.

**2025 జనవరి 17న తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం డైరీని ఆవిష్కరించిన తెలంగాణ ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు బి.కృపాకర్‌రెడ్డి, కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ సంఘ నాయకులు, వ్యవసాయ అధికారులు, మిత్రులు**








# వ్యవసాయ పాడి పంటలు

( VYAVASAYA PADIPANTALU )

సంపుటి : 83 మార్చి - 2025 సంచిక : 03

శ్రీ క్రోధి నామ సంవత్సరం ఫాల్గుణం - శ్రీ విశ్వావసు నామ సంవత్సరం చైత్రం

వ్యవసాయశాఖ సలహాలు, సూచనలు, వ్యవసాయ పాడిపంటలు మాస పత్రిక, ఇతర సమాచారం కోసం
http://vyavasayam.telangana.gov.in, https://agri.telangana.gov.in వెబ్‌సైట్‌లను సందర్శించండి!


తెలంగాణ ప్రభుత్వం

## సంపాదక వర్గం




ప్రధాన సంపాదకులు

డా.బి.గోపి, ఐ.ఎ.ఎస్

వ్యవసాయ సంచాలకులు



సంపాదకులు

కె. విజయ్ కుమార్

అదనపు వ్యవసాయ సంచాలకులు

సహాయ సంపాదకులు

- టి.సుజాత
- సయ్యద్ ఇంతియాజ్ అహమ్మద్
- పెద్దిరెడ్డి వరలక్ష్మి

సంపాదక మండలి సభ్యులు

డి.వి.రామక్రిష్ణారావు


**రచనలు పంపాల్సిన చిరునామా**


సహాయ వ్యవసాయ సంచాలకులు (ముద్రణ)
వ్యవసాయ కమిషనరు వారి కార్యాలయం
ఎల్.బి. స్టేడియం ఎదురుగా,
హైదరాబాద్-500 001.


గమనిక : రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలనా విభాగం వారి ఆదేశాల మేరకు పాడిపంటలు మెయిల్ ఐ.డి. ఇకపై **tgpadipantalu@gmail.com** పాత మెయిల్ ఐ.డి.లోని ts స్థానంలో tg చేర్చాము.

పాత మెయిల్ ఐ.డి. tspadipantalu@gmail.com


**Published & Printed by**
Dr. B. Gopi, I.A.S.,
Director of Agriculture,
Government of Telangana, Opp. L.B. Stadium,
Basheerbagh, Hyderabad-500 001, through
Telangana State Agro Industries Development
Corporation Limited (TSAIDC Ltd.)
Hyderabad


## విషయ సూచిక


1. రాష్ట్రంలో నమోదైన వర్షపాత వివరాలు....4
2. సంపాదకీయం....5
3. మార్చి మాసంలో చేపట్టాల్సిన వ్యవసాయ పనులు....6
4. వాతావరణం - పంటల పరిస్థితి....11
5. వేసవి అవరాలలో సస్యరక్షణ....14
6. మిరప కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు....16
7. మొక్కజొన్నలో కత్తెరపురుగు సమగ్ర యాజమాన్యం....18
8. వేసవిలో నువ్వుల సాగు, చీడపీడలు, తెగుళ్ళ నివారణలో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు....20
9. వేసవి పెసరలో వైరస్ తెగుళ్ళ లక్షణాలు – సమగ్ర నివారణ....23
10. యాసంగి వరి పైరులో పోషక యాజమాన్యం....25
11. బేలర్‌ని ఉపయోగిద్దాం - పంట అవశేషాలను సమర్థవంతంగా వినియోగిద్దాం....26
12. మామిడిలో పండు ఈగ నివారణ....28
13. పుచ్చసాగులో మెళకువలు....30
14. మామిడిలో కోతకు ముందు ఉపయోగించే పండ్ల సంచుల ప్రాముఖ్యత....32
15. వరిలో కంకినల్లి, సుడిదోమ యాజమాన్యం....33
16. మామిడిలో పూత దశలో చీడల నివారణ, సూక్ష్మపోషక లోపాల నివారణ....35
17. పుచ్చ సాగులో చీడపీడలు, తెగుళ్ళ యాజమాన్యం....36
18. పచ్చిరొట్ట – పంటకు పోషణ....37
19. ఆరోగ్యానికి అమృతం – గోధుమ గడ్డి....39
20. వర్షం తీరు – పెట్టిన పేరు....44
21. వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రం....45
22. సాగు... సంగతులు..43....46
23. ఫోన్ – ఇన్ – లైవ్....49


82 సంవత్సరాలుగా రైతాంగానికి సలహాలు, సూచనలు అందిస్తూ, వ్యవసాయరంగంలో వస్తున్న సాంకేతిక మార్పులు, అభివృద్ధి, ప్రభుత్వ పథకాలు, రాయితీలను గురించి సమాచారం తెలియజేస్తూ రైతాంగానికి కరదీపికగా వెలువడుతున్న 'వ్యవసాయ పాడి పంటలు' పత్రికను చదువుదాం. రైతులందరిచేత చదివిద్దాం!

– సం.

## రాష్ట్రంలో సాగైన పంటల విస్తీర్ణం (ఎకరాలలో)

## రాష్ట్రంలో నమోదైన వర్షపాత వివరాలు (మి.మీ.లలో)

| క్ర. సంఖ్య | జిల్లాలు | యాసంగి పంటల సాగు విస్తీర్ణం 05.03.2025 వరకు | | 01-06-2024 నుండి 05-03-2025 వరకు | |
|---|---|---|---|---|---|
| | | సాధారణం | నమోదు | సాధారణం | నమోదు |
| 1. | ఆదిలాబాద్ | 142207 | 147835 | 1111.3 | 1121.1 |
| 2. | కొమరంభీం ఆసిఫాబాద్ | 34342 | 35596 | 1138.1 | 1243.4 |
| 3. | మంచిర్యాల | 100509 | 115489 | 1051.8 | 1054.1 |
| 4. | నిర్మల్ | 262664 | 308121 | 1028.3 | 1147.8 |
| 5. | నిజామాబాద్ | 485404 | 509237 | 978.0 | 1133.0 |
| 6. | కామారెడ్డి | 378531 | 401380 | 948.3 | 1004.3 |
| 7. | కరీంనగర్ | 276584 | 292455 | 865.7 | 1043.2 |
| 8. | పెద్దపల్లి | 204433 | 213492 | 995.9 | 1083.6 |
| 9. | జగిత్యాల | 315620 | 344536 | 971.6 | 1063.5 |
| 10. | రాజన్న సిరిసిల్ల | 157471 | 182255 | 852.2 | 1009.9 |
| 11. | మెదక్ | 204590 | 265589 | 801.1 | 939.8 |
| 12. | సంగారెడ్డి | 147592 | 195829 | 786.9 | 916.2 |
| 13. | సిద్దిపేట | 310303 | 387200 | 725.6 | 955.6 |
| 14. | వరంగల్ | 182931 | 204682 | 980.8 | 1162.8 |
| 15. | హనుమకొండ | 171737 | 177542 | 952.6 | 1021.6 |
| 16. | మహబూబాబాద్ | 180262 | 188154 | 954.1 | 1337.3 |
| 17. | ములుగు | 50917 | 64051 | 1274.0 | 1654.6 |
| 18. | జయశంకర్ భూపాలపల్లి | 90231 | 102790 | 1052.3 | 1202.0 |
| 19. | జనగాం | 172124 | 197440 | 830.1 | 882.9 |
| 20. | ఖమ్మం | 267454 | 340383 | 963.9 | 1238.0 |
| 21. | భద్రాద్రి కొత్తగూడెం | 73907 | 101062 | 1107.4 | 1334.7 |
| 22. | రంగారెడ్డి | 102063 | 120844 | 666.6 | 779.9 |
| 23. | వికారాబాద్ | 111331 | 137929 | 735.2 | 972.1 |
| 24. | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 13849 | 14875 | 740.0 | 802.5 |
| 25. | మహబూబ్‌నగర్ | 115992 | 144749 | 594.8 | 951.1 |
| 26. | నారాయణ్‌పేట | 111072 | 141067 | 574.3 | 978.3 |
| 27. | నాగర్‌కర్నూల్ | 265209 | 312732 | 598.0 | 921.8 |
| 28. | వనపర్తి | 169971 | 189355 | 588.4 | 988.0 |
| 29. | జోగులాంబ గద్వాల | 118028 | 131606 | 537.7 | 821.0 |
| 30. | నల్గొండ | 473010 | 549000 | 657.9 | 802.3 |
| 31. | సూర్యాపేట | 426405 | 475209 | 738.3 | 905.6 |
| 32. | యాదాద్రి భువనగిరి | 237543 | 276002 | 685.7 | 775.6 |
| 33. | హైదరాబాద్ | - | - | 768.4 | 893.0 |
| | **మొత్తం / వర్షపాతం సగటు** | **63,54,286** | **72,68,486** | **865.7** | **1049.5** |

**గమనిక:** 'వ్యవసాయ పాడిపంటలు' పత్రిక సాఫ్ట్ కాపీని http://vyavasayam.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి, https://agri.telangana.gov.in/ వెబ్‌సైట్ నుంచిడౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

- సంపాదకులు



# సంపాదకీయం

## భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగిద్దాం!

పంటలకు నేల సహజవనరు కాబట్టి నేల సారాన్ని కాపాడుకోవడం మన బాధ్యత. నేల స్వభావం, పోషకాల స్థాయి, వాటి లభ్యతను బట్టి పంట దిగుబడులు ముడిపడి ఉంటాయి. పంట దిగుబడులతో రైతు జీవనం ముడిపడి ఉంటుంది. నేల సారాన్ని కాపాడుకుంటూ అధిక, సుస్థిర దిగుబడులు పొందేందుకు నేలలో ఉన్న భూసారాన్ని తెలుసుకోవడం ఎంతో అవసరం. భూసార పరీక్షల ఆధారంగా అవసరమైన ఎరువులను వాడి, ఎరువుల వాడకంలో అనవసర ఖర్చును నివారించవచ్చు. అంతేకాదు భూసారాన్ని కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు మంచి నేలనూ అందించవచ్చు. రైతులు ప్రతి రెండూ లేక మూడు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకోవడం అవసరం.

భూసార పరీక్షల ద్వారా నేలలో లభ్యమయ్యే ముఖ్యపోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్‌లతోపాటు, ఉపపోషకాలైన కాల్షియం, మెగ్నీషియం, సల్ఫర్; సూక్ష్మ పోషకాలైన ఐరన్, మాంగనీస్, కాపర్, జింక్, మాలిబ్డినమ్, బోరాన్, అల్యూమినియం వంటి మూలకాల స్థాయినీ తెలుసుకోవచ్చు.పోషకపదార్థాల గురించేకాక భూమిలోని చౌడు గుణాలను, సున్నం శాతాన్ని, నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు కూడా భూసార పరీక్షలు చేయించుకోవాలి.

భూసార పరీక్షలకు మట్టినమూనాలను శాస్త్రవేత్తలు సూచించిన పద్ధతిలో సేకరించాలి. నమూనా సేకరణలో తీసుకోవల్సిన జాగ్రత్తలు అన్నీ పాటించాలి.రైతులు రాష్ట్రంలోని ప్రయోగశాలలకు పంపిన తమ మట్టినమూనాల పరీక్షా ఫలితాలను సాయిల్ హెల్త్ కార్డ్ ద్వారా రైతులకు అందజేస్తున్నారు. ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చాలా ప్రాముఖ్యత ఇస్తున్నాయి. మన రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఉన్న ప్రభుత్వ వ్యవసాయశాఖకు సంబంధించిన భూసార పరీక్షా ప్రయోగశాలల్లో భూసార పరీక్షలు చేయించుకోవచ్చు.

శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించి సరైన విధంగా, అవసరమైన మేరకు ఎరువులను వాడి రైతులు ఇటు ఆర్థిక భారాన్ని తప్పించుకోవడమే కాకుండా, అటు నేల ఆరోగ్యాన్నీ కాపాడినవారు అవుతారు. మన పూర్వీకులు ఆరోగ్యవంతమైన, సారవంతమైన నేలను తమ వారసత్వంగా మనకు అందించారు. మనం కూడా మన భవిష్యత్ తరాలకు అటువంటి మంచి పంటలు పండే భూమినే అందించి వ్యవసాయ సంస్కృతిని కొనసాగిద్దాం. మట్టి ఆరోగ్యమే మనిషి ఆరోగ్యం అనే స్పృహ జోరందుకుంటున్న ఈ తరుణంలో భవిష్యత్ దృష్టితో ఆలోచనలు చేద్దాం... భూసారాన్ని పరిరక్షించుకుందాం!

రాష్ట్ర రైతాంగానికి, ప్రజలకు, వ్యవసాయశాఖ సిబ్బందికి

ఉగాది శుభాకాంక్షలు.. రంజాన్ శుభాకాంక్షలు..





# మార్చి మాసంలో చేపట్టాల్సిన వ్యవసాయ పనులు

- రాష్ట్ర వ్యవసాయశాఖ

**వరి :** వరిలో పిలక వేసే దశ / దుబ్బు చేసే దశ / గంట పోసే దశ చాలా కీలకమైనవి. ఈ దశలో సరైన నీటి యాజమాన్యం, కలుపు యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, పురుగులు తెగుళ్ళ యాజమాన్యం చేయనట్లైతే, వరిలో దిగుబడులు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

- రైతులు క్రమం తప్పకుండా పొలంలో కలియ తిరుగుతూ, నీటిని, పురుగులు, తెగుళ్ళ ఉధృతిని ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరం మేరకు మాత్రమే పురుగులు, తెగుళ్ళ మందులు పిచికారీ చేయాలి. అనవసరంగా ఖర్చు చేయకుండా, నిపుణుల సలహాల మేరకు మాత్రమే పురుగులు /తెగుళ్ళ మందులు వాడాలి.
- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వరి పైర్లు దుబ్బు చేసే దశ నుండి చిరుపొట్ట దశలో ఉన్నాయి. ఈ యాసంగి వరి పంటలో మొవ్వు చనిపోవడం అధికంగా గమనించారు. సాధారణంగా వరి పంటలో కాండం తొలిచే పురుగు రెండు దశల్లో (పిలక దశ, చిరుపొట్ట దశల్లో) ఆశిస్తుంది. కనుక మార్చి మాసంలో వరి పంట అంకురం నుండి చిరుపొట్ట దశల్లో ఉన్న వరి పైర్లలో రెక్కల పురుగు ఉధృతిని బట్టి పురుగు మందులు పిచికారీ చేయాలి. ఈ యాసంగిలో పురుగు ఉధృతి అధికంగా ఉంది. కావున తెల్లకంకులు ఎక్కువగా వచ్చి రైతులు నష్టపోయే అవకాశం ఉంది.
- కాండం తొలిచే పురుగు నివారణకు ముందస్తుగానే చిరుపొట్ట దశలో ఎకరానికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50% యస్‌పి 400 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 60 మి.లీ. లేదా ఐసోసైక్లోసిరమ్ 120 మి.లీ. పిచికారీ చేయాలి. ఒకసారి తెల్లకంకులు ఏర్పడిన తర్వాత ఎలాంటి పురుగు మందులు పిచికారీ చేసినా ప్రయోజనం ఉండదని గమనించాలి.
- చౌడు ఉన్న ప్రాంతాలలో వరి పొలంలో నీరు ఉంచడం వలన చౌడు ప్రభావం తగ్గుతుంది
- రెక్కల పురుగులను లేదా గుడ్ల సముదాయాలను రైతులు ఎప్పటికప్పుడు గమనించాలి.
- ఈ యాసంగిలో జనవరి–ఫిబ్రవరి మాసాల్లో చలి, చౌడు, జింకు ధాతులోపం, సల్ఫైడ్ దుష్ప్రభావం వలన వరి పైర్ల ఎదుగుదల లోపించింది. రైతులు పంట ఎదుగుదల కోసం పైపాటుగా నత్రజని ఎరువును అధిక మొత్తంలో వేయడం జరిగింది. ఇలాంటి పరిస్థితులలో ముఖ్యంగా మార్చి మాసంలో అగ్గితెగులు (ఆకుమచ్చ, మెడవిరుపు దశ) ఆశించే అవకాశం ఉంది. కావున తెగులు తొలిదశలో ఎకరానికి ఐసోప్రోథయోలేన్ 300 మి.లీ. లేదా కాసుగామైసిన్ 500 మి.లీ. పిచికారీ చేయాలి. ఒకవేళ ఉధృతి అధికంగా ఉన్నట్లైతే ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ + టెబ్యుకొనజోల్ 80 గ్రా. లేదా అజాక్సీస్ట్రోబిన్ 16.7% + ట్రైసైక్లోజోల్ 33.3 యస్‌సి 200 మి.లీ. లేదా పికాక్సీస్ట్రోబిన్ + ట్రైసైక్లోజోల్ 400 మి.లీ. ఎకరానికి పిచికారీ చేయాలి.



❖ తెగులు ఉధృతి గమనించినట్లైతే పొలాన్ని పూర్తిగా ఆరబెట్టినట్లైతే ఉధృతి ఇంకా ఎక్కువయ్యే అవకాశం ఉందని రైతులు గమనించాలి.

**మొక్కజొన్న :** యాసంగిలో ముందుగా విత్తుకున్న మొక్కజొన్న పైరుకోతకు సిద్ధంగా ఉంటుంది. పంట పరిపక్వదశకు చేరుకున్నప్పుడు కోత చేపట్టాలి. కండెల పైపొర ఎండిపోవడం, గింజలు వేలిగోరుతో నొక్కినప్పుడు గట్టిగా ఉండి నొక్కులు ఏర్పడకపోవడం, కొన్ని రకాలలో గింజ అడుగు భాగంలో నల్లట చార ఏర్పడడం వంటి లక్షణాలను బట్టి పరిపక్వదశను గుర్తించవచ్చు. కొన్ని వంగడాలలో పక్వదశకు చేరుకున్న తర్వాత కూడా పైరు పచ్చగా ఉండడం గమనించవచ్చు. గింజలలో 25-30 శాతం తేమ ఉన్నప్పుడు కోత చేపట్టాలి.

❖ కోసిన కండెలను ఎండలో బాగా ఆరబెట్టి గింజలలో సుమారు 15 శాతం తేమ ఉండగా యంత్రాల సహాయంతో నూర్పిడి చేసి గింజలను 2-3 రోజులు ఎండలో 10-12 శాతం తేమ వరకు ఆరబెట్టాలి.

❖ యాసంగిలో ఆలస్యంగా విత్తుకున్న మొక్కజొన్న పైరు పూతదశలో ఉంటే నీటిని సమృద్ధిగా అందచేస్తూ నాల్గవ దఫా నత్రజని ఎరువును ఎకరాకు 50 కిలోల యూరియా రూపంలో పైపాటుగా వేయాలి.

❖ కాండం కుళ్ళు తెగులు ఆశించే ప్రాంతాల్లో పూతదశ నుండి పైరు బెట్టకు గురి కాకుండా చూడాలి. పొడతెగులు ఆశిస్తే నేలకు దగ్గరగా ఉన్న తెగులు సోకిన 1-2 ఆకులను తీసివేయాలి. కలుపు లేకుండా శుభ్రమైన వంటసాగును అవలంబించాలి. ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి పొడతెగులును నివారించుకోవచ్చు.

❖ ప్రస్తుత యాసంగిలో బాగా ఆలస్యంగా విత్తిన మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గమనించారు. పైరు మోకాలు ఎత్తు నుండి పూతదశకు వచ్చే వరకు పురుగు నివారణకు తగిన చర్యలు చేపట్టాలి. దీని నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా స్పినిటోరమ్ 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పైరుపై మొక్కజొన్న సుడి తడిచేటట్లు పిచికారీ చేయాలి. ఇసుక, సున్నం కలిపిన మిశ్రమాన్ని 9:1 నిష్పత్తిలో ఎకరానికి 10 కిలోలు మొక్క సుడిలో పడునట్లుగా వేయాలి.

**చిరుధాన్యాలు :**

**జొన్న:** ఆలస్యంగా, నీటి పారుదల కింద వేసిన జొన్న పంటకు గింజ పాలుపోసుకునే దశలో బెట్టకు గురికాకుండా ఒక నీటి తడి ఇవ్వాలి. వర్షాధారంగా నల్లరేగడి పొలాల్లో విత్తిన జొన్న పంట కోతకు వస్తుంది. కంకుల్లో గింజ కింద భాగాన నల్లటి చార ఏర్పడిన తరువాత కోతను చేపట్టాలి. గింజలో తేమ శాతం 10% వరకు వచ్చేవరకు ఎండబెట్టుకొని నిల్వ చేసుకోవాలి.

**సజ్జ:** జనవరి మాసంలో విత్తుకున్న సజ్జ పంట పూత దశలో ఉంటుంది. బెట్ట నుండి పంటను కాపాడటానికి నీటితడులు ఇవ్వాలి. తుప్పు తెగులు ఆశించినప్పుడు మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. మొక్కలు చిన్నగా ఉన్నట్లైతే అంతరకృషి చేసుకోవాలి.

**రాగి:** రాగి పంట పూత దశలో ఉంటుంది కావున పంట బెట్టకు గురికాకుండా నీటి తడులు ఇవ్వాలి. మొక్కల పైన అగ్గితెగులు గమనించినట్లైతే 1 గ్రా. కార్బండాజిమ్ 2.5 గ్రా. లేదా మ్యాంకోజెబ్ 2 మి.లీ. లేదా హెక్సాకొనజోల్ లేదా ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

**కొర్ర:** కొర్ర పంట పూత దశలో ఉన్నట్లైతే బెట్టకు గురికాకుండా నీటితడులు ఇవ్వాలి.

**వేరుశనగ :** యాసంగిలో సాగు చేసిన వేరుశనగ పంట ప్రస్తుతం కోతదశలో ఉంది. అదేవిధంగా పత్తి తరువాత ఆలస్యంగా సాగు చేసిన పంట ప్రస్తుతం గింజ పట్టే దశలో ఉంది. ఈ పరిస్థితులలో పంట నీటి ఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలి.

- ❖ కోత సమయంలో కాయలు 70 నుండి 80% వరకు పక్వానికి వచ్చినప్పుడు మాత్రమే కోత చేపట్టాలి.
- ❖ ప్రస్తుతం వేరుశనగ కోత చేపట్టే యంత్రాలు కూడా అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా కూలీల కొరతను నియంత్రించవచ్చు. కోతానంతరం కాయలను 8-9% తేమ వచ్చే వరకు ఆరబెట్టాలి.
- ❖ ఆలస్యంగా సాగు చేసిన వేరుశనగలో ఆకుమచ్చ తెగులు వచ్చే అవకాశం ఉంది కాబట్టి తెగులును గమనించిన వెంటనే ఒక ఎకరానికి 400 గ్రాముల క్లోరోథాలోనిల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ శిలీంధ్రనాశిని తుప్పు తెగులును కూడా అరికడుతుంది.
- ❖ కాండం కుళ్ళు తెగులును గమనించినప్పుడు ఒక లీటరు నీటికి 1 మి.లీ టెబ్యుకొనజోల్ కలిపి మొదళ్ళు తడిచేట్లు పిచికారీ చేసుకోవాలి.

**ఆముదం :** యాసంగిలో సాగు చేసిన ఆముదం ప్రస్తుతం రెండో గెల దశలో ఉంది. ఈ పరిస్థితులలో పంటను నీటి ఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలి.

- ❖ వేసవిలో రసంపీల్చే పురుగుల ఉధృతి అధికంగా ఉంటుంది. నివారణకు 0.2 గ్రా. ఎసిటామిప్రిడ్ లేదా 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- ❖ ఎండు తెగులు గమనించినప్పుడు 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి మొదళ్ళు తడిచే విధంగా పిచికారీ చేయాలి.

**నువ్వులు :** వేసవిలో సాగు చేసిన నువ్వుల పంట ప్రస్తుతం 40-50 రోజుల దశలో ఉన్నది. ఈ దశలో పంట పూత, కాయలు వస్తాయి కాబట్టి నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

- ❖ బూడిద తెగులును గమనించినట్లైతే లీటరు నీటికి 3 గ్రా. గంధకం కలిపి పిచికారీ చేసుకోవాలి.

**కుసుమ :** యాసంగిలో సాగు చేసుకున్న కుసుమ పంట ప్రస్తుతం కోత దశలో ఉంది. కోత ఉదయాన్నే కోసినప్పుడు గింజలు రాలడం తక్కువగా ఉండటమే కాకుండా ముల్లు మెత్తగా ఉండి కోత సులభం అవుతుంది.

- ❖ కోసిన తరువాత గింజలో 5-8% తేమ వచ్చే వరకు ఆరబెట్టాలి. దీనివలన గింజ నాణ్యత తగ్గకుండా ఉంటుంది.

**పొద్దుతిరుగుడు :** వేసవిలో సాగు చేసిన పొద్దుతిరుగుడు పంట ప్రస్తుతం 40-50 రోజుల దశలో ఉన్నది. ఈ దశలో పైపాటుగా ఎకరాకు 16 కిలోల యూరియాను పంటకు అందించాలి.

- ❖ ఆకర్షక పత్రాలు వికసించే దశలో లీటరు నీటికి 2 గ్రా. బోరాక్స్ పొడిని కలిపి పిచికారీ చేసుకోవాలి.
- ❖ తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందే నెక్రోసిస్ తెగులును గమనించినట్లైతే లీటరు నీటికి 0.5 గ్రా. థయోమిథాక్సామ్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

**అపరాలు : పెసర, మినుము:** మెట్టలో అయితే విత్తిన వెంటనే ఎకరాకు లీటరు పెండిమిథాలిన్ 200 లీ. నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఊద, గడ్డిజాతి కలుపు నివారణకు వరి మాగాణుల్లో పైరు విత్తిన 20-25 రోజుల మధ్యలో ఎకరాకు 250 మి.లీ.

ఫినాక్సిప్రాప్-పి-ఇథైల్ లేదా 400 మి.లీ. క్విజలోపాప్ ఇథైల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసి ఊదను సమర్థవంతంగా నివారించుకోవచ్చు. ఊదతో పాటు వెడల్పాటి కలుపు జాతి మొక్కలు ఉన్నట్లైతే ఎకరాకు ఇమాజితాఫిర్ 200 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసి కలుపును సమర్థవంతంగా నివారించుకోవచ్చు.

**నీటి యాజమాన్యం:** బెట్ట పరిస్థితుల్లో అవసరం మేరకు కీలక దశల్లో 1-2 తడులు ఇస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. వేసవిలో నీటి పారుదల కింద పండిస్తారు. కానీ ఆలస్యంగా విత్తినప్పుడు చివరిలో పైరు బెట్టకు గురయ్యే అవకాశమున్నది. కాబట్టి అవకాశమున్నచోట పైరు పూత దశకు ముందుగా అనగా 30 నుండి 40 రోజుల వయస్సులో తేలికపాటి నీటి తడి ఇవ్వాలి. సాధారణంగా మొత్తం పంట కాలంలో 300-450 మి.మీ. నీరు అవసరం ఉంటుంది.

**సస్యరక్షణ:**

**తెల్లదోమ:** ఈ పురుగులు ఆకులలోని రసాన్ని పీల్చడమేకాక వల్లాకు తెగులును కూడా వ్యాపింపచేస్తాయి. తెల్లదోమ నివారణకు ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ప్రొఫెనోఫాస్ 2.0 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా మిథైల్ డెమటాన్ 2.0 మి.లీ. లీటరు నీటిలో కలుపుకొని పిచికారీ చేయవలెను

**తామర పురుగులు:** ఈ పురుగులు పైరు తొలి దశలో ఎక్కువగా ఆశించి ఆకుల్లో రసాన్ని పీల్చి నష్టాన్ని కలుగచేయటమే కాకుండా ఆకుముడత అనే వైరస్‌ను వ్యాపింపచేస్తాయి. తామర పురుగుల నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**కంది:** యాసంగి కంది ప్రస్తుతం పరిపక్వత దశ నుండి కోత దశలో ఉంది. 80% పైన కాయలు పరిపక్వత చెందినట్లైతే పంట కోతకు సిద్ధంగా ఉన్నట్లుగా నిర్ధారించి, పంటను కోసి 1-2 రోజులు చేనులోనే ఎండిన తర్వాత పంటను గూళ్ళుగా పెట్టి వారం పది రోజులకు నూర్పిడి చేసినట్లైతే గింజలోని తేమ చాలా వరకు తగ్గి, నూర్పిడి సులువుగా జరుగుతుంది. ఆ తర్వాత గింజలను 9-10% తేమ ఉండేవరకు బాగా ఎండనిచ్చి నిల్వ చేయాలి. కోతకు 3-5 రోజుల ముందు క్వినాల్‌ఫాస్ 25% ఇ.సి 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసినచో నిల్వలో పురుగు తాకిడిని ముఖ్యంగా బ్రూచిడ్స్ ఆశించకుండా కాపాడవచ్చు. నిల్వ చేసేటప్పుడు బాగా ఎండనిచ్చి ఆ తర్వాత ఏదైనా వంటనూనె 5 మి.లీ. కిలో గింజలకు పట్టించి నిల్వ చేస్తే నిల్వలో పురుగు ఉధృతిని తగ్గించవచ్చును.

**శనగ:**

**పంట కోత:** పంట పరిపక్వత దశకు చేరిన తర్వాత ఆకులు, కాయలు పసుపు రంగుకు మారి ఆ తర్వాత వరి గడ్డి రంగుకు మారతాయి. ఆకులు పూర్తిగా రాలిపోయి మొక్కలు ఎండిపోతాయి. మొక్కలను మొదలు వరకు కోసి కుప్పగా వేసుకొని ట్రాక్టర్‌తో తొక్కించి లేదా కర్రలతో కొట్టి కాయల నుండి గింజలను వేరు చేయాలి. యాంత్రికంగా కంబైన్డ్ హార్వెస్టర్‌తో కూడా పంటను కోయవచ్చును.

**కోతానంతర జాగ్రత్తలు:** పంట కోసిన తర్వాత గింజలు తగినంతగా ఎండే వరకు ఆరబెట్టాలి. నూర్పిడి యంత్రాలతో కానీ, చేతితోకానీ నూర్చుకోవచ్చు. దుమ్ము, ధూళి, తాలు గింజల విత్తనాలను తొలగించి నిల్వ చేయాలి. నిల్వ చేయడానికి విత్తనాలలో తేమ 9 శాతం మించకుండా చూడాలి.

**చెరకు :** ఈ వేసవి కాలంలో చెరకు పంట బాల్యదశలో ఉంటుంది. ఇది చాలా కీలకమైన తేమ సున్నితమైన దశ.

అనుకూలమైన వాతావరణ పరిస్థితులలో మొక్క మోడెం తోటలు బాల్యదశలో ఎక్కువ సంఖ్యలో పలకలు అభివృద్ధి చెంది, తర్వాత పంట ఏపుగా ఎదిగే దశకు చేరుకుంటాయి. నీటి ఎద్దడి, అధిక ఉష్ణోగ్రత వలన మొక్క ఒత్తిడికి లోనై తోటలలో పిలకల సంఖ్య క్రమేపి తగ్గి, దీని ప్రభావం తోట ఎదుగుదలపై ఉండి దిగుబడి గణనీయంగా తగ్గుతుంది.

- ఆలస్యంగా నాటిన చెరకు తోటలకు పోషక లోపాలతో పాటు చీడపీడల బెడద కూడా ఎక్కువగా ఉంటుంది. మోడెం సాగులో ఇనుము, జింక్, మాంగనీసు ధాతువుల లోపాలు ఎక్కువగా కనబడుతుంటాయి. కావున బాల్యదశలో ఉన్న చెరకును నీటి ఎద్దడి, ఎండతీవ్రత బారిన పడకుండా తగు యాజమాన్య పద్ధతులు పాటించాలి.
- ఇనుప ధాతువు లోపం వల్ల ఆకులు పాలిపోయి లేత పసుపు రంగు నుండి తెలుపు రంగుకు మారుతాయి. ఈ లక్షణాలు ఈనెల మధ్యభాగంలో ఏర్పడి ఈనెలకు సమాంతరంగా రేఖలుగా ఆకులకు పొడవునా చారలు ఏర్పడతాయి. ఉధృత దశలో ఉన్నప్పుడు లేత ఆకులు పూర్తిగా తెల్లగా మారతాయి. ఇనుము లోపం కనిపించిన వెంటనే ఒక శాతం అన్నభేధిని (ఫెర్రస్ సల్ఫేట్) మొక్కలపై పిచికారీ చేసి లోపాన్ని సరిదిద్దుకోవాలి. లీటరు నీటికి 10 గ్రా. అన్నభేధి చొప్పున ఒక బద్ద నిమ్మకాయ లేదా 2 గ్రా. నిమ్మ ఉప్పు కలుపుకొని వారం, పది రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేసుకోవాలి.
- జింకు లోపం కనిపించిన మొక్కలలో ఆకుల ఈనెల వెంబడి పసుపు రంగు చారలు ఏర్పడి, లోపం ఎక్కువ అయినప్పుడు పెరుగుదల నిలిచిపోతుంది. దుబ్బు చేయడం నిలిచిపోయి, కొత్తగా ఏర్పడిన పిలకలు నిర్వీర్యం అవుతాయి. లోపం కనిపించిన తోటలకు లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్ (0.2% ద్రావణం) చొప్పున వారం వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి. ఆఖరి దుక్కిలో ముందుగానే ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ చొప్పున నేలలో వేసినట్లైతే లోపం రాకుండా నివారించవచ్చు.
- కార్శి తోటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులను పాటించకపోవడం వలన కార్శితోటలలో సగటు చెరకు దిగుబడులు పెరగకపోవడం ప్రధాన కారణం. అందువలన చెరకు సాగు వేసే రైతులు వివిధ రకాల ఎంపిక నుండి మొక్క తోటలను సకాలంలో నరకటం వరకు జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. చెరకును నరికిన తరువాత కార్శి చేయడం వలన విత్తనపు ఖర్చుతో పాటు పొలం తయారీ ఖర్చు తగ్గి చెరకు సాగులో ఎంతో లాభం చేకూరుతుంది. దిగుబడుల విషయంలో మొక్క తోటలలో కన్నా కార్శి తోటలలో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చు. మోడు చెక్కిన 10-20 రోజుల లోపల భూమిలో తగినంత పదును ఉన్నప్పుడు రెండు సాళ్ల వరుసల మధ్య దుక్కి చేసి భూమి గుల్ల బారేటట్లు చేయాలి. మొక్క తోట వేర్లు నశించి ప్రతి పిలకల నుండి కొత్త వేరు అభివృద్ధి చెందుతుంది. దీని వలన కార్శి తోటల వేర్లకు ప్రాణ వాయువు సక్రమంగా అందుతుంది. అంతేకాకుండా తడులు పెట్టినప్పుడు నీరు భూమిలోకి ఇంకి కార్శి పిలకలు నీరు, పోషకాలు సమాంతరంగా తీసుకుంటాయి.

(ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో..)



# వాతావరణం - పంటల పరిస్థితి

డా.పి.లీలా రాణి, ప్రధాన శాస్త్రవేత్త – హెడ్, డా.ఎస్.జి.మహాదేవప్ప, సీనియర్ శాస్త్రవేత్త
వ్యవసాయ వాతావరణ పరిశోధనా కేంద్రం, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, రాజేంద్రనగర్, ఫోన్. 040-29556164

రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల (జూన్ నుండి సెప్టెంబర్) కాలంలో 962.6 మి.మీ వర్షపాతం (+30 శాతం), పోస్ట్ మాన్సూన్ సీజన్‌లో (అక్టోబర్ నుండి డిసెంబర్) 86.5 మి.మీ వర్షపాతం (-24 శాతం), చలి కాలంలో (జనవరి నుండి ఫిబ్రవరి) 0.2 మి.మీ వర్షపాతం (-98 శాతం) నమోదయింది.

రాష్ట్రంలో యాసంగి పంటకాలానికి ఇప్పటి వరకు (27.02.2025) సాధారణ విస్తీర్ణంలో (ఎకరాలలో) వరి - 113 శాతం (5324752), జొన్న - 152 శాతం (212214), మొక్కజొన్న - 127 శాతం (750840), కంది - 181 శాతం (5798), శనగ - 66 శాతం (219398), పెసర - 37 శాతం (8550), మినుములు - 89 శాతం (42735), ఉలవలు - 32 శాతం (372), వేరుశనగ - 90 శాతం (235810), పొద్దుతిరుగుడు - 74 శాతం (16840), కుసుమ - 57 శాతం (6771) సాగు చేశారు. ఈ సంవత్సరం యాసంగి పంటకాలంలో ఇప్పటి వరకు 109 శాతం మేర పంటలు సాగుచేశారు. ఇందులో ఆహార పంటలు 115 శాతం, పప్పుదినుసులు 67 శాతం, నూనె గింజల పంటలు 79 శాతం సాగుచేశారు.

భారత వాతావరణ విభాగం న్యూఢిల్లీ వారి ముందస్తు వాతావరణ సూచనల ప్రకారం రాష్ట్రంలో మార్చి మాసంలో కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం నుండి సాధారణం కంటే ఎక్కువ నమోదయ్యే సూచనలున్నాయి. వర్షపాతం సాధారణం నుండి సాధారణం కంటే తక్కువ నమోదయ్యే సూచనలున్నాయి.

### వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు :

- నీటి వసతి గల ప్రాంతాలలో పచ్చిమేత కొరకు పశుగ్రాస పంటలుగా జొన్న, మొక్కజొన్న పంటలను వేసుకోవచ్చును. తక్కువ నీటి వసతి గల ప్రాంతాలలో పశుగ్రాస పంటలుగా సజ్జ, బొబ్బర్ల పంటలను వేసుకోవచ్చును.
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కారణంగా నీటి వసతి తక్కువ ఉన్న ప్రాంతాలలో ఆరుతడి పంటలకు నేల స్వభావం బట్టి 10-15 రోజుల వ్యవధిలో తేలికపాటి నీటి తడులు ఇవ్వాలి.
- వరి పంట దుబ్బు చేసే దశ నుండి అంకురం దశ వరకు పొలంలో 2 సెం.మీ. నీరు నిలువ ఉంచాలి. అంకురం దశ నుండి పూత దశ వరకు నీటి లభ్యతని బట్టి పొలంలో 2 సెం.మీ. నుండి 5 సెం. మీ. నీరు నిలువ ఉంచాలి.
- మొక్కజొన్న పూత దశ ఏర్పడే 10 రోజుల ముందు నుండి కంకి ఏర్పడిన 25 రోజుల తర్వాత వరకు పంట బెట్ట పరిస్థితులను తట్టుకోలేదు కావున రైతులు పైరుకు జీవసంరక్షక నీటి తడి ఇవ్వాలి.
- పూత దశలో ఉన్న పెసర, మినుము పంటలకు (35-40 రోజుల) తేలికపాటి నీటి తడి ఇవ్వాలి.

- యాసంగిలో ఆలస్యంగా సాగు చేసిన వేరుశనగ గింజ అభివృద్ధి దశలో ఉంది. ఈ దశలో నీటి ఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలి.
- 40 నుండి 50 రోజుల దశలో ఉన్న నువ్వుల పంట పూత, కాయ ఏర్పడుతుంది కాబట్టి పంటను నీటి ఎద్దడికి గురి కాకుండా చూసుకోవాలి.

ఈ మాసంలో నెలకొనే వాతావరణ పరిస్థితులు ఈ కింద ఉదహరించిన పురుగులు తెగులు వివిధ పంటలలో ఆశించడానికి అనుకూలం.

- ఈ మాసంలో వరిలో అగ్గి తెగులు ఆశించడానికి అనుకూలం. నివారణకు, 0.6 గ్రా. ట్రైసైక్లాజోల్ లేదా 1.5 మి.లీ. ఐసోప్రొథైయోలిన్ లేదా 2.5 మి.లీ. కాసుగామైసిన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ఈ మాసంలో వరిలో కాండంతొలిచే పురుగు ఆశించడానికి అనుకూలం. నివారణకు, పిలకలు లేదా దుబ్బు చేసే దశలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకి 10 కిలోల చొప్పున వేసిన రైతులు పొట్ట దశలో 0.3 మి. లీ. క్లోరాంట్రానిలిప్రోల్ లేదా 0.5 మి.లీ. టెట్రానిలిప్రోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ఈ మాసంలో వరిలో ఆకునల్లి, కంకినల్లి ఆశించడానికి అనుకూలం. నివారణకు, 1 మి.లీ. స్పైరోమేసిఫిన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి (కంకివెన్ను 10 శాతం కన్న తక్కువ ఉన్నప్పుడు మందుల పిచికారీ చేసుకోవాలి, కంకివెన్ను 10 శాతం కన్న ఎక్కువ పైకి వచ్చినట్లయితే మందుల పిచికారీ చేస్తే దిగుబడి తగ్గుతుంది).
- మొక్కజొన్నలో అధిక ఉష్ణోగ్రతలు, భూమిలో ఎక్కువ తేమ వలన పాము పొడ తెగులు ఆశించడానికి అనుకూలం. నివారణకు,
- తెగులు ఆశించిన కింది భాగంలోని (1లేదా 2) ఆకులను తీసివేయాలి
- 1మి.లీ. ప్రోపికనజోల్ లేదా 2మి.లీ. హెక్సాకొనజోల్ లేదా 2 మి.లీ. వాలిడామైసిన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- మొక్కజొన్నలో కాండంకుళ్ళు తెగులు ఆశించే ప్రాంతాలలో పంట బెట్టకు గురికాకుండా చూసుకోవాలి.
- ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతల వలన పెసర, మినుము పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగి పల్లాకు తెగులు ఆశించడానికి అనుకూలం. నివారణకు,
- ముందు జాగ్రత్త చర్యగా ఎకరానికి 10 పసుపు రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలి.
- ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు 2మి.లీ. ఫిప్రోనిల్ లేదా 1.5గ్రా. ఎసిఫేట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పెరుగుతున్న ఉష్ణోగ్రతల వలన నువ్వుల పంటలో రసంపీల్చే పురుగులు ఆశించడానికి అనుకూలం. నివారణకు, 1.0 గ్రా. ఎసిఫేట్ లేదా లేదా 0.3 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- టమాటలో తామర పురుగుల ఉధృతి పెరిగి టమాట స్పాటెడ్ విల్ట్ వైరస్ తెగులు ఆశించడానికి అనుకూలం. నివారణకు తెగులు సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి. తామరపురుగుల నివారణకు 2మి.లీ. మిథైల్ డెమటాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

❖ పెరుగుతున్న ఉష్ణోగ్రతల వలన తీగజాతి కూరగాయ పంటలలో పెంకు పురుగు ఆశించడానికి అనుకూలం. నివారణకు, 2 మి.లీ. క్లోరిపైరిఫాస్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

❖ పెరుగుతున్న ఉష్ణోగ్రతల వలన తీగజాతి కూరగాయ పంటలలో పెనుబంక ఆశించడానికి అనుకూలం. నివారణకు మిథైల్ డేమటాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

❖ వేసవిలో తీగజాతి కూరగాయ పంటలో పండు ఈగ బెడద ఎక్కువగా ఉంటుంది. నివారణకు పండు ఈగ (క్యూలూర్) ఎరలను ఎకరానికి 4-8 చొప్పున అమర్చుకోవాలి.

❖ వేసవిలో తీగజాతి కూరగాయ పంటలో రసంపీల్చే పురుగుల ఉధృతిని తగ్గించుకోవడానికి పసుపు, నీలం, తెలుపు రంగు జిగురు అట్టలను పొలంలో ఎకరానికి 20-30 వరకు పెట్టాలి.

❖ పెరుగుతున్న ఉష్ణోగ్రతల వలన బొప్పాయి పంటలలో రింగ్ స్పాట్ వైరస్ తెగులు ఆశించడానికి అనుకూలం. పెనుబంక నివారణకు, 1.5గ్రా. ఎసిఫేట్ లేదా 2 మి.లీ. ఫిప్రోనిల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

❖ మామిడిలో 75 శాతం పిందె కట్టిన తోటల్లో తేలికపాటి మొదటి తడి ఇవ్వాలి.

❖ మామిడిలో తేనెమంచు పురుగులు, తామర పురుగుల నివారణకు పూమొగ్గ దశలో 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ లేదా 0.3 గ్రా. థయోమిథక్సిన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాయలు బటాని గింజ సైజులో ఉన్నప్పుడు 1.5గ్రా. ఎసిఫేట్ లేదా మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

❖ మామిడిలో తేనెమంచు పురుగులు, తామర పురుగులు, బూడిద తెగులుతో పాటు నీటి ఎద్దడి మామిడిలో కాయ రాలడానికి అనుకూలం. పురుగు నివారణతో పాటు తోటకు 1%యూరియా లేదా 1% నత్రజని, పొటాషియం మిశ్రమ మందును (13-0-45) మామిడి కాయలు నిమ్మపండు పరిమాణంలో ఉన్నప్పుడు 20 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

❖ మామిడిలో పిందె రాలడం నివారించడానికి 2.5 మి.లీ. ప్లానోఫిక్స్ మందును 10 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.


Statement about ownership and other particulars of periodical **VYAVASAYA PADI PANTALU** to be published in the first issue of every year after the last day of February.

**Form IV (See Rule 8)**

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | Hyderabad |
| 2. Periodicity of it's publication | : | Monthly |
| 3. Printer's Name | : | Dr. B. Gopi |
| Whether citizen of India | : | Indian |
| Address | : | Director of Agriculture, Opposite to L.B. Stadium, Basheerbagh, Hyderabad - 500001, Telangana State |
| 4. Publisher's Name | : | Dr. B. Gopi |
| Whether citizen of India | : | Indian |
| Address | : | Director of Agriculture, Opposite to L.B. Stadium, Basheerbagh, Hyderabad - 500001, Telangana State |
| 5. Editor's Name | : | K. Vijay Kumar |
| Whether citizen of India | | Director of Agriculture, |
| Address | | Opposite to L.B. Stadium, Basheerbagh, Hyderabad - 500001, Telanagana State. |
| 6. Name and addresses of the individuals who own the newspaper | : | Dr. B. Gopi |

I, Dr. B. Gopi, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-

Date : 1st March, 2025 (Dr. B. Gopi)

Signature of the Publisher



# వేసవి అవరాలలో సస్యరక్షణ

టి.లక్ష్మణ్, శాస్త్రవేత్త, సి.యమున, శాస్త్రవేత్త, ఎం.రత్నమాల, వైపి-1, డాట్ సెంటర్, తాండూర్.

తెలంగాణ రాష్ట్రంలో పండించే పంటలలో ఒకటి అయిన పత్తిని ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. కానీ ప్రత్తిని ఆశించే గులాబి రంగు పురుగు వల్ల రైతులు ఎక్కువగా నష్టాల బాట పడుతున్నారు. కావున దీనికి ప్రత్యామ్నాయంగా పత్తి పంటను తీసిన తర్వాత లేదా రబీ మొక్కజొన్న, వేరుశనగ తర్వాత లేదా పసుపు తీసిన తర్వాత లేదా రబీ వరి వేయని మాగాణి భూముల్లో 2 లేదా 3 నీటి తడులు ఇచ్చే సదుపాయం ఉన్నటువంటి పరిస్థితుల్లో వేసవి పంటగా స్వల్పకాలిక పంట అయిన పెసర మినుము సాగు చేయవచ్చు. దీని వల్ల రైతులు అధిక దిగుబడి పొందడమే కాక, గృహ అవసరాలకు పప్పుదినుసులు అందుబాటులోకి వస్తాయి. అంతేగాక రైతులకు ఆర్థికంగా లాభసాటిగా ఉంటుంది.

వర్షాకాలంలో ఉండే వాతావరణ పరిస్థితులతో పోల్చితే వేసవిలో ఉండే వాతావరణ ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గులు, గాలిలో తక్కువగా ఉండే తేమ, బెట్ట పరిస్థితుల్లో పెసర - మినుము పంటలలో రసం పీల్చుపురుగుల బెడద ఎక్కువగా ఉంటుంది. దాని వలన వైరస్ తెగుళ్ళు ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. కావున ఈ వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ కీటకాలు, తెగుళ్ళ ఉధృతి సకాలంలో గుర్తించి తగిన నివారణ చర్యలు పాటిస్తే రైతులు అధిక దిగుబడిని పొందగలుగుతారు.

వేసవిలో పెసర - మినుము పంటలలో వచ్చే రసం పీల్చు పురుగులు చూసినట్లయితే తామర పురుగు, చిత్తపురుగులు, తెల్లదోమ, పేనుబంక ఎక్కువ ఆశిస్తాయి. అదే విధంగా వైరస్ తెగుళ్ళలో పల్లాకు తెగులు, సీతాఫలం తెగులు ఎక్కువ నష్టాన్ని కలుగజేస్తాయి.

**తెల్లదోమ :** పొడి వాతావరణం, 7-10 రోజుల బెట్ట కాలం ఉన్నట్లయితే తెల్లదోమ పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. ఈ పురుగులు ఆకుల్లోని రసాన్ని పీల్చి ఎల్లోమొజాయిక్ అనే వైరస్‌కు ప్రవేశ కారకాలుగా పనిచేస్తాయి. అంతేగాక మొక్కల్లోని రసాన్ని పీల్చేటప్పుడు ఈ వైరస్ మొక్కలోకి ప్రవేశించి ఆకులను పసుపు పచ్చ రంగుకు మారుస్తాయి. దీనిని పల్లాకు తెగులు అని అంటారు.

తెల్లదోమ నివారణకు 0.2 గ్రా. ఎసిటామిప్రిడ్ లేదా 1.5గ్రా. డైఫెన్ థయూరాన్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**చిత్తపురుగులు :** ఈ పురుగులు పైరుపై రెండు ఆకుల దశలో ఆశించి రంధ్రాలు చేస్తాయి. వీటి బెడద ఎక్కువగా ఉన్నప్పుడు నివారించకపోతే 80 శాతం మొక్కలు ఈ దశలోనే చనిపోతాయి.

చిత్తపురుగుల నివారణకు 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ లేక ఎసిఫేట్ 1గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**తామర పురుగులు :** పొడి వాతావరణం, పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు, బెట్ట వాతావరణంలో తామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. తామర పురుగులు మొక్కను తొలి దశలో ఆశించి లేత ఆకులపై వృద్ధి చెంది ఆకుల అడుగు నుండి రసాన్ని పీలుస్తాయి. అప్పుడు ఆకులు డొప్పగా మారతాయి. మొక్క నుండి రసాన్ని పీల్చడం ద్వారా మొక్కలు గిడసబారి ఎదుగుదల తగ్గిపోతుంది. అంతేగాక ఆకుముడత అనే వైరస్ వ్యాధిని కూడా వ్యాపింపచేస్తుంది. పూత దశలో ఆశించినట్లయితే పూతరాలి, కాయలు ఏర్పడవు. కాయ తొడిగే దశలో ఆశించినట్లయితే కాయలు వంకరలు తిరిగిసరిగా ఎదగక, గింజలు తాలుగా మారతాయి.

తామర పురుగుల నివారణకు ఎసిఫేట్ 75 యస్.పి 1 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

### పెసర, మినుము పంటలను ఆశించే వైరస్ తెగుళ్ళు వాటి నివారణ :

**సెర్కోస్పోరా ఆకుమచ్చ తెగులు:** ఈ తెగులు సోకిన ఆకులపై గోధుమ రంగు గుండ్రని చిన్న చిన్న మచ్చలు

కనిపించి అనుకూల వాతావరణ పరిస్థితుల్లో ఈ మచ్చలు పెద్దవై ఆకులు ఎండి రాలిపోతాయి. దీని వలన కాయల్లో గింజలు సరిగా నిండవు. దీని నివారణకు లీటరు నీటికి 2.5 గ్రాముల మాంకోజెబ్ లేదా 1 గ్రా. క్లోరోథలోనిల్ లేదా 1 గ్రాము కార్బెండజిమ్ లేదా 1 గ్రా. థయోఫానేట్ మిథైల్‌లను కలిపి వాడటం ద్వారా ఆకుమచ్చ తెగులుతో పాటు బూడిద తెగులును కూడా నివారించవచ్చు.

**బూడిద తెగులు:** ఈ తెగులు విత్తిన 30-35 రోజుల తర్వాత గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు, ముదురు ఆకులపై, బూడిద రూపంలో చిన్న చిన్న మచ్చలుగా కనపడి, అవి క్రమేణా పెద్దవై ఆకులపైన, కింది భాగాలకు, కొమ్మలు, కాయలకు వ్యాపిస్తుంది. నివారణకు లీటరు నీటికి 1 గ్రాము కార్బెండజిమ్ లేదా 1గ్రా థయోఫానేట్ మిథైల్ లేదా 1 మి.లీ. కెరాథేన్ లేదా 2 మి.లీ. హెక్సాకొనజోల్ లేదా మైక్లోబూటానిల్ 0.5గ్రా. లేదా డైఫెన్ కొనాజోల్ 1.0 మి.లీ. కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. నిర్దేశించిన కాలంలో విత్తుకోవాలి. మొక్కల సాంద్రత సరిపడా వుండాలి. తెగులును తట్టుకునే రకాలను విత్తుకోవాలి.

**బాక్టీరియల్ బ్లైట్ :** ఈ తెగులు సోకిన మొక్కల ఆకులపై గోధుమ వర్ణంలో చిన్న చిన్న మచ్చలు కనిపిస్తాయి. ఈ తెగులు నివారణకు లీటరు నీటికి 3గ్రా. కాపర్ ఆక్సిక్లోరైడ్, 100 మి.గ్రా. ప్లాంటోమైసిన్‌ను కలిపి 12 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

**ఆకుముడత తెగులు (మొవ్వుకుళ్ళు):** ఇది వైరస్ జాతి తెగులు. తామర పురుగుల ద్వారా ఈ తెగులు ఒక మొక్క నుండి వేరొక మొక్కకు వ్యాపిస్తుంది. తెగులు ఆశించిన మొక్కల ఆకుల అంచులు వెనుకకు ముడుచుకుని మెలికలు తిరిగి గిడసబారి రాలిపోతాయి. ఆకుల అడుగుభాగంలోని ఈనెలు రక్తవర్ణాన్ని పోలి ఉంటాయి. లేత దశలో వ్యాధి సోకినట్లయితే తలలు మాడి మొక్కలు ఎండిపోతాయి. ముదురు దశలో తెగులు పాక్షికంగా ఉండి అతి తక్కువ కాపు ఉంటుంది. ఈ తెగులు సోకిన మొక్కలను పీకి తగులబెట్టటం ద్వారా పైరులోని ఇతర మొక్కలకు వ్యాపించకుండా



అరికట్టవచ్చు. నివారణకు లీటరు నీటికి 1 గ్రాము ఎసిఫేట్ లేక 1.5 మి.లీ. ఫిప్రోనిల్ మందును కలిపి పిచికారీ చేయాలి. ఎం.జి.జి. -295, ఎల్.బి.జి. - 460 పెసర రకాలు ఈ తెగులును కొంతవరకు తట్టుకొంటాయి.

**పల్లాకు తెగులు :** పొడి వాతావరణం, బెట్ట పరిస్థితులు, తేమ ఎక్కువగా ఉండటం వల్ల వేసవిలో సాగుచేసే పెసర, మినుము పంటలో తెగులు తీవ్రంగా ఉండటమే గాక అధిక నష్టాన్ని కలిగిస్తుంది.పల్లాకు తెగులు తెల్లదోమ ద్వారా జెమిని వైరస్ అనే వైరస్ వల్ల సోకుతుంది. ఈ వైరస్ తెగులు సోకిన కలుపు మొక్కలు లేదా పిల్లిపెసర నుండి మినుము, పెసర పంటకు తెల్లదోమ ద్వారా వ్యాపిస్తుంది. తెగులు మొదటగా లేత ఆకులపై ప్రకాశవంతమైన పసుపు మచ్చలుగా ఏర్పడి క్రమేపి నిండు పసుపు రంగుకు మార్పు చెందుతుంది. ఆకులపైన పసుపు, ఆకుపచ్చ మచ్చలు కనిపిస్తాయి. అందువల్ల ఈ తెగులును మొజాయిక్ తెగులు అంటారు. తెగులు ఆశించిన మొక్కలు ఆలస్యంగా మొగ్గ తొడిగి పూత, కాయ తక్కువగా ఉంటుంది. కాయదశలో తెగులు సోకినట్లయితే గింజలు పసుపు రంగుకు మారతాయి, తాలు గింజలు కూడా ఏర్పడతాయి.

**ఈ తెగులు నివారణకు చేపట్టవలసిన చర్యలు :**

- విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి.
- పంట విత్తే సమయంలో పొలం చుట్టూ నాలుగు వరుసల్లో మొక్కజొన్న/ జొన్న/ సజ్జ పంటను విత్తుకుంటే పక్క పొలం నుంచి తెల్లదోమ పురుగు రాకుండా నివారించవచ్చు.

# మిరప కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఎండి సాదిక్ పాషా, కె.నాగరాజు, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం
డా.ఎ.నిర్మలా, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం

తెలుగు రాష్ట్రాలలో ప్రధాన వాణిజ్యపంటల్లో మిరప అత్యంత ముఖ్యమైన పంటగా మారుతోంది. మిరప సాగులో తెలుగు రాష్ట్రాల రైతులు అత్యధిక ఆసక్తి చూపిస్తున్నారు. మన దేశం మిరప సాగు ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉంది. వర్షాధారం ద్వారా సాగుచేసే రైతులు ఎండుమిర్చి కోసం నీటి వసతి ఉన్న చోట



ఆరుతడి పంటగా పచ్చిమిరపను కూడా సాగుచేస్తున్నారు. మిరపలో కాయకోత దశ అత్యంత కీలకం. కాయనాణ్యతపైనే మార్కెట్ ధర ఆధారపడి ఉంటుంది. ఎటువంటి అశ్రద్ధ చేసినా, తాలుకాయ ఎక్కువ వచ్చి, రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంటుంది. నీటివసతి కింద మిరప పండించే రైతులు జనవరి నుంచి మార్చి మాసాల వరకు మిరప కోతలు చేస్తుంటారు. నీటి వసతికింద అక్టోబరు మాసంలో సాగుచేసిన

---

- పొలంలో అక్కడక్కడా ఎల్లో స్టికీ ట్రాప్‌లను ఉంచినట్లయితే తెల్లదోమలు స్టికీ ట్రాప్స్‌కు అతుక్కొని చనిపోతాయి. ఉధృతిని అరికట్టవచ్చును.
- 5% వేప కషాయం లేదా వేపగింజల నూనె 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసినట్లయితే తెల్లదోమను అరికట్టవచ్చును.
- పెసరలో డబ్లు. జి. జి-37, డబ్లు. జి. జి-42, ఎం.జి.జి - 351 రకాలు అదేవిధంగా మినుములో ఎల్.బి.జి - 752, ఎల్.బి.జి-787, పి.యు-31 రకాలు పల్లాకు తెగులును కొంత వరకు తట్టుకోగలవు.
- తెల్లదోమ నివారణకు లీటరు నీటికి 1.5 మి.లీ.ల ట్రైజోఫాస్ లేదా 1.0 గ్రా.ల ఎసిఫేట్ లేదా 0.3 గ్రా.ల ఎసిటామిప్రిడ్ మందును కలిపి పిచికారీ చేసి ఈ పురుగును అరికట్టవచ్చును.

**సీతాఫలం తెగులు :** పొడి వాతావరణం, బెట్ట పరిస్థితులలో, పేనుబంక ద్వారా ఈ తెగులు సోకుతుంది. ఈ వైరస్ తెగులు సోకిన మొక్కల లేత ఆకులు, కాడలు, ఆకులు పెద్దవిగా మారి ఆకుపై ఉబ్బెత్తుగా అయి ముడుతలు పడి సీతాఫలం కాయ మాదిరిగా కనిపిస్తుంది. ఆకులు ముదురు ఆకుపచ్చ రంగుకు మారుతాయి. ఈ తెగులు 70% వరకు విత్తనం ద్వారా కూడా వ్యాప్తి చెందుతుంది.

- పేనుబంక నివారణకు విత్తనశుద్ధి తప్పని సరిగా చేసుకోవాలి.
- ఎసిఫేట్ 1.0 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**బంగారు తీగ (కస్కుటా):** వరి మాగాణుల్లో బంగారు వన్నెగల సన్నని తీగ పైరుపై వ్యాపించి మొక్కలనుండి రసం పిలుస్తుంది. దీని వలన పైరు ఎదగక క్షీణించిపోతుంది. ఈ తీగ పైరుపై కనిపించిన వెంటనే తీగ వ్యాపించిన మొక్కలతో పాటు పీకి కాల్చి వేయాలి. దీని ఉధృతి ఎక్కువగా ఉన్నచోట పైరు 20 రోజులప్పుడు "ఇమిజిథిర్" (పర్స్యూట్) అనే కలుపు మందును ఎకరాకు 200 మి.లీ. చొప్పున పిచికారీ చేసి 5-7 రోజుల లోపల పైరుపై 1.0% యూరియాను పిచికారీ చేయాలి. అశ్రద్ధ చేస్తే ఇది పైరంతా పాకి విత్తనాల ద్వారా ప్రతిసంవత్సరం పొలంలో కనిపించి పైరును నష్టపరుస్తుంది.





మిరపతోటల్లో కాయకోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మార్కెట్లో అధిక ధర పొందాలంటే మిరప కోత సమయంలో, కోత అనంతరం ఈ జాగ్రత్తలు పాటించాలి.

**కోత కోసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

- ❖ మిరప పంట కోతకు కనీసం 15 నుంచి 20 రోజుల ముందు, పురుగు మందులు లేదా రసాయనాలను పిచికారీ చేయకూడదు. అలాగే కోతకు ముందు పంటకు నీటి తడులు ఇవ్వరాదు.

**కోత సమయంలో పాటించవలసిన జాగ్రత్తలు:**

- ❖ మిరపకాయల్ని మొక్క మీదే ఎక్కువగా పండనిస్తే కాయలు ముడతలుపడతాయి. సూర్యకాంతి ఎక్కువగా పడటం వల్ల రంగు తగ్గి నాణ్యత కోల్పోతాయి.
- ❖ మొక్క మీద పక్వానికి వచ్చిన రంగు కలిగిన కాయలను వాతావరణం వేడిగా ఉన్నపుడు మాత్రమే కోయాలి.
- ❖ సాధ్యమైనంత వరకు తెగుళ్ళ,పురుగులు ఆశించిన కాయలను కోత సమయంలో వేరు చేయడం వలన మంచి ధరను పొందవచ్చు.
- ❖ వర్షాధారంగా సాగు చేసే మిరపపంటలో 3-4 కోతలు, నీటి తడి ఆధారంగా సాగుచేసే మిరప పంటలో 6 నుంచి 8 సార్లు కోతలను ఆశించవచ్చు.

**మిరప కోత అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు :**

- ❖ పంట నుంచి కోసిన కాయలను కుప్పగా పోసి టార్పాలిన్ తో ఒక రోజంతా కప్పి ఉంచాలి. ఇలా చేస్తే కాయలు అన్నీ ఒకేలా పండుతాయి. తర్వాత కాయలను పాలిథీన్ పట్టాలపై లేదా శుభ్రం చేసిన కాంక్రీటు కల్లాల మీద ఆరబెట్టాలి.
- ❖ కాయలను ఎట్టి పరిస్థితుల్లో ఇసుక లేదా పేడ అలికిన కల్లాలపై ఆరబెట్టకూడదు. నేల మీద ఆరబెడితే నేలలోని తేమ వల్ల బూజుపట్టే అవకాశం ఉంది.
- ❖ ఇప్పుడు రాత్రివేళల్లో మంచు ఎక్కువగా పడుతుంటుంది. అందుకే రాత్రిపూట కాయలను టార్పాలిన్‌తో కప్పి ఉదయం ఎండరాగానే తీసివేయాలి.
- ❖ ఎండబెట్టే సమయంలో మిరపకాయలను పలుచగా పోసి రోజూ తిరగతిప్పుతూ ఉండాలి. ఎందుకంటే కాయలు బాగా ఎండకపోతే రంగును, మెరుపును కోల్పోయే అవకాశం ఉంది. కాయల్లో తేమ 10 నుంచి 11 శాతం వరకు వచ్చేలా ఎండబెట్టాలి. ఈ జాగ్రత్తలు తీసుకుంటే మార్కెట్లో మిరపకు మంచి ధర లభించే అవకాశం ఉంది.

# మొక్కజొన్నలో కత్తెరపురుగు సమగ్ర యాజమాన్యం

ఎమ్.సాయిచరణ్, డా.కృష్ణ చైతన్య, డా.ఫిర్దోస్ శహన, జి.రాకేష్, ఎ.దినేష్, డా.రమ్య రాథోడ్, బి.సౌందర్య, జి.దివ్య శ్రీ, డా.బి.బాలాజీ నాయక్
ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన స్థానం, రుద్రూర్, నిజామాబాద్, తెలంగాణ.

కత్తెర పురుగు లద్దెపురుగు జాతికి చెందిన పురుగు, దీనినే ఫాల్ ఆర్మీ వార్మ్ అని కూడా అంటారు. ఈ పురుగును మన దేశంలో మొదటి సారిగా కర్ణాటక రాష్ట్రంలోని షిమోగా అనే ప్రాంతంలో గుర్తించారు. తెలంగాణ రాష్ట్రంలో 2018లో కరీంనగర్, మెదక్, నిజామాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ పురుగు ఉధృతిని మొక్కజొన్న పంటపై గమనించారు. కత్తెర పురుగు మొక్కజొన్న తో పాటు గా జొన్న, రాగి, సజ్జ, వేరుశనగ, చెరకు, వరి, గోధుమ, కూరగాయలు వంటి 80 రకాల పంటలను ఆశించి నష్ట పరుస్తుంది. ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీలో సాగు చేస్తున్న. మొక్కజొన్నలో సమస్యాత్మకంగా ఉన్న కత్తెరపురుగును నివారించడానికి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఇందులో ముఖ్యంగా కత్తెర పురుగు ఉనికి, ఉధృతిని గమనిస్తుండాలి.

**గుర్తింపు చిహ్నాలు:** కత్తెర పురుగు ముందు జత రెక్కలు గోధుమ రంగులో ఉండి, రెక్కల పై అంచు వద్ద తెల్లని మచ్చను కల్గి ఉంటుంది. వెనక జత రెక్కలు వెండి- తెలుపు రంగులో ఉండి నల్లని/ బూడిద రంగు అంచుని కల్గి ఉంటాయి. ఒక తల్లి పురుగు తన జీవిత కాలంలో 1500- 2000 వరకు గుడ్లను పెట్టె సామర్థ్యం కల్గి ఉంటుంది. 100-200 గుడ్లను ఒక సమూహం లాగా ఆకు అడుగు భాగంలో కాండం దగ్గర పెడుతుంది. గుడ్లు 3-5 రోజులలో పొదగబడి లార్వాలు వెలువడతాయి. తొలి, రెండవ దశ లార్వాలు ఆకుపచ్చ రంగులోను మూడు నుండి అరవ దశ లార్వాలు బూడిద రంగులో ఉంటాయి. లార్వా తలభాగంలో తలకిందులుగా ఉన్న ఆంగ్ల అక్షరం 'వై' ఆకారంలో గుర్తు ఉంటుంది. లార్వా చివరి భాగంలో (8వ ఖండితం) 4 చుక్కలు/ మచ్చలను కల్గి ఉంటుంది. 14- 28 రోజుల తర్వాత లార్వాలు మొక్క మొదలు వద్ద గాని నేలలో గాని చేరి కోశస్థ దశ లోకి ప్రవేశిస్తాయి. 7-10 రోజుల పాటు కోశస్థ దశలో ఉన్న తర్వాత ప్యూపా నుండి రెక్కల పురుగులు వెలువడతాయి. ఈ రెక్కల పురుగులు 11-14 రోజుల వరకు జీవిస్తాయి. ఈ పురుగులు ఒక రోజులో 100 కి.మీ వరకు ప్రయాణించగలవు. ఈ విధంగా కత్తెర పురుగు అది జీవిస్తున్న వాతవరణ పరిస్థితులకు అనువుగా 30-90 రోజులలో తన జీవిత చక్రాన్ని పూర్తి చేస్తుంది.


**గాయలక్షణాలు:** గుడ్ల నుండి వెలువడిన లార్వాలు గుంపులు గుంపులుగా తొలిదశలో ఆకుల అడుగు భాగం నుండి పత్రహరితంను గోకి తినడం వలన తెల్లని చారలు ఏర్పడతాయి. రెండవ- మూడవ దశ లార్వాలు మొక్క సుడిలోకి ప్రవేశించి, ఆకులను తింటూ రంధ్రాలు చేస్తాయి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నపుడు ఆకులు మొత్తం తిని వేసి కేవలం కాడను మిగిలిస్తాయి. ఎదిగిన లార్వాలు మొక్క కాండంను కంకి లోని గింజలను, కండెను ఆశించి తీవ్రంగా నష్ట పరుస్తాయి.

**నివారణ చర్యలు :**

- కత్తెర పురుగు కోశస్థ దశలు నేలలో ఉంటాయి, కావున తప్పని సరిగా లోతు దుక్కులు చేసుకొవాలి.
- మొక్కజొన్న సాగు చేసే రైతులు విడతలుగా కాకుండ ఒకేసారి పంటను వేసుకోవాలి
- మొక్క చిన్నను ఏక పంటగా కాకుండా అపరాల పంటలయినటువంటి కంది, పెసర, మినుము వంటి పంటలను అంతర పంటలుగా సాగు చేయాలి.
- మొక్క జొన్న పొలం చుట్టూ నాలుగు వరసలలో నేపియర్ గడ్డిని సాగు చేయాలి. దీనివలన కత్తెర పురుగు మొక్కజొన్న పై కాకుండా నేపియర్ గడ్డి పై గుడ్లను పెడ్తుంది.
- పొలంలో వయ్యారి భామ, ఉమ్మెత్త వంటి కలుపు మొక్కలను పీకివేయాలి.

- రైతులు నాణ్యమయిన విత్తనాలను ఎంచుకోవడంతో పాటు, విత్తే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి. సయంట్రనిలిప్రోల్ + థయోమిథాక్సామ్ 4 మి.లీ లేక ఇమిడాక్లోప్రిడ్ 17.8 ఎస్. ఎల్ 5 మి.లీ లను కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేసుకున్న తర్వాత పొలంలో విత్తుకోవాలి.

- పంట తొలిదశలో ఆకులపై కన్పించిన గుడ్ల సమూదాయాలను, లద్దెపురుగుల సమూహాలను ఆకులపై నుండి తుంచి ఏరివేయాలి.



కత్తెర పురుగు ఆశించిన మొక్క

మొక్కజొన్న కంకి ని ఆశించిన కత్తెర పురుగు

మొక్కజొన్న పంట లో లింగాకర్షక బుట్టలు అమర్చుట

- పొలంలో ప్రతి ఎకరానికి 8-10 లింగాకర్షక బుట్టలను పంటకి ఒక అడుగు ఎత్తులో అమర్చుకోవాలి.

- పంట తొలిదశలో ఎకరానికి 10-12 పక్షి స్థావరాలను / పంగల కర్రలను ఏర్పాటు చేసుకోవాలి.

- గుడ్లు, తొలిదశ లద్దెపురుగుల నివారణ కోసం వేపనూనె 5 మి.లీ లేక వేప సంబంధమయిన మందులు ఆజాడిరక్టిన్ 1500 పి.పి.ఎమ్ 5 మి.లీలను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

- పరాన్నజీవులయినటువంటి టీలోనిమస్ లేదా కీలోనస్ ఇన్సులారిస్ లేక ట్రైకోగ్రామా గుడ్డు పరాన్న జీవులను పొలంలో వదలాలి.

- మొదటి, రెండవ దశ లార్వాల నివారణ కోసం బాక్టీరియా సంబంధమయిన బి.టి. ఫార్ములేషన్స్ 2 గ్రా. లేక క్లోరిపైరిఫాస్ 20%ఇ.సి 2.5 మి.లీ లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

- రెండవ, మూడవ దశ లార్వాలను నివారించడానికి స్పైనోసాడ్ 45% ఎస్.సి 0.3 మి.లీ లేక ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేక క్లోరాంట్రానిలిప్రోల్ 18.5 ఎస్.సి 0.3 మి.లీ లను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

- ఎదిగిన లార్వాలను నివారించడం కోసం థయోమిథాక్సామ్ + లామ్డా సైహలోత్రిన్ 0.5 మి.లీ లేక క్లోరాంట్రనిలిప్రోల్ + లామ్డా సైహలోత్రిన్ 0.5మి.లీ లేక స్పైనోటోరమ్ 0.5 మి.లీను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

- ఒకే రకమయిన రసాయనాన్ని కాకుండా మందులను మార్చి మార్చి పిచికారీ చేసుకోవాలి. సాయంత్రం వేళల్లో మొక్క సుడుల్లో చేతి పంపు సహాయంతో పిచికారీ చేసుకోవాలి.

- 50-55 రోజులు దాటిన పంటలో పిచికారీ చేయడం ఇబ్బందిగా ఉంటుంది. కావున, ఎదిగిన లద్దెపురుగుల నివారణ కోసం విషపు ఎరను తయారు చేసుకుని వేసుకోవాలి.

- విషపు ఎరను తయారు చేసుకోవడం కోసం పది కిలోల తవుడుకు 2 కిలోల బెల్లం, 2-3 లీటర్ల నీటిని కలుపుకుని ఒక రోజు పాటు పులియ బెట్టాలి. తర్వాత రోజు తవుడు మిశ్రమానికి 100 గ్రా. థయోడికార్బ్ రసాయనాన్ని కలుపుకుని ఉండలుగా చేసుకుని మొక్కల సుడులలో వేసుకొవాలి. సాధారణంగా కత్తెర పురుగు లద్దె పురుగులు మొక్క సుడి నుండి బయటికి వచ్చి రాత్రి సమయంలో ఆకులను, కంకిని ఆశించి నష్ట పరుస్తాయి. అందువల్ల విషపు ఎరను ఉదయం లేదా సాయంత్రం వేళల్లో సుడులలో వేసుకోవాలి.

# వేసవిలో నువ్వుల సాగు, చీడపీడలు, తెగుళ్ళ నివారణలో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు

టి.లక్ష్మణ్, శాస్త్రవేత్త, సి.యమున, శాస్త్రవేత్త, ఎం.రత్నమాల, వైపి-1, డాట్ సెంటర్, తాండూర్.

నువ్వుల పంట తెలంగాణ జిల్లాల్లో వేసవిలో పండించడానికి అనుకూలమైన పంట. వేసవిలో నువ్వుల పంటకు చీడపీడల బెడద తక్కువ ఉండి, విత్తన నాణ్యత పెరిగి అధిక దిగుబడులు పొందవచ్చు. వేసవి పంటగా జనవరి 2వ పక్షం నుండి ఫిబ్రవరి మొదటి పక్షం లోపు విత్తుకోవాలి. ఈ పంట తక్కువ సమయంలో తక్కువ నీటితో అధిక ఆదాయాన్ని అందిస్తుంది. రాష్ట్రంలో అన్ని రకాల నేలల్లోను దీన్ని పండించవచ్చు. మురుగు నీరు నిలువని తేలికైన నేలలు బాగా అనుకూలంగా ఉంటాయి. నీరు నిలిచే ఆమ్ల, క్షార గుణాలు గల నేలలు నువ్వుల సాగుకు పనికిరావు.

**రకాలు :**

**గౌరీ :** పంట కాలం(90 రోజులు/ఖరీఫ్), దిగుబడి - 250-300కిలోలు ఎకరాకు, ముదురు గోధుమ రంగు విత్తనం. కోడు ఈగను కొంత వరకు తట్టుకొంటుంది.

**హిమ (జె.జి.ఎస్.-9426) :** ఖరీఫ్/రబీ/వేసవి (80-85 రోజులు), దిగుబడి - 250-480 కిలోలు ఎకరాకు, స్వల్పకాలిక తెల్లగింజ రకం. పొడవుగా ఉంటుంది. వెర్రి తెగులును తట్టుకుంటుంది. ఎగుమతి ప్రాధాన్యత ఉంది.

**శ్వేత టిల్ (జె.సి.ఎ.ఎ.-94) :** పంట కాలం (85-90 రోజులు, రబీ/వేసవి), దిగుబడి - ఎకరాకు 250 - 450 కిలోలు, గుణగణాలు - తెల్లగింజ రకం, వేసవిలో అధిక దిగుబడినిస్తుంది, కాండం కుళ్ళును తట్టుకొంటుంది.

**రాజేశ్వరి:** లేట్ ఖరీఫ్ (85-90 రోజులు రబీ/వేసవి), దిగుబడి - ఎకరాకు 200-300 కిలోలు, తెల్ల గింజ రకం. కాండం కుళ్ళు, బూడిద తెగుళ్ళను తట్టుకొంటుంది.

**చందన :** ఖరీఫ్/రబీ/వేసవి(80-85 రోజులు), దిగుబడి - ఎకరాకు 250-480 కిలోలు, గోధుమ రంగు విత్తనం. అన్ని కాలాలకు అనుకూలం. వెర్రి తెగులును తట్టుకుంటుంది.

**మాధవి :** ఖరీఫ్(80-85 రోజులు), దిగుబడి - ఎకరాకు 200-250 కిలోలు, లేత గోధుమ రంగు విత్తనం.

**ఎలమంచిలి-66 :** ఖరీఫ్/రబీ/వేసవి (75-80 రోజులు), దిగుబడి - ఎకరాకు 350-400 కిలోలు, లేత గోధుమ రంగు విత్తనం. ఆకుమచ్చ తెగుళ్ళను తట్టుకొంటుంది.




**విత్తే పద్ధతి :** తెల్లగింజ రకాలైన రాజేశ్వరి, శ్వేతాతిల్, హిమ, గోధుమరంగు గింజ రకాలైన చందన, శారద రకాలు సాగుకు అనుకూలంగా ఉంటాయి. రాజేశ్వరి రకం కాండం కుళ్ళు, బూడిద తెగులు, శ్వేతాతిల్ రకం, కాండం కుళ్ళు, హిమ రకం, వెర్రి తెగులును తట్టుకుంటాయి. పంట రకాన్ని బట్టి 80-90 రోజుల్లో కోతకు వస్తుంది.

ఎకరానికి 2.5 కిలోల విత్తనాన్ని మూడింతల ఇసుకతో కలిపి గొర్రుతో వరుసల్లో విత్తుకోవాలి. కిలో విత్తనానికి 2 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్, 3 గ్రా. మాంకోజెబ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. వరుసల మధ్య 30 సెం.మీ. (12 అంగుళాలు), మొక్కల మధ్య 15 సెం.మీ. (6 అంగుళాలు) దూరం ఉండేలా విత్తుకోవాలి.

**ఎరువుల యాజమాన్యం:** ఆఖరి దుక్కిలో ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువు, 26 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 30 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను ఆఖరి దుక్కిలో వేసి దున్నుకోవాలి.


**నీటి యాజమాన్యం :** విత్తిన వెంటనే పలుచటి తడి ఇవ్వాలి. పూత, కాయ అభివృద్ధి, గింజకట్టే దశలు నీటి తడులకు కీలకమైనవి. కాబట్టి విత్తిన 35-40 రోజుల నుండి 65-70 రోజుల వరకు పైరు నీటి ఎద్దడికి గురవకుండా చూసుకోవాలి. నేల స్వభావాన్ని బట్టి పంట కాలంలో 3-4 తడులు అవసరమవుతాయి. నీటి తడులకు పూత దశ అత్యంత కీలకమైనది. కావున ఈ దశలో బెట్ట పరిస్థితులు ఏర్పడితే పూత తగ్గడంతో పాటు ఉన్న పూత కూడా రాలిపోతుంది. ఒకవేళ సాగునీరు లేకుంటే లీటరు నీటికి 20 గ్రా. యూరియాను కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. దీనివల్ల పంట నష్టాన్ని కొంతవరకు తగ్గించవచ్చు.

**కలుపు నివారణ, అంతరకృషి :** మొక్కలు మొలచిన 15-20 రోజులకు అదనపు మొక్కలను, కలుపు మొక్కలను తీసివేయాలి. 30-35 రోజులప్పుడు గొర్రుతో అంతరకృషి చేసుకోవాలి.

**సస్యరక్షణ :**

**పురుగులు :** ఎకరానికి 2.5 కిలోల విత్తనాన్ని మూడింతల ఇసుకతో కలిపి గొర్రుతో వరుసల్లో విత్తుకోవాలి. కిలో విత్తనానికి 2 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్, 3 గ్రా. మాంకోజెబ్లో విత్తనశుద్ధి చేసుకోవాలి. వరుసల మధ్య 30 సెం.మీ. (12 అంగుళాలు), మొక్కల మధ్య 15 సెం.మీ. (6 అంగుళాలు) దూరం ఉండేలా విత్తుకోవాలి. ఎరువుల యాజమాన్యం ఆఖరి దుక్కిలో ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువు, 26 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 30 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేటు ఆఖరి దుక్కిలో వేసి దున్నుకోవాలి.

**పేనుబంక :** పిల్ల, తల్లి పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడం ద్వారా ఆకులు ముడుచుకొని పాలిపోతాయి. నివారణకు, ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తామర పురుగు, పచ్చదోమ పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి ఆకుల రసాన్ని పీల్చి వేస్తాయి. అలాంటి ఆకుల ముందుగా పాలిపోయి తర్వాత దశలో ఎండిపోతాయి. వీటి నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకుముడత, కాయ తొలిచే పురుగులు మొక్క దశ నుండి కాయదశ వరకు నష్టం కలిగిస్తాయి. తొలిదశలో చిన్న గొంగళి పురుగులు లేత ఆకులను కలిపి గూడు కట్టి లోపలి నుండి ఆకుల్లోని పచ్చని పదార్థాన్ని గోకి తినడం వలన ఆకులు ఎండిపోతాయి. మొగ్గ ఏర్పడే దశలో మొగ్గలను, పూతను, కాయల్లోని లేత గింజలను తింటూ పంటకు నష్టం చేస్తాయి. నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కోడు ఈగ చిన్న చిన్న పురుగులు లేత మొగ్గ, పూత తినేయడం వలన మొగ్గలు పువ్వుగా, కాయలుగా ఏర్పడక గింజ కట్టక తాలు కాయలు ఏర్పడతాయి. నివారణకు పురుగు ఆశించిన మొగ్గల్ని, తాలు కాయల్ని ఏరి నాశనం చేయాలి. మొగ్గ దశలో ఎసిఫేట్ 1 గ్రా. లీటరు నీటికి



కలిపి పిచికారీ చేయాలి. బీహారి గొంగళి పురుగు తొలి దశలో చిన్న గొంగళి పురుగులు గుంపులుగా ఆకులలోని పత్రహరితాన్ని గీరి తిని జల్లెడాకులుగా చేస్తాయి. ఎదిగిన గొంగళి పురుగులు పూలు, కాయలకు రంధ్రాలు చేసి నష్టపరుస్తాయి. నివారణకు పంటలో గుడ్లు లేక పురుగులను గమనించిన వెంటనే ఆకులతో సహా తీసివేసి నాశనం చేయాలి. క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**తెగుళ్ళు :** వేరుకుళ్ళు, కాండం కుళ్ళు తెగులు మీద నల్లని చారలేర్పడతాయి. వేర్లను చీల్చి పరిశీలిస్తే గోధుమ రంగు చారలు కనిపిస్తాయి. వేర్లు పూర్తిగా లేదా పాక్షికంగా కుళ్ళిపోతాయి. నివారణకు కిలో విత్తనానికి 3 గ్రా. కాప్టాన్ లేదా కార్బండిజమ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మాంకోజెబ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

పైరు ఎదిగే దశలో గాలిలో తేమశాతం ఎక్కువగా ఉన్నప్పుడు ఆకుమచ్చ తెగులు అధికంగా వ్యాపిస్తుంది. దీనివల్ల ఆకుల మీద, కాండం మీద గోధుమ రంగు చిన్న చిన్న వలయాకారపు మచ్చలు ఏర్పడతాయి. దీని నివారణ కార్బండిజమ్ 1 గ్రా. లేదా మాంకోజెబ్ 2.5గ్రా. లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి. తెగులు సోకిన పంట అవశేషాలను నాశనం చేయాలి. వెర్రి తెగులు (ఫిల్లోడి) -పూత సమయంలో ఆశించినప్పుడు ఆకులు చిన్నవై పువ్వులోని భాగాలన్ని ఆకుల మాదిరిగా మారిపోయి కాయలు ఏర్పడవు. మొక్కలు ఎదుగుదల తగ్గి పై భాగంలో చిన్న చిన్న ఆకులు గుబురుగా ఉండి వెర్రి తల మాదిరిగా ఉంటుంది. ఈ తెగులు దీపపు పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది. దీని నివారణకు పైరుపై మిథైల్ డెమటాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

బూడిద తెగులు వలన లేత ఆకులపై తెల్లని బూడిద పొడి మచ్చలుగా ఏర్పడుతుంది. దీని నివారణకు నీటిలో కరిగే గంధకపు పొడి 3 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా మైక్లోబ్యూటానిల్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**పంటకోత :** పంట కోత సమయంలో అధిక ఉష్ణోగ్రత వలన కాయలు చిట్లి గింజలు పొలంలో రాలిపోతాయి. కాబట్టి పైరు ఆకులు పసుపు రంగుకు మారి రాలడం ప్రారంభమయినప్పుడు 75 శాతం కాయలు లేత పసుపు వర్ణానికి వచ్చినప్పుడు పైరు కోయాలి.

# వేసవి పెసరలో వైరస్ తెగుళ్ళ లక్షణాలు - సమగ్ర నివారణ

డా.ఎ.విజయభాస్కర్, డా.మధుకర్ రావు, డా.శ్రావణి, డా.రాజేంద్రప్రసాద్, డా.మధన్‌మోహన్ రెడ్డి, డా.ఉషారాణి, డా.మంజులత,
ఎ.ఆర్.ఎస్., పి.జె.టి.ఎస్.ఎ.యు., కరీంనగర్



మన రాష్ట్రంలో వేసవి కాలంలో పండించే అపరాలలో పెసర ముఖ్యమైన పంట. ఈ పంటను మూడు ముఖ్యమైన వైరస్ తెగుళ్ళు ఆశించి నష్టం చేస్తుంటాయి. వీటిని తొలి దశలో రైతులు గుర్తించి నివారణ చర్యలు చేపడితే అధిక దిగుబడులను పొందవచ్చు.

### ఆకుముడత లేదా మొవ్వ కుళ్ళు తెగులు :

**లక్షణాలు :** ఈ తెగులు వల్ల మొక్క అంచులు వెనక్కి ముడుచుకొని మెలికలు తిరిగి గిడసబారి ఎండిపోయి రాలిపోతాయి.

- ❖ ఆకుల అడుగు భాగంలోని ఈనెలు రక్త వర్ణాన్ని పోలి ఉంటాయి. లేత దశలో ఈ తెగులు వస్తే తలలు మాడి మొక్కలు ఎండిపోతాయి.
- ❖ తామర పురుగుల ద్వారా వ్యాప్తి చెందుతుంది.
- ❖ ఎం.జి.జి. 307 రకం కొంత వరకు ఈ తెగులును తట్టుకుంటుంది.

### పల్లాకు తెగులు :

**లక్షణాలు :** ఈ తెగులు జెమిని వైరస్ వల్ల వస్తుంది.

- ❖ పసుపు రంగులో మచ్చలు మొదట లేత ఆకులపై ఏర్పడతాయి.
- ❖ క్రమేపి ఈ మచ్చలు పెరిగి ఆకు అంతటా వ్యాపించి పసుపు రంగులోకి మారతాయి.
- ❖ ఆకులు పసుపు రంగులోకి మారడమే కాకుండా ఆకులపై ముదురు గోధుమ, నలుపు రంగు మచ్చలు ఏర్పడతాయి.
- ❖ ఈ తెగులు పైరు తొలి దశలో ఆశిస్తే మొక్క గిడసబారి ఎండిపోయి రాలిపోతుంది.
- ❖ తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు పూత చాలా తక్కువగా వస్తుంది.
- ❖ ఏర్పడిన పిందెలు, కాయలు పసుపు రంగులోకి మారి వంకరలు తిరుగుతాయి.
- ❖ కాయ దశలో గింజ పసుపు రంగులోకి మారి గింజలు ఉండవలసిన పరిమాణంలో కన్నా చిన్నవిగా ఉంటాయి.
- ❖ ఈ తెగులు లక్షణాలు పూత దశలో వస్తే సుమారు 20-100 శాతం వరకు దిగుడులు తగ్గే ప్రమాదముంది.

### సీతాఫలం తెగులు :

**లక్షణాలు :** తెగులు సోకిన మొక్కలు లేత ఆకులు ముడతలుగా ఏర్పడి మందంగా పెద్దవిగా పెరుగుతాయి.

- ❖ మొక్కలు పూత పూయక వెర్రి తలలు వేస్తాయి.
- ❖ ఈ తెగులు పేనుబంక ద్వారా వ్యాప్తి చెందుతుంది.

### వైరస్ తెగుళ్ళ సమగ్ర నివారణ :

- ❖ ఒక కిలో పెసర విత్తనానికి 30 గ్రా. కార్బోసల్ఫాన్ లేదా థయోమిథాక్సామ్ 70 డబ్ల్యు.ఎస్. 5 గ్రా. మందులను కలిపి విత్తుకుంటే పైరులో సుమారు 20-30 రోజుల వరకు వైరస్ తెగుళ్లను రసం పీల్చే పురుగుల తీవ్రతను తగ్గించవచ్చు.
- ❖ తెగుళ్ళను కొంత వరకు తట్టుకునే రకాలను ప్రాంతాల వారీగా ఎన్నుకొని సాగు చేసుకోవాలి. అవి - యాదాద్రి, ఏకశిల, ఎం.జి.జి. 347, ఎం.జి.జి. 351, ఎల్.జి.జి. 460, ఐ.పి.ఎం. 2-14, ఎం.జి.జి. 385, ఎల్.జి.జి. 574, ఎల్.జి.జి. 610 రకాలు.

- వైరస్ తెగుళ్ల నివారణకు మందులు లేవు కనుక ఈ తెగుళ్ళ వ్యాప్తి చేసే రసం పీల్చే పురుగులను తొలిదశలోనే గుర్తించి సరైన కీటకనాశిని మందులను పిచికారీ చేసుకోవాలి.
- తెగులు సోకని మంచి విత్తనం ఎన్నుకొని విత్తుకోవాలి.
- తొలిదశలోనే ఈ తెగులు సోకిన ఆకులను, మొక్కలను గుర్తించి పీకి నాశనం చేయాలి.
- పెసర పైరు చుట్టూ నాలుగు వరుసల మొక్కజొన్న లేదా జొన్న పంటలను విత్తుకుంటే ఈ వైరస్ తెగుళ్లను వ్యాప్తి చేసే రసం పీల్చే పురుగుల నుండి కాపాడుకోవచ్చు.
- వివిధ రకాల కలుపు మొక్కలను పెసర చేనులో గట్లపై లేకుండా తీసివేయాలి.

**పల్లాకు తెగులు వ్యాప్తి చేసే తెల్లదోమ నివారణ :**

- ఈ వైరస్ నివారణకు పొలంలో గ్రీజు పూసిన పసుపు రంగు డబ్బాలు లేదా ఎల్లోస్టిక్కీ ట్రాప్స్ పెట్టడం వల్ల ఈ దోమను, గుడ్లను నివారించవచ్చు. (10-12 పసుపు రంగు డబ్బాలను ఒక ఎకరానికి)
- ఈ దోమ నివారణకు వేప గింజల కషాయం 5 శాతం ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ప్రొఫినోఫాస్ 2.0 మి.లీ. కీటకనాశిని మందును ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**ఆకుముడత తెగులు నివారణ :**

- ఈ తెగులు పెసర పంటలో గుర్తించిన వెంటనే ఫిప్రోనిల్ 2.0 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ఈ తెగులు తామర పురుగుల వల్ల వ్యాప్తి చెందుతుంది. కనుక నీలిరంగు ఫిరోమిన్ ట్రాప్స్‌ను పొలంలో పెడితే తామర పురుగుల ఉధృతిని తగ్గించవచ్చును. (ఒక ఎకరానికి 20 నీలి రంగు ఫిరోమిన్ ట్రాప్స్)

**సీతాఫల తెగులు నివారణ :**

- తెగులు సోకిన మొక్కలను పీకి వేయాలి. డైమిథోయేట్ 2.0 మి.లీ. కీటకనాశినిని ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఈ విధంగా వేసవిలో తెగుళ్లను తట్టుకునే రకాలను ఎన్నుకొని, విత్తనశుద్ధి చేసి తొలిదశలోనే తెగుళ్లను వ్యాప్తి చేసే రసం పీల్చే పురుగులను గుర్తించి, సస్యరక్షణ చర్యలతో పాటు, కలుపు మొక్కలు లేకుండా తీసివేసి, సరైన యాజమాన్య పద్ధతులను పాటించి రైతులు తక్కువ కాలంలో పెసరలో అధిక దిగుబడులు పొందవచ్చు.

## మన వ్యవసాయ శాస్త్రవేత్తలను స్మరించుకుందాం

మన రాష్ట్రంలో, దేశంలోను, అంతర్జాతీయంగాను వ్యవసాయ రంగంలో విశిష్టమైన సేవలు అందించిన, పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలను స్మరించుకుందాం. ప్రతి ఒక్కరూ మీ దృష్టిలో ఉన్న వ్యవసాయ శాస్త్రవేత్తలను పరిచయం చేస్తారని ఆశిస్తున్నాం. మన శాస్త్రవేత్తల గురించి క్రమం తప్పకుండా వ్యవసాయ పాడిపంటలులో ప్రచురిద్దామని భావిస్తున్నాం. వ్యవసాయరంగ అభివృద్ధికి తద్వారా రైతాంగ అభివృద్ధికి దోహదం చేసిన శాస్త్రవేత్తలను స్మరించుకోవడం మనందరి బాధ్యతగా భావిస్తున్నాం. వారినుంచి స్ఫూర్తిని పొందడమేగాక మన వ్యవసాయ అభివృద్ధికి కొత్త ఉత్సాహాన్ని పొందవచ్చని అనుకుంటున్నాం. ఈ ప్రయత్నంలో మీరందరూ పాలు పంచుకుంటారని వ్యవసాయ శాస్త్రవేత్తలకు, పరిశోధకులకు, వ్యవసాయ అధికారులకు, విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

**- సంపాదకులు**



# యాసంగి వరి పైరులో పోషక యాజమాన్యం

ఆర్.రఘువరణ్‌సింగ్, వి.పుష్పలత, డా.టి.ప్రభాకర్ రెడ్డి, కె.రామకృష్ణ, ఎం.రాజేష్ కుమార్, వై.సుల్తాన్, బి.హరీష్,
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం, నాగర్‌కర్నూల్ జిల్లా

వరిలో అధిక దిగుబడి సాధించడానికి మేలైన సాగు పద్ధతులతో పాటు సమగ్ర పోషక యాజమాన్యం తప్పనిసరి. మనం అందించే పోషకాలు మొక్క పెరుగుదలకు మంచి దిగుబడులు ఇవ్వడానికి ఉపకరిస్తాయి. అయితే పోషకాలను రైతులు ఎవరికి తోచిన విధంగా వారు అందిస్తున్నారు. అధికంగా రసాయన ఎరువులను అందిస్తే దిగుబడులు బాగుంటాయనే ఆపోహతో అధికంగా ఎరువులను వేస్తున్నారు.

- వరి మాగాణుల్ల అపరాలు, జీలుగ, జనుము, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట పైర్లను పెంచి కలియదున్నడం ద్వారా భూసారం పెరగడమే గాక సుమారు 20-25 శాతం నత్రజని, భాస్వరం, పొటాష్‌లను కూడా ఆదా చేయవచ్చు.
- సజీవ ఎరువులైన నీలి ఆకుపచ్చ నాచు, అజొల్లా, అజోస్పైరిల్లం, ఫాస్ఫోబ్యాక్టీరియా మొదలగు జీవన ఎరువులను వాడి నత్రజని, భాస్వరం మోతాదులను 10-20 శాతం తగ్గించవచ్చు.
- అజొల్లా వరి పొలం దమ్ములో ఎకరాకు 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను వేసి పలుచగా నీరు 100-150 కిలోల అజొల్లా వేసిన 2-3 వారాలు పెరగనిచ్చి నేలలో కలిదున్నాలి.
- ఎకరాకు మూడు టన్నుల పచ్చిరొట్ట, 12 కిలోల నత్రజని నేలకు అందిస్తుంది.

**అజటోబాక్టర్ :** ఎకరాకు సరిపడ విత్తనానికి 200-400 గ్రాముల చొప్పున కల్చరును పట్టించాలి. లేదా ఒక కిలో కల్చరును 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి ఎకరం నేలపై చల్లాలి. దీని వల్ల ఎకరాకు 8-16 కిలోల నత్రజని పైరుకు అందుతుంది.

**అజోస్పైరిల్లం :** దీనిని కూడా అజటోబాక్టర్ వలె వాడాలి.

**ఫాస్ఫోబాక్టీరియా :** ఇది భాస్వర జీవన ఎరువు. భూమిలో లభ్యం కాని స్థితిలోని భాస్వరాన్ని లభ్యమయ్యేలా చేస్తుంది. ఎకరాకు సరిపడే విత్తనంతో 200-400 గ్రాముల కల్చర్‌ను పట్టించాలి. లేదా ఒక కిలో కల్చర్‌ను 20 కిలోల పశువుల ఎరువుతో కలిపి ఎకరం నేలలో వేయాలి.

- భూసారాన్ని బట్టి రసాయనిక ఎరువు, మోతాదు నిర్ణయించి నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్ నిచ్చే ఎరువులను సమతుల్యంగా వాడాలి.
- వివిధ ప్రాంతాలకు సిఫారుసు చేసిన పోషకాల మోతాదు, రకాల కాల పరిమితి, నేల స్వభావం, భూసారం, రుతువు, యాజమాన్య పద్ధతులు బట్టి మారుతుంది.
- నత్రజనిని కాంప్లెక్స్ ఎరువుల రూపంలోగానీ యూరియా రూపంలో గాని వాడవచ్చు.
- నత్రజనిని మూడు సమభాగాలుగా చేసి నాటుకు ముందు దమ్ములోను, దుబ్బు చేసే దశలోను, అంకుర దశలోను బురద పదునులో మాత్రమే సమానంగా వెదజల్లి 36-48 గంటల తర్వాత యూరియా రూపంలో గాని వాడవచ్చు.
- నత్రజనిని మూడు సమభాగాలుగా చేసి నాటుకు ముందు దమ్ములోను, దుబ్బు చేసే దశలోను, అంకురం దశలోను బురద పదునులో మాత్రమే సమానంగా వెదజల్లి 36-48 గంటల తర్వాత పలుచగా నీరు పెట్టాలి.
- 50 కిలోల యూరియాకి 10 కిలోల వేపపిండి లేక 250 కిలోల తేమ కలిగిన మట్టిని గాని కలిపి, రెండు రోజులు నిల్వ ఉంచి వెదజల్లితే నత్రజని వినియోగం పెరుగుతుంది.
- మొత్తం భాస్వరం ఎరువును దమ్ములోనే వేయాలి.
- పొటాష్ ఎరువులను రేగడి నేలలో ఆఖరి దమ్ములో పూర్తిగా ఒకసారి వేయాలి. చల్కా నేలల్లో ఆఖరి దమ్ములో సగం, అంకుర దశలో మిగతా సగాన్ని వేయాలి.
- కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా దుబ్బు చేసే సమయంలో గానీ, అంకురం ఏర్పడే దశలో గానీ వేయకూడదు.



# బేలర్‌ని ఉపయోగిద్దాం - పంట అవశేషాలను సమర్థవంతంగా వినియోగిద్దాం

కె. ప్రవీణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, డా. వై. సుధామిని, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్ ఆర్ యూనివర్సిటీ, వరంగల్

పంట అవశేషాలు అనగా పంటలు కోసిన తరువాత పొలంలో మిగిలిపోయిన మొక్కల పదార్థాలు. భారతదేశంలో ఉత్పత్తి అయ్యే స్థూల పంట అవశేషాల సామర్థ్యం సంవత్సరానికి 696.38 మిలియన్ టన్నులు. తృణధాన్యాల పంటలు సంవత్సరానికి 364.27 మిలియన్ టన్నుల పంట అవశేషాలను ఉత్పత్తి చేస్తున్నాయి. వివిధ పంటలలో తృణధాన్యాల పంటలు (వరి, గోధుమ, మొక్కజొన్న, చిరుధాన్యాలు) 70% భాగస్వామ్యం వహిస్తుండగా, వరి పంట మాత్రమే 34% పంట అవశేషాలకు దోహదం చేస్తోంది. గోధుమ పంట 22% అవశేషాలతో రెండవ స్థానంలో ఉండగా, ఫైబర్ పంటలు, మిగిలిన అన్ని పంటల నుండి ఉత్పత్తి అయ్యే అవశేషాల భాగస్వామ్యం 13%. పైభాగాలు, ఆకులతో కూడిన చెరకు అవశేషాలు 12 మెట్రిక్ టన్నులు అంటే భారతదేశంలో పంట అవశేషాలలో 2% ఉత్పత్తి అవుతోంది.

రైతులు పంట అవశేషాలలో ఎక్కువ భాగాన్ని 'పొలంలో' కాల్చివేస్తారు, తదుపరి పంట వేయడానికి పొలాన్ని ప్రధానంగా ఇలా శుభ్రపరుస్తారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయి. ఇలా చేయడం సేంద్రీయ కర్బన నష్టం, గ్లోబల్ వార్మింగ్‌కు కారణమవుతుంది. కూలీల కొరత, పొలం నుంచి పంట అవశేషాలను తొలగించడానికి అధిక వ్యయం, పంటలను యాంత్రికంగా కోయడం వంటి కారణాలతో పంట అవశేషాలను 'పొలంలో' కాల్చివేయడం ఇటీవలి సంవత్సరాల్లో తీవ్రమవుతోంది.

పంట అవశేషాలను కాల్చివేయకుండా ఉపయోగించుకోవడానికి అనేక పద్ధతులు ఉన్నాయి. వాటిలో ఒకటి అవశేషాలను సేకరించి వాటిని పశువుల మేతగా ఉపయోగించడం. అలా పంట అవశేషాలు సేకరించడానికి బేలర్ అందుబాటులో ఉంది. పంట అవశేషాలను సేకరించే బేలర్ వ్యవసాయ రంగంలో ఒక ముఖ్యమైన పరికరం. ఇది పంట కోత తర్వాత మిగిలిన అవశేషాలను సేకరించి, వాటిని బండిల్స్ (బేల్స్) రూపంలో కట్టడం ద్వారా వ్యవసాయదారులకు అనేక ప్రయోజనాలను అందిస్తుంది.

**దీర్ఘచతురస్రాకార పికప్ బేలర్:** ఇది హార్వెస్టర్ వదిలివెళ్లిన పంట అవశేషాలను బేల్స్ గా తయారు చేస్తుంది. ఈ యంత్రంలో ప్రధానంగా పికప్ రీల్, కన్వేయింగ్ అండ్ ఫీడింగ్ సిస్టమ్, కంప్రెసింగ్ ఛాంబర్, బేల్ డెన్సిటీ అడ్జస్టర్, బేల్ లెంగ్త్ కంట్రోలర్, కట్టలు కట్టే మెకానిజం, క్రాంక్ లింకేజ్ మెకానిజం, పవర్ ట్రాన్స్మిషన్, హాలింగ్ సిస్టమ్ ఉన్నాయి. ఇది ట్రాక్టర్ పవర్ టేకాఫ్ (పిటిఒ) నుండి పనిచేస్తుంది. స్ప్రింగ్ తో అనుసంధానం చేసిన దంతాలు ఉన్న పికప్ రీల్ ద్వారా గడ్డి భూమి నుండి పైకి ఎత్తుతుంది.






బేల్ అవసరమైన పొడవుకు చేరుకున్నప్పుడు, బేల్‌ను బంధించడానికి కట్టడానికి సూది, కట్టే యంత్రంగా స్వయంచాలకంగా నిమగ్నమవుతుంది, తరువాత ఇది వరుస బేళ్లను బేళ్ల విడుదల ఛాంబర్ నుండి బయటకు నెట్టబడుతుంది. దీర్ఘచతురస్రాకార బేలర్ చుట్టూ కొలతలు 480 సెంటీమీటర్ల పొడవు, 270 సెంటీమీటర్ల వెడల్పు, 145 సెంటీమీటర్ల ఎత్తు ఉంటుంది. ఇది 22 కిలోవాట్ల ట్రాక్టర్ పిటిఓతో పనిచేస్తుంది. గంటకు 5 కి.మీ వేగంతో పనిచేసే ఈ బేలర్ గంటకు 5,000 నుండి 7,000 కిలోల ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంది.

**హై డెన్సిటీ బేలర్:** ఇది ముందు, వెనుక చక్రాలతో కూడిన స్టేషనరీ బేలర్. దీనిని ట్రాక్టర్ ద్వారా పని ప్రదేశానికి తీసుకెళ్లవచ్చు. బేల్ సాంద్రత 300 కిలో / మీ. 3. ఎలక్ట్రిక్ లేదా డీజిల్ మోటారు లేదా ట్రాక్టర్ పిటిఓ (17 కిలోవాట్లు) ద్వారా పనిచేయగలదు. లింకేజ్ మెకానిజం ద్వారా ఒక బెల్ట్, ఒక గొలుసు, గేర్ యంత్రంగా దీనిని నడిపిస్తాయి. కంప్రెషన్ ఛాంబర్‌లోకి గడ్డిని ఫీడ్ చేయడానికి రవాణా యంత్రాంగం పైకి, కిందికి కదులుతుంది. బేళ్లను మూడు స్టీల్ వైర్లతో (వ్యాసం, 2 మిమీ, పొడవు, 210 సెం.మీ) కట్టే యంత్రం బేళ్లను తయారుచేస్తుంది. హై డెన్సిటీ బేలర్ పొడవు 77 సెంటీమీటర్లు, వెడల్పు 150 సెంటీమీటర్లు, ఎత్తు 254 సెంటీమీటర్లు. దీని నికర బరువు 4 టన్నులు. ఈ బేలర్ గంటకు 50 నుంచి 80 బేళ్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంది.

ఈ విధంగా సేకరించిన అవశేషాలను పశువుల ఆహారంగా లేదా బయోఎనర్జీ ఉత్పత్తి కోసం అమ్ముకోవచ్చు. ఇది రైతులకు అదనపు ఆదాయాన్ని అందిస్తుంది. బేలర్ ఉపయోగించడం వల్ల రైతులు సమయం, శ్రమను ఆదా చేసుకోవచ్చు. పంట అవశేషాలను సేకరించే బేలర్ వ్యవసాయంలో ఒక విప్లవాత్మక పరికరం. ఇది పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక లాభాలు, సమయం ఆదా వంటి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమ వ్యవసాయాన్ని మరింత సమర్థవంతంగా మార్చుకోవచ్చు.

## వ్యవసాయశాఖ ఇంగ్లీష్ వెబ్ సైట్




ఇంగ్లీష్ వెబ్‌సైట్ **http://agri.telangana.gov.in**

08 మార్చి 2025 నాటికి ఇంగ్లీష్ వెబ్‌సైట్ సందర్శకుల సంఖ్య : 9,21,567

# మామిడిలో పండు ఈగ నివారణ

సి.యమున (శాస్త్రవేత్త), టి.లక్ష్మణ్ (శాస్త్రవేత్త), ఎం.రత్నమాల (వైపి-1), ఏరువాక కేంద్రం, తాండూర్

మామిడి సాగులో మన దేశానికి అగ్రస్థానం, బంగారు వర్ణంలో నోరూరించే మామిడి రుచిలో మధురంగా, అనిర్వచనీయమైన అనుభూతిని కలిగిస్తుంది, అందుకే మామిడిని "ఫల రాజు" అని పిలుస్తారు. మన దేశం ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉన్నప్పటికీ ఎగుమతిలో మాత్రం వెనకబడే ఉంది. దీనికి గల ప్రధాన కారణం పండు ఈగ ప్రభావం. మన తెలుగు రాష్ట్రాలలో కూడా విస్తారంగా సాగు అవుతున్న ముఖ్యమైన వాణిజ్య పంటలలో మామిడి ఒకటి. మన మామిడికి ఇతర దేశాలలో మంచి గిరాకీ ఉంది, కానీ పండు ఈగ ఆశించడం వల్ల మామిడి ఎగుమతి నిరాకరణకు గురవుతుంది. అలాగే వివిధ దేశాల ప్రమాణాలను అందుకోలేకపోవడం మూలంగా ఆయా దేశాలు దిగుమతి చేసుకోవడానికి నిరాకరిస్తున్నాయి. ఈ మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా పండు ఈగ ద్వారా నష్టం మామిడి, జామ, సపోటా, అరటి, బొప్పాయి, సీతాఫలంలో విపరీతంగా పెరిగిపోయింది. పండు ఈగ ఆశించడం వలన కనీసంగా 25 శాతం, ఒకవేళ ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతే 100 శాతం వరకు నష్టం వాటిల్లుతోంది. 'మేడి పండు చూడు మేలిమైయుండును పొట్ట విప్పి చూడు పురుగులుండు' అనే నానుడి ఇప్పుడు మామిడికి కూడా వర్తిస్తుంది. ఈ పండు ఈగలు కాయ అభివృద్ధి చెందేటప్పుడు ఆశించి పక్వానికి వచ్చే వరకు ఈ నష్టం మనకి బయటికి ఏ మాత్రం కనబడదు, కాని తీరా పండ్లు కోసి చూస్తే అందులో తెల్లని పిల్ల పురుగులు గుజ్జును తింటూ ఉంటాయి. ఇలాంటి కాయల కొనుగోలుకు వ్యాపారులు, ఎగుమతిదార్లు ముందుకు రాక రైతులు నష్టపోతున్నారు.రైతు సంవత్సరం పొడువునా కష్టపడి మామిడి ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎన్నో ఆశలతో ఎదురుచూసే సమయంలో పండు ఈగ ఆశించడం వలన రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నారు. రైతులు పండు ఈగ నుండి పంటను కాపాడుకోవడానికి విపరీతమైన రసాయనిక మందులు వాడుతున్నారు. దీని వలన పండ్ల పై పురుగు మందు అవశేషాలు ఎక్కువవుతున్నాయి. ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే రసాయనిక మందులు వాడినా ప్రయోజనం ఏ మాత్రం ఉండదు. ఎందుకంటే తల్లి ఈగలు కాయ చర్మాన్ని గుచ్చి లోపల గుడ్లు పెట్టి అందులోనే పొదగబడి గుజ్జుని తింటాయి. ఇక కోశస్థ దశ భూమి లోపల జరుగుతుంది. ఎక్కడా మనం ఈ పండు ఈగ నష్టాన్ని గుర్తించలేము, ఇలాంటప్పుడు రసాయనిక మందులు పిచికారీ చేసినా పండు లోపల ఉన్న లార్వాను చేరలేవు. ఈ పండు ఈగను ఏ రసాయన మందులు సమర్థవంతంగా నివారించలేవు. కావున పండు ఈగ రాకుండా ముందస్తుగానే ఎలాంటి చర్యలు సకాలంలో చేపట్టాలి, రసాయనిక మందులకు ప్రత్యామ్నాయంగా ఎలాంటి సమగ్ర యాజమాన్య పద్ధతులు అనుసరించాలి లేదా ఇంకా ఇతర నూతన సాంకేతిక పరిజ్ఞానాలు ఏమైనా ఉన్నాయా అని రైతులు ఈ కోణంలో ఒక్కసారి ఆలోచిస్తే మంచి నాణ్యమైన దిగుబడులు సాధించగలరు. ఇప్పుడు పండు ఈగ నష్టపరిచే విధానం, సమగ్ర సస్య రక్షణ చర్యలు, అధునాతన పద్ధతులు ఏం ఉన్నాయో తెలుసుకుందాం.

### పండు ఈగ వృద్ధికి అనుకూల సమయం, వాతావరణం:

- పండు ఈగ ఉధృతి మార్చి, ఏప్రిల్ మాసంలో ప్రారంభమై సంతతిని వృద్ధి చేసుకుని జూన్, జులై మాసంలో విజృంభిస్తుంది.
- కాయ అభివృద్ధి చెందే దశలో లోపల ఉన్న గుడ్లు వేడికి పొదగబడి పిల్ల పురుగులుగా మారి లోపల కణజాలాన్ని తింటూ ఉంటాయి
- వాతావరణంలో అధిక వేడి, చలి ఉన్నప్పుడు ఈ పండు ఈగలు తట్టుకోలేవు
- పండు ఈగ జీవిత చక్రం, నష్టపరిచే విధానం:
- ఆడ పండు ఈగలు లేత గోధుమ రంగులో ఉండి పారదర్శకమైన రెక్కలు కలిగి ఉంటాయి. వీటి

వెనుక భాగం లో గుడ్లు పెట్టడానికి వీలుగా సూది లాంటి అండోత్సర్గంను కలిగి ఉంటాయి

- ❖ పండు ఈగ జీవిత చక్రం నాలుగు దశలను కలిగి ఉంటుంది. గుడ్డు దశ, లార్వా (మాగ్గోట్) దశ, కోశస్థ దశ, తల్లి పురుగు దశ. ఈ నాలుగు దశల్లో లార్వా దశ ప్రత్యక్షంగా అధికంగా ఆర్థిక నష్టాన్ని కలిగిస్తుంది.
- ❖ ఈ పండు ఈగలు 50 కిలో మీటర్ల వరకు కూడా వ్యాప్తి చెంది వేరే పంటలను ఆశ్రయించి దాని జీవిత చక్రం పూర్తి చేసుకుంటాయి. కింద రాలి కుళ్లిపోయిన పండ్లలో కూడా తన జీవిత చక్రాన్ని కొనసాగిస్తాయి. ఈ రెండు పద్ధతుల ద్వారా పండు ఈగలు తోటల్లో ఆశించే అవకాశం ఉంది.
- ❖ ఆడ తల్లి ఈగ కాయలు అభివృద్ధి చెందే దశలో అనువుగా ఉన్న ప్రదేశాన్ని ఎంచుకుని కాయ చర్మం లోపలికి అండోత్సర్గంతో గుచ్చి రంధ్రం చేసి సుమారుగా 100-500 గుడ్లను పెడుతుంది. తల్లి ఈగ తన జీవిత కాలంలో 1000 గుడ్లు పెడ్తుంది.
- ❖ ఈ గుడ్లు 2 నుండి 3 రోజులలో పిల్ల పురుగులుగా మారి లోపల ఉన్న కణజాలాన్ని తింటాయి. కాయలపై గుడ్లు పెట్టడానికి చేసిన రంధ్రాల ద్వారా ఇతర శిలీంధ్రాలు, బాక్టీరియా ఆశించి కాయలు మెత్తబడి కుళ్లిపోతాయి.
- ❖ ఈ లార్వా దశ అంతా పండులోనే జరుగుతుంది, కావున నష్టాన్ని మనం పండు కోసే వరకు గుర్తించలేము. తదుపరి పిల్ల పురుగులు బాగా ఎదిగి కోశస్థ దశకు చేరే ముందు పండ్ల నుండి ఎగిరిపడి భూమిలో కోశస్థ దశను గడుపుతాయి. పిల్ల పురుగుల వలన తీవ్రమైన ఆర్థిక నష్టం కలుగుతుంది.
- ❖ కోశస్థ దశ 10-40 రోజులలో వాతావరణ పరిస్థితులను బట్టి తల్లి ఈగలుగా మారుతాయి.
- ❖ ఈ ఆడ, మగ ఈగలు సంపర్కం జరిపి గుడ్లను పెట్టి వాటి జీవిత చక్రాన్ని ప్రారంభిస్తాయి. ఇలా పండు ఈగలు సుమారుగా 40 నుండి 50 రోజులలో తమ జీవిత చక్రాన్ని పూర్తి చేసుకుంటాయి. ఒక్కో పండు ఈగ వేల ఈగలను సృష్టించి తన సంతతిని పెంచుకుంటూ మన పంటకు నష్టాన్ని కలుగజేస్తాయి. కావున వీలైనంత త్వరగా సరైన యాజమాన్య పద్ధతులను తీసుకోవడం ఎంతో ముఖ్యం.
- ❖ పండు ఈగ ఆశించిన పండ్లు నాణ్యతను కోల్పోయి తినడానికి కాని, స్థానిక మార్కెట్లలో అమ్మడానికి కాని ఎగుమతికి గాని పనికిరావు.

**నివారణ:**

- ❖ వారం వ్యవధిలో ఈగ కొట్టిన పండ్లను గుర్తించి నాశనం చేయాలి.
- ❖ పండు ఈగ ఆశించిన కాయలు పసుపు రంగుకు మారి కుళ్ళి రాలి పడిపోతాయి. అటువంటి పండ్లను ఏరి నాశనం చేయాలి.





# పుచ్చసాగులో మెళకువలు

ఇ.రాంబాబు, ఎస్.మలాతి, ఎన్.కిషోర్ కుమార్, బి.క్రాంతి కుమార్, కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల, మహబూబ్‌నగర్

పుచ్చ పండులో తక్కువ కాలరీలు, విటమిన్-ఎ, విటమిన్-సి ఉండడమే కాక దాహాన్ని తీర్చే గుణం కలిగి ఉంటాయి. ఈ పంట అధిక ఉష్ణోగ్రత (23-27 డిగ్రీల సెం.గ్రే.)తో కూడిన పొడి వాతావరణంలో బాగా పెరుగుతాయి. వాతావరణంలో తక్కువ ఉష్ణోగ్రత (18 డిగ్రీల కంటే తక్కువ), ఎక్కువ తేమ ఈ పంట సాగుకు అనుకూలం కాదు.

**నేలలు :** మురుగు నీటి వసతి కలిగిన ఇసుక నేలలు, ఎర్ర చెల్క భూములు, నల్లరేగడి నేలలు, ఉదజని సూచిక 6-6.7 ఉన్న నేలలు పుచ్చసాగుకు అనుకూలం.

**విత్తే సమయం :** జనవరి రెండవ పక్షం నుండి ఫిబ్రవరి రెండవ పక్షం వరకు విత్తుకోవచ్చు.

**రకాలు :**

**షుగర్‌బేబి :** కాయలు చిన్నవిగా, గుండ్రంగా, పైన నీలి వర్ణపు నలుపుతో, లోపల చిక్కటి గులాబి రంగు కలిగి ఉంటాయి. 2-3కిలోల బరువుతో ఎకరాకు 60 క్వింటాళ్ళ దిగుబడినిస్తుంది.

**అర్క జ్యోతి, అర్క మానిక్ :** పండ్లు గుండ్రంగా, పైన ఆకుపచ్చ, ముదురాకు పచ్చ చారలతో, లోపల ఎరుపు కండను కలిగి ఉంటాయి. 6-8 కిలోల బరువుతో ఎకరాకు 80 క్వింటాళ్ళ దిగుబడినిస్తాయి.

ఇవి కాక దుర్గాపూర్ కేసర్, దుర్గాపూర్ మీఠా, ఎన్.ఎస్.295, అపూర్వ, స్టీవ్ డ్రాగన్, మాధురి, మధు బిందు మొదలగు ప్రైవేట్ హైబ్రిడ్ రకాలు పుచ్చ సాగుకు అందుబాటులో ఉన్నాయి.



**విత్తన మోతాదు :** 500-600 గ్రా. విత్తనం ఎకరాకు సరిపోతుంది.

**విత్తడం :** 2-2.5 మీటర్ల ఎడంతో 60 సెం.మీ. వెడల్పు గల నీటి కాలువలను తయారు చేసుకోవాలి. కాలువలకు ఇరువైపులా 30-50 సెం.మీ. ఎడంతో విత్తనాలు విత్తుకోవాలి.

**ఎరువులు :** ఎకరాకు 4-5 టన్నుల బాగా మాగిన పశువుల ఎరువు వేసుకోవాలి. 32-40 కిలోల

- చెట్టు కింద నేలను దున్ని కోశస్థ దశను నాశనం చేయాలి. పాదులలో క్లోరిపైరిఫాస్ పొడి మందు వేసి కలియదున్నాలి. దీనివల్ల కోశస్థదశలు చనిపోతాయి. ప్రతి 20 చెట్లకు ఒక ఆకర్షణ పళ్లెం ఉంచాలి. 10 మి.లీ. మిథైల్ యుజినాల్‌ను 200 మి.లీ. నీటికి కలిపి ఈ పళ్లెంలలో పోయాలి. ఈ ద్రావణంలో 20 మి.లీ. మలాథియాన్ లేదా 0.3 గ్రా. కార్బోఫ్యురాన్ 3సిజి గుళికలు కలపాలి. మిథైల్ యుజినాల్ పండు ఈగకు ఎరగా పనిచేస్తుంది.
- ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలను అమర్చాలి. ఈ బుట్టలోని మిథైల్ యుజినాల్ ఎరను నెలకు ఒకసారి మార్చాలి. దీనితోపాటు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు కాయ కోతకు మూడు వారాల ముందు 2 మి.లీ. మలాథియాన్ లేదా 0.5 మి.లీ. డెల్టామెత్రిన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మామిడి పండ్లను ఎగుమతి చేసే రైతులు కాయలు కోసిన తర్వాత వాటిని 48 డిగ్రీ సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత గల నీటిలో 60-75 నిమిషాలు ఉంచితే గుడ్లు, పిల్ల పురుగులు నాశనం అవుతాయి.





భాస్వరం, 16-24 కిలోల పొటాష్, 40 కిలో నత్రజనినిచ్చే ఎరువులు వేయాలి. నత్రజనిని రెండు దఫాలుగా, విత్తేటప్పుడు, విత్తిన 25 రోజుల తర్వాత వేసుకోవాలి. పొటాష్‌ను రెండు దఫాలుగా, ఆఖరి దుక్కిలో, పిందెలు కాయలుగా మారే దశలో వేసుకోవాలి.

**నీటి యాజమాన్యం :** ప్రథమ దశలో, మళ్ళ కాయలు ఎదిగేటప్పుడు నీటిని ఇవ్వాలి. కాయలు పక్వానికి వచ్చిన తర్వాత ఎక్కువ నీరు కట్టడం వల్ల కాయలు పగిలి నాణ్యత తగ్గుతుంది.

**అంతర కృషి :** కలుపు నివారణకు పెండిమిథాలిన్ 1.25 లీటర్లు ఎకరాకు నాటిన 24 గంటల తర్వాత 48 గంటలలోపు పిచికారీ చేయాలి.

- తీగలు 2-4 ఆకుల దశలో ఉన్నప్పుడు 2.5-3.0 గ్రా. బోరాన్ లీటరు నీటికి మరలా పూత దశలో రెండవసారి పిచికారీ చేయడం ద్వారా ఆడపూల సంఖ్య పెరిగి, దిగుబడి పెరుగుతుంది.

**సస్యరక్షణ :**

**పురుగులు :** మొక్క నాటగానే చీడపీడలు ఆశిస్తాయి. కనుక విత్తనంతో పాటు గుళిక మందు వేసుకుంటే, నెల రోజుల వరకు మొక్కలను కాపాడుతుంది. దీని కోసం 8 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలను విత్తనంతో పాటు వేయాలి.

**తామర పురుగులు :** చిన్న పురుగులు గుంపులుగా తీగ చిగుళ్లను, ఆకులను ఆశించి, రసాన్ని పీలుస్తాయి. దీని నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. ఫిప్రోనిల్ మందును కలిపి పిచికారీ చేసుకోవాలి.

**ఎర్ర పెంకు పురుగులు :** ఈ పురుగులు పుచ్చ మొక్కల్ని తొలిదశలో ఎక్కువగా ఆశించి, ఆకులను తినేస్తాయి. దీని నివారణకు కార్బరిల్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**తెగుళ్ళు :**

**బూడిద తెగులు :** ఈ తెగులు సోకినప్పుడు ఆకులపైభాగాన, అడుగు భాగాన కూడా తెల్లని బూడిద రంగు మచ్చలు ఏర్పడి ఆకు అంతా తెల్లని బూడిద వంటి పదార్థంతో కప్పబడి, ఆకులు పసుపు రంగుకు మారి, వడలినట్లు కనిపిస్తాయి. నివారణకు కెరాథేన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**పల్లాకు తెగులు :** ఈ తెగులు వైరస్ వలన కలుగుతుంది. దీని వలన ఆకులు ఈనెలు మాత్రం పసుపు రంగుకు మారిపోతాయి. ఆకుల మీద బుడిపెవలె ఏర్పడి, తెగులు సోకిన పాదులు పూత పూయవు, కాయలు కూడా ఏర్పడవు. ఈ తెగులు పేనుబంక ద్వారా వ్యాపిస్తుంది. కావున నివారణకు మెటాసిస్టాక్స్ లేదా రోగార్ అనే మందు లీటరు నీటికి 2 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

# మామిడిలో కోతకు ముందు ఉపయోగించే పండ్ల సంచుల ప్రాముఖ్యత

వి.సుచిత్ర, పి.హరికాంత్, ఎ.నితీష్, పి.మౌనిక, ఎం.అఖిలేష్, పండ్ల పరిశోధనా స్థానం, సంగారెడ్డి

మామిడి పండు - ఫలాల రాజు, భారతదేశ జాతీయ ఫలం. మామిడి పండు రుచికి, ఆర్థిక ప్రాముఖ్యతకు ప్రసిద్ధమైన ఫలం. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద మామిడి ఉత్పత్తిదారు. ఇది ప్రపంచ ఉత్పత్తిలో సుమారు 40% వాటాను కలిగి ఉంది. భారతదేశంలో ప్రధానంగా మామిడిని ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర బీహార్, గుజరాత్, వంటి రాష్ట్రాలు ఉత్పత్తి చేస్తున్నాయి. జీవన ప్రమాణాలు మెరుగయ్యే కొద్దీ, ప్రజలు ఆహార భద్రతపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు, దీనివల్ల సాంప్రదాయ సాగు విధానాలకు కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి.

భారతదేశం, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూ.టి.ఒ)లో చేరిన తర్వాత, "గ్రీన్ బారియర్" అనే అడ్డంకి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతికి అంతర్జాతీయ వాణిజ్యంలో ప్రధాన సమస్యగా మారింది.

మామిడి వేసవి కాలపు ప్రముఖ పండు. అయితే, దీని సాగులో భారీ ఈదురుగాలుల కారణంగా పండ్లు రాలడమే కాకుండా పండు ఈగ వంటి అనేక చీడల వలన, మామిడి కాయ పెరిగే దశలో అసాధారణ ఉష్ణోగ్రత మార్పులు, తేమ పెరుగుదల, అకాల వర్షపాతం వలన కాయపై మచ్చలు ఏర్పడడం లాంటి సమస్యల వల్ల ప్రతి ఏడాది దిగుబడిని తగ్గిస్తున్నాయి. ఇంతే కాకుండా మార్కెట్లో వీటికి తక్కువ ధర లభిస్తుంది..

వీటిని నివారించేందుకు, రైతులు అధిక మోతాదులో పురుగుమందులు, రసాయనాలు వాడుతున్నారు, ఇది ఆహార భద్రతకూ హానికరం. ఈ సమస్యల నివారణకు పండ్ల సంరక్షణ సంచులు (ఫ్రూట్ బ్యాగింగ్) అత్యుత్తమమైన పరిష్కారంగా నిరూపితమయ్యాయి. ఈ పద్ధతి ద్వారా పురుగుల, వ్యాధుల ప్రభావాన్ని తగ్గించవచ్చు, భౌతిక నష్టం లేకుండా చేయవచ్చు, నేరుగా ఎండ తగిలి పండు పాడవకుండా రక్షించవచ్చు, రంగు మెరుగుపరచవచ్చు. ఇప్పటికే, ఈ విధానం భారతదేశంలో అరటి పండ్ల ఉత్పత్తిలో మచ్చలు లేని, నాణ్యత కలిగిన పండ్లను ఉత్పత్తి చేయుడానికి విజయవంతంగా ఉపయోగిస్తున్నారు.

### మామిడి పండ్ల సంరక్షణ సంచుల ప్రయోజనాలు:

- పురుగుల, రోగాల నియంత్రణ - పండు ఈగ, కాయతొలిచే పురుగులు, థ్రిప్స్, టెంకపురుగులు వంటి పురుగులు, యాంత్రక్నోస్ వంటి తెగుళ్ళు తదితర వాటి ప్రభావాన్ని తగ్గిస్తుంది.
- ఎండ, గాలి, వర్షాల నుండి రక్షణ - తీవ్రమైన వాతావరణ మార్పుల నుండి ఎండ దెబ్బ నుండి పండ్లను కాపాడుతుంది.



# వరిలో కంకినల్లి, సుడిదోమ యాజమాన్యం

డా.ఆర్.శ్రవణ్ కుమార్, బి.మాధవి, డా.వై.హరి, డి.అశ్విని, జి.నీలిమ, డా.బి.సతీష్ చంద్ర, డా.సి.ఎచ్.రాములు, డా.వి.వెంకన్న, డా.కె.రాజేంద్రప్రసాద్, డా.యు.నాగభూషణం, డా.సి.ఎచ్.అనూష, డా.ఆర్.ఉమారెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, వరంగల్

తెలంగాణ రాష్ట్రంలో వరి చాలా ముఖ్యమైన ఆహార పంట. గత కొద్ది సంవత్సరాల నుంచి వానాకాలంలో, యాసంగిలో వరి పంట వివిధ దశలలో ఉంది. పంట తర్వాత దశలో కంకినల్లి, సుడిదోమ ఆశించి నష్టం చేస్తాయి. వీటి వలన కలిగే నష్టం, వాటి యాజమాన్య చర్యల గురించి చూద్దాం.

**కంకినల్లి :** ఈ పురుగులు నల్లి జాతికి చెంది, కంటికి కనిపించనంత చిన్నగా సూక్ష్మంగా ఉంటాయి. వాతావరణ ఉష్ణోగ్రతలను బట్టి 7-21 రోజులలో ఈ నల్లి జీవత చక్రం పూర్తవుతుంది. గుడ్లు తల్లి పురుగుల సైజులో మూడవ వంతు, పిల్ల పురుగులు తల్లి పురుగుల సైజులో సగం పరిమాణంలో ఉంటాయి. పగటి ఉష్ణోగ్రతలు 28-30 డిగ్రీల సెల్సియస్ ఉన్నప్పుడు అధిక తేమ, బెట్ట వాతావరణ పరిస్థితులు ఈ నల్లి వృద్ధి చెందటానికి అనుకూలంగా ఉంటాయి.

ఈ కంకినల్లి ఆకులు, కాండం, గింజలను ఆశించి నష్టం చేస్తాయి. ఇవి ఆకుల మధ్య ఈనెపై లేదా ఆకు మట్ట, లేదాకాండం మీద ఆశించి పిల్ల, తల్లి నల్లి పురుగులు రసాన్ని పీలుస్తాయి. అందువలన ఆకుల మధ్య ఈనెపై, లేదా ఆకుమట్టి మీద, కాండం మీద గోధుమ నుండి నల్లటి మచ్చలు ఏర్పడతాయి. ఈ నల్లులు రసాన్ని పీల్చడం వలన వెన్నులు వంకర తిరగడం, వెన్నులు పాక్షికంగా బయటకి రావడం, గింజల మీద గోధుమ లేదా నల్లటి మచ్చలు ఏర్పడతాయి. ముఖ్యంగా వీటి వలన గింజల బరువు, సైజు తగ్గుతుంది. గింజలు సరిగ్గా ఏర్పడవు. గింజల మీద మచ్చలు ఏర్పడడం వలన వాటి నాణ్యత తగ్గి, గిట్టుబాటు ధర లభించదు. గింజలు మొలకెత్తే శాతం తగ్గుతుంది. ఈ నల్లులు చేసిన సూక్ష్మ రంధ్రాల ద్వారా ఇతర వ్యాధిని కలుగజేసే శిలీంధ్రాలు ప్రవేశించి ఎక్కువ నష్టం చేస్తాయి.

**యాజమాన్యం :**

- నాణ్యమైన, కంకి నల్లి ఆశించని విత్తనాన్ని సాగుకి ఉపయోగించాలి.

➡

---

➡

- పురుగుమందుల అవసరం తగ్గిస్తుంది - సంచితో కప్పిన పండ్లకు రసాయన ద్రావణాల అవసరం ఉండదు.
- పండ్ల రంగు, పరిమాణం మెరుగుపరచి, మార్కెట్ విలువ పెంచుతుంది.
- మామిడి పండ్లను ఎగుమతికి అనువుగా మార్చుతుంది.
- **మామిడి పండ్ల సంరక్షణ సంచులు - విధానం :**
- ఉత్తమమైన మెటీరియల్ - డబుల్ లేయర్డ్ గోధుమ రంగు సంచులు ఉపయోగించడం ఉత్తమమైన పద్ధతి.
- బ్యాగింగ్‌కు సరైన దశ - పండు భుజాల దశ లేదా కోడిగుడ్డు పరిమాణానికి చేరినప్పుడు.
- బ్యాగింగ్ విధానం - సంచిని పండుకు కనీసం 3 సెం.మీ. పైగా ఊడిపోకుండా ఒక మోస్తారుగా గట్టిగా కట్టాలి.
- ఈ విధానానికి అనుకూలమైన రకాలు - బంగనపల్లి, హిమాయత్, కేసర్, సువర్ణరేఖ మొదలైన రకాలు.

ఈ సాంకేతికత ద్వారా మామిడి నాణ్యత, నిల్వ సామర్థ్యం మెరుగుపడి, మార్కెట్ విలువ పెరుగుతుంది. దీని వల్ల రైతులకు అధిక ఆదాయం, స్థిరమైన సాగు సాధ్యమవుతుంది.




- విచక్షణా రహితంగా పురుగు మందులను పిచికారీ చేయకూడదు.
- స్పైరోమెసిఫెన్ అనే మందును 1 మి.లీ.ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఈ మందును చిరుపొట్ట దశలో వెన్నులు బయటికి వెలువడక ముందే పిచికారీ చేసినట్లయితే కంకి నల్లిని సమర్థవంతంగా అరికట్టవచ్చును.

**సుడిదోమ :** రెండు రకాల దోమలు (గోధుమ రంగు దోమ, తెల్లవీపు దోమ) వరిని ఆశించి నష్టం చేస్తాయి. యాసంగిలో మార్చి 2వ వారం నుంచి ఏప్రిల్ వరకు పంటను ఆశిస్తాయి. దోమను తట్టుకోని రకాలను సాగు చేసినప్పుడు, పొలంలో నీరు ఎక్కువగా నిల్వ ఉన్నప్పుడు, నత్రజనిని ఎక్కువగా వాడినప్పుడు, కాలిబాటలు తీయని పొలాల్లో, పంట తొలిదశలో ఆకులను ఆశించే పురుగుల నివారణకి క్లోరిపైరిఫాస్, ప్రొఫినోఫాస్, లామ్డా సైహలోత్రిన్, బీటాసిఫ్లుత్రిన్ వంటి సింథటిక్ పైరథ్రాయిడ్ మందులు వాడినప్పుడు సుడిదోమ ఉధృతి పెరుగుతుంది.

పిల్ల, పెద్ద దోమలు నీటి మట్టానికి పైన, దుబ్బుల మొదళ్ల దగ్గర ఉండి రసాన్ని పీల్చుతాయి. దీని వలన పంట లేత పసుపు రంగుకి మారుతుంది. పంట సుడులు సుడులుగా వలయాకారంలో ఎండిపోతుంది. దోమ ఉధృతి ఎక్కువైతే పొలం ఎండిపోయి పడిపోవడం, తాలు గింజలు ఏర్పడడం, నూర్చినప్పుడు నూకశాతం పెరుగుతుంది.

**యాజమాన్యం :**

- ప్రతి 2 మీటర్లకి 20 సెం.మీ. చొప్పున పొలంలో కాలిబాటలు తీయాలి.
- నత్రజని సంబంధ ఎరువులను మోతాదును మించి వాడకూడదు.
- తొలి దశలో ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా బ్యుప్రొఫెజిన్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రా. లేదా పైమెట్రోజైన్ 0.6 గ్రా. లేదా ట్రైఫ్లుమెజోపైరిమ్ 0.4 మి.లీ. లీటరు నీటికి కలిపి మొక్కల మొదలుపై పడేటట్లు పిచికారీ చేయాలి.

# మామిడిలో పూత దశలో చీడల నివారణ, సూక్ష్మపోషక లోపాల నివారణ

ఎం.రాజేష్ కుమార్, డా.ఆదిశంకర్, డా.టి.ప్రభాకర్ రెడ్డి, డా.ఓ.శైల, కె.రామకృష్ణ, డా.బి.రాజశేఖర్, ఇ.జ్యోత్స్న, కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం

భారతదేశం పండ్ల ఉత్పత్తిలో రెండవ స్థానంలో ఉంది. పండ్ల తోటలలో మామిడి పంట ప్రధానమైనది. ప్రస్తుతం భారతదేశంలో మామిడి 2,339 మిలియన్ హెక్టార్లలో 29,336 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాగవుతోంది. ప్రధానంగా మామిడి పండించే రాష్ట్రాలు ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఒరిస్సా, కర్ణాటక. తెలంగాణలో 34,000 హెక్టార్లలో 11.47 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి సాగవుతోంది. నాగర్‌కర్నూలు జిల్లాలో 27,561 హెక్టార్లలో 9.2 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిలో సాగవుతోంది. మామిడిని పండ్లలో రారాజుగా పరిగణిస్తారు. అద్భుతమైన రుచి, ఆకర్షణీయమైన సువాసనతో పాటు ఇందులో విటమిన్ ఎ, సి పుష్కలంగా ఉంటాయి.

మామిడిలో చిన్న పిందెలు ఏర్పడే దశలో, తామర పురుగు, పిండి పురుగులు, మచ్చ తెగులు, బూడిద తెగులు కూడా ఆశించి పంటను నష్టపరుస్తాయి. ఈ దశలో పిందె రాలడం సమస్య అధికంగా ఉంటుంది. ఈ సమస్యలన్నింటిని నివారించడానికి పిందె కట్టే దశలో ఫిప్రోనిల్ 2 మి.లీ. లీటరు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.3 గ్రా. లీటరు, హెక్సాకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**సూక్ష్మపోషక లోపాలు :** మామిడిలో వివిధ రకాల సూక్ష్మపోషక లోపాల వల్ల పిందె, పూత రాలడం గమనించవచ్చు. అలాగే కాయలు సరిగా పెరగవు. కాయలో నాణ్యత, రుచి ఉండదు. ప్రస్తుతం మామిడి పూత దశలో ఉంది. ఈ తరుణంలో సూక్ష్మ పోషక లోపాలను నివారించడానికి చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి తెలుసుకుందాం.

**జింకు లోపం :** సాధారణంగా చౌడు నేలల్లో ఎక్కువగా కనిపిస్తుంది. జింకు లోపమున్న నేలల్లో మొక్కల పెరుగుదల క్షీణించి, పాలిపోయి చనిపోతాయి. పెరుగుదల దశలో జింకు లోపమున్న ఎడల ఆకులు చిన్నవిగా మారి సన్నబడి, పైకి లేదా కిందికి ముడుచుకొనిపోతాయి. కణుపుల మధ్య దూరం తగ్గిపోయి, ఆకులు గులాబి రేకుల వలె గుబురుగా తయారవుతాయి. మొక్కల పెరుగుదల క్షీణించి కాయల పెరుగుదల, నాణ్యత, దిగుబడి తగ్గిపోతుంది.

కాయలు కోసిన వెంటనే జూన్-జూలై మాసాల్లో 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు లీటరు నీటికి 5 గ్రా. జింక్ సల్ఫేట్‌తో పాటు 10 గ్రా. యూరియాను, 0.1 మి.లీ. స్టికర్ / వెట్టర్ (ఇన్‌డోట్రాన్ లేదా ట్రైటాన్) కలిపి పిచికారీ చేయడం వలన జింకు లోపాన్ని నివారించవచ్చు.

**బోరాన్ లోపం :** బోరాన్ లోపం గల చెట్ల ఆకులు కురచబడి, ఆకు కొనలు నొక్కుకుపోయినట్లు, పెళుసుగా తయారవుతాయి. కాయ దశలో కాయలు పగుళ్ళ చూపడం సర్వసాధారణంగా కనపడే లక్షణం. బోరాన్ లోప నివారణకు ప్రతి మొక్కకు 100 గ్రా. బోరాక్స్‌భూమిలో వేయాలి. లేదా 0.1 నుండి 0.2 శాతం బోరాక్స్ లేదా బోరికామ్లం కొత్త చిగురు వచ్చినప్పుడు ఒకటి లేదా రెండుసార్లు పిచికారీ చేయాలి.

**ఇనుపధాతు లోపం :** ఇనుపధాతు లోపం గల చెట్ల ఆకులు పచ్చదనం కోల్పోయి తెల్లగా పాలిపోతాయి. ఆకుల సైజు తగ్గిపోయి, తీవ్రమైన లోపం ఉన్న ఎడల మొక్కల ఆకులపై నుండి కిందకి ఎండిపోతాయి. ఇనుపధాతు లోపం సున్నపు రాయి ఉన్న నేలలో సాధారణంగా కనబడుతుంది. దీని నివారణకు 2.5 గ్రా. అన్నబేది + 1 గ్రా. నిమ్మఉప్పు లేదా ఒక బద్ద నిమ్మకాయ రసం లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

పిందె పండు బారటాన్ని నివారించడానికి 19-19-19 10 గ్రా. లీటరు నీటికి, ప్లానోఫిక్స్ అనే హార్మోన్ మందును 1 మి.లీ. / 4.5 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. సూక్ష్మపోషక నివారణకు ముందు జాగ్రత్తగా ఒక మొక్కకి 50-100 కిలోల పశువుల ఎరువు, 100 గ్రా. జింక్ సల్ఫేట్, 100 గ్రా. ఫెర్రస్ సల్ఫేట్ ఉపయోగించడం వల్ల మామిడిలో సూక్ష్మపోషకాల లోపాలను అధిగమించి అధిక దిగుబడులను పొందవచ్చు.

# పుచ్చ సాగులో చీడపీడలు, తెగుళ్ళ యాజమాన్యం

ఎం.రాజేష్ కుమార్, డా.ఆదిశంకర్, డా.టి.ప్రభాకర్ రెడ్డి, డా.ఓ.శైల, కె.రామకృష్ణ, డా.బి.రాజశేఖర్, ఇ.జ్యోత్స్న, కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం

పుచ్చ వేసవిలో దహార్తిని తీర్చే, ఆరోగ్యాన్నిచ్చే పండు. పుచ్చలో ఎరుపు రంగు కండలో లైకోపిన్ అనే యాంటీ ఆక్సీడెంట్, విటమిన్ ఎ లు పుష్కలంగా ఉంటాయి. పుచ్చకాయ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన రకాలతో సంవత్సరం పొడవునా కాయలు లభ్యమవుతుండగా, వేసవి పంటగా సాగు అయ్యే పుచ్చకు మంచి డిమాండ్ ఉంటుంది. అందుకే పంటను వేసవి పొడవునా అందివచ్చేలా దఫా, దఫాలుగా సాగు చేస్తారు. పుచ్చకు ఇటీవల పురుగుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. సరైన యాజమాన్యం చేపట్టినట్లయితే తక్కువ ఖర్చుతో పురుగు, తెగుళ్ళను నియంత్రించవచ్చు.

**తామర పురుగులు :** ఇవి చాలా చిన్నగా ఉండి రెక్కల పురుగులు, ఆకులు, కొనలు, పిందెల నుండి రసం పీల్చడం వల్ల ఆకులపైకి పడవ ఆకారంలో తిరిగి, పిందెలు నల్లబారతాయి. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలతి.

**పండు ఈగ :** ఈగ పిందెలపై గుడ్లు పెట్టి, లార్వాలు కాయను తొలిచినట్లయితే వంకర్లు తిరిగి మార్కెట్‌కు పనికిరావు. దీని నివారణకు పిందె రాకముందు నుండే క్యూ-ల్యూర్ అనే పండు ఈగ ఆకర్షక బుట్టలు ఎకరానికి 8 చొప్పున పంట కాలం మొత్తం అమర్చుకోవాలి. మలాథియాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



**ఎర్రనల్లి :** ఇవి ఎరుపు రంగులో ఉంటు ఆకుల కింది భాగంలో సాలెగూడు లాగా ఏర్పరచుకొని రసం పీల్చడం వలన ఆకులపై భాగంలో పసుపు వర్ణం, గోధుమ రంగు మచ్చలతో ఆకులు కాలిపోయినట్లు కనిపిస్తాయి. వీటిని రైతులు తొలి దశలో త్వరగా గుర్తించలేరు. కావున ఎర్రనల్లి ఎక్కువ నష్టం కలుగజేస్తుంది. దీని నివారణకు అబామెక్టిన్ 0.5 మి.లీ. లేదా ప్రొపర్గైట్ 2 మి.లీ. లేదా స్పైరోమెసిఫెన్ 1.25 మి.లీ. లీటరు నీటికి కలిపి ఆకుల కింది భాగం తడిచేలా పిచికారీ చేయాలి.

**వైరస్ లేదా పల్లాకు తెగులు :** మొక్క కురచగా మారి ఆకులు మందంగా, చిన్నగా పసుపు, ఆకుపచ్చ రంగు మచ్చలతో పూత, కాత లేకుండా ఉంటాయి. వీటిని మొదటి దశలోనే పీకి నాశనం చేయాలి. రసం పీల్చే పురుగులు వ్యాధిని వ్యాపింపజేస్తాయి. కావున ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

**బూజు తెగులు :** ఆకుల కింద బూడిద, నీలి రంగు మచ్చలు ఏర్పడి పైకి పసుపు వర్ణంలో కనిపిస్తాయి. ఈ లక్షణాలు గమనించిన వెంటనే మాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

**బూడిద తెగులు :** ఆకుల కింద, పైన బూడిద మచ్చలు ఏర్పడి ఆకులు పండుబారి రాలిపోతాయి. దీని నివారణకు క్లోరోథలోనిల్ 2 గ్రా. లేదా హైక్సోకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అంతే కాకుండా కాయలు పగలకుండా బోరాన్ 2 గ్రా. + కాల్షియం నైట్రేట్ 5 గ్రా. + పొటాషియం నైట్రేట్ 5 గ్రా. లీటరు నీటికి కలిపి పిందె దశ నుండి కాయలు పూర్తిగా ఎదిగే వరకు ప్రతి 15-20 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలి.

# పచ్చిరొట్ట - పంటకు పోషణ

డా.రమ్య రాథోడ్, ఎం.సాయి చరణ్, డా.ఎ.కృష్ణ చైతన్య, ఎ.దినేష్, బి.మంజు భార్గవి
ప్రాంతీయ చెరకు, వరి పరిశోధన స్థానం, రుద్రూర్, నిజామాబాద్

అధునాతన వ్యవసాయంలో మితిమీరి రసాయన ఎరువులు వాడటం వల్ల పసిడిపంటలు పండే భూములు సహజ శక్తిని కోల్పోతున్నాయి. సాగుకు యోగ్యం కాకుండా తయారవుతున్నాయి. ముఖ్యంగా భూమిలో స్వతహాగా లభ్యమయ్యే పోషకాల్లో అసమానతలు ఏర్పడి, పంటలో సూక్ష్మపోషకాల లోపాలు బయటపడుతున్నాయి. ఫలితంగా భారీ పెట్టుబడులు పెట్టిన రైతులు తగిన దిగుబడి లేక నష్టపోవాల్సి వస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో నేలలను పునరుజ్జీవింపజేయడానికి సేంద్రియ ఎరువులను వాడాల్సిన అవసరం ఉన్నది. మరోవైపు పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు, కోళ్ల ఎరువు, గొర్రెల ఎరువు వంటి సేంద్రియ ఎరువుల లభ్యత సామాన్య రైతులకు భారంగా మారుతున్నది. ఈ నేపథ్యంలో జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట సాగు మంచి ప్రత్యామ్నాయం. ఈ పంటలను పొలాల్లో పెంచి, నేలలోనే కలియ దున్నడం వల్ల భూసారం పెరుగుతుంది. కలుపు నివారణతో పాటు అధిక దిగుబడులను పొందేందుకు ఆస్కారం ఉంది.

## పచ్చిరొట్ట పంటల గుణగణాలు:

**జనుము:** అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు. పచ్చిరొట్టగా పశువుల మేతగా ఉపయోగించవచ్చు. ఎకరానికి 12 నుండి15 కిలోల విత్తనం చల్లుకోవాలి. ఎకరానికి 5 నుండి 6 టన్నుల పచ్చి రొట్ట లభిస్తుంది. ఒక టన్ను జనుము పచ్చిరొట్టలో 4 కిలోల నత్రజని ఉంటుంది.

**జీలుగ:** చౌర గుణం గల భూములు అంటే చౌడు భూముల్లో, వరి పండించే భూముల్లో వేస్తారు. ఎకరానికి 10 నుండి12 కిలోల విత్తనం ఇసుకతో కలిపి చల్లడం వల్ల పొలం అంతా సమంగా పడుతుంది. దీనిని పూత దశలో కలియ దున్నడం వలన ఎకరానికి 9 నుండి10 టన్నుల పచ్చి రొట్ట లభిస్తుంది. ఒక టన్ను జీలుగా పచ్చిరొట్టలో 5 కిలోల నత్రజని ఉంటుంది.

**పిల్లి పెసర:** దీనిని తేలిక, బరువైన నేలల్లో సాగు చేయవచ్చు. చౌడు భూముల్లో సాగుకు పనికిరాదు. ఎకరానికి 6 నుండి 8 కిలోల విత్తనం అవసరం. ఎకరానికి 3 నుండి 4 టన్నుల పచ్చి రొట్ట లభిస్తుంది.


జీలుగ


జనుము


పెసర


గ్లైరిసిడియా

**అలసంద:** ఎకరానికి 4-6 టన్నుల దిగుబడి వస్తుంది. పూత దశలో కలియదున్నాలి. నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. తేలిక నేలల్లో అనుకూలంగా ఉంటుంది. పచ్చిరొట్టలో 3.5 కిలోల నత్రజని ఉంటుంది.

### పచ్చిరొట్ట ఎరువుల వల్ల లాభాలు:

- నేల భౌతిక స్థితి(నేల ఆకృతి) మెరుగుపడి, భూమి గుల్లగా మారి నేలలోనికి నీరు ఇంకే గుణం పెరుగుతుంది.

## పాఠకుల స్పందన కోసం..

**వ్యవసాయ పాడిపంటలు** మాస పత్రిక ఏడు దశాబ్దాలకు పైగా తెలుగు రైతాంగానికి తన సేవలు అందిస్తోంది. రైతులకు పంట కాలాల వారీగా వివిధ దశలకు అవసరమయ్యే సూచనలను, సలహాలను అందిస్తోంది. రైతు విజయగాథలను అందిస్తోంది. అలాగే ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ పథకాలను, వాటి ప్రయోజనాలను తెలియజేస్తోంది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించిన పంటల, ఇతర సమాచారాన్ని అందిస్తోంది. మన పత్రికకు రచయితలుగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, అనుభవజ్ఞులు, రైతులు కావాల్సిన సమాచారాన్ని, విశ్లేషణలను అందిస్తున్నారు. అయితే ఈ పత్రిక ప్రయోజనాన్ని పొందే రైతుల నుంచి మేము స్పందన ఆశిస్తున్నాం. రైతులే కాకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు తమ సూచనలను అందిస్తే మరింత మెరుగ్గా తెచ్చే ప్రయత్నం చేస్తామని హామీ ఇస్తున్నాం. మీ స్పందనలను పోస్ట్ కార్డుల ద్వారా లేక **tgpadipantalu@gmail.com** కు మెయిల్ ద్వారా తెలియజేయవచ్చు. మీ అందరి స్పందనలతో, సూచనలతో మన **వ్యవసాయ పాడిపంటలు**ను రైతాంగానికి మరింత ప్రయోజనకరంగా రూపొందించుకుందాం. బంగారు తెలంగాణ స్వప్నాలను నిజం చేసుకుందాం.

-సం.

- నేలలో సేంద్రియ పదార్థం వేయ్యడం వల్ల సూక్ష్మజీవులు వృద్ధి చెంది, జీవ రసాయనిక చర్యల వలన నేల సారం పెరగడమే కాక, నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకొని ఉత్పాదకత సామర్థ్యాన్ని పెంచుతుంది.
- నేలలో క్లిష్ట (లభ్యం కానీ) రూపంలో ఉన్న అనేక పోషకాలను లభ్య రూపంలోకి మారుస్తాయి (మినరలైజేషన్).
- జీలుగ, సీమజీలుగ వంటి పైరులు వేసినప్పుడు వాటి వేళ్ళు ఎక్కువ లోతుకు వెళ్లడం వలన భూమి లోపలి పొరలలో నిక్షిప్తమైన అనేక పోషకాలను వెలికి తెచ్చి లభ్య రూపంలో పంటలకు అందిస్తాయి.
- చౌడు భూముల పునరుద్ధరణకు ఉపయోగపడతాయి (జీలుగా ,సీమజీలుగా).
- భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా ఉంటుంది.
- సూక్ష్మ పోషకాలను చిలేట్లుగా మార్చి పంట మొక్కలకు అందేటట్లు చేస్తాయి.
- పచ్చి రొట్ట పైర్లు ఎరువులు గానే కాకుండా పశువుల మేతగా ఉపయోగపడతాయి.

### పచ్చి రొట్ట ఎరువుల సాగులో మెళకువలు :

- ప్రధాన పంట కోయగానే నేలలో మిగిలిన తేమను సద్వినియోగ పరచుకొని పచ్చి రొట్ట ఎరువులు విత్తుకోవాలి.(ఉదా: వరి కోసే ముందు జనము లేదా పిల్లి పెసర జల్లి వెంటనే వరి కోస్తారు).
- తేమ చాలనీ ప్రాంతాల్లో వేసవిలో దూకి దున్ని తొలకరి వర్షాలు పడగానే విత్తుకోవాలి. (వరి సాగు చేసే ప్రాంతాల్లో)
- నీటి వసతి గల ప్రాంతాల్లో వేసవిలో సాగు చేయడం లాభదాయకం.
- పసుపు, కంది, చెరకు వంటి పంటల వరుసల మధ్య పచ్చి రొట్ట పెంచి పూత సమయంలో కలియదున్నవచ్చు.

# "ఆరోగ్యానికి అమృతం - గోధుమ గడ్డి"

ఎ.సాయి కిషోర్, ఎన్.చరిత,ఎల్.శ్రావిక, బి.దీపక్ రెడ్డి, డి.స్రవంతి, కె.నాగంజలి, జె. హేమంత కుమార్, వ్యవసాయ కళాశాల, అశ్వరావుపేట



వీట్‌గ్రాస్ లేదా గోధుమ గడ్డిని సాధారణంగా 'జీవ ఆహారం' అని కూడా పిలుస్తారు, ఎందుకంటే ఈ గడ్డిలో అత్యధిక శాతం క్లోరోఫిల్ ఉంటుంది. సుమారు 70 శాతం క్లోరోఫిల్ కంటెంట్ ఉంటుంది. క్లోరోఫిల్ అనేది ఆకుపచ్చని మొక్కల్లో ఉండే ఒక రసాయన సమ్మేళనం. దీని వల్లనే మొక్కలు సూర్యరశ్మిని గ్రహించి ఆహారం అనగా పిండి పదార్థాన్ని తయారు చేసుకుంటాయి. అందుకే దీనిని జీవ ఆహారంగా పేర్కొంటారు. గోధుమ గడ్డి రసం పిండి జ్యూస్ రూపంలో తాగుతారు. ఇది పొడి రూపంలో కూడా వస్తుంది. ఈ వీట్ గ్రాస్ అనేది పుష్కలమైన పోషకాలు, యాంటీఆక్సిడెంట్లతో నిండిన ఒక సూపర్ ఫుడ్.

గోధుమ గడ్డి రసం ఆరోగ్యప్రదాయిని. దీనిని అనేక రోగాలకు నివారిణిగా ఉపయోగిస్తారు. ఒక గ్లాసు రసంలో 'ఎ' విటమిన్, బి కాంప్లెక్స్, సి, ఇ, కె విటమిన్లు, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, ఫాస్పరస్, పొటాషియం, సెలీనియమ్, సోడియం, సల్ఫర్, కోబాల్ట్, జింక్, క్లోరోఫిల్ ఉంటాయి. దీనిలో కొలెస్ట్రాల్ ఉండదు. ఒకగ్లాసు లోనే 17 ఎమినో యాసిడ్స్ ఫైబర్ ఎంజైమ్స్ ఉంటాయంటే ఇది ఆరోగ్యానికి ఎంత ఉపయోగకారో తెలుస్తుంది. దీనిని కేవలం గడ్డి రసం అని తీసిపారేయలేము. గోధుమ మొలకలను న్యూట్రిషనల్ రిజర్వాయర్‌గా పౌష్టికాహార నిపుణులు గుర్తించారు.

గోధుమ గడ్డి జ్యూస్‌ను ప్రతిరోజు తాగడం ద్వారా లెక్కలేనన్నీ ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చునని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనిని ఆరోగ్య టానిక్‌గా తాగవచ్చు, తద్వారా కొన్ని నిర్దిష్ట వ్యాధులను నయం చేయడంలో కూడా సహాయపడవచ్చునని చెబుతున్నారు. కాలేయ ఆరోగ్యం, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలకు గోధుమగడ్డి జ్యూస్ అద్భుత ఔషధంగా పనిచేస్తుంది. ప్రతిరోజూ గోధుమగడ్డి జ్యూస్ తాగటం వలన ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చో ఇక్కడ చూద్దాం.

**రోగ నిరోధకశక్తిని పెంచుతుంది :** గోధుమగడ్డి జ్యూస్ తాగడం ద్వారా పుష్కలమైన పోషకాలు శరీరానికి అందుతాయి. ఇది మీకు మంచి శక్తిని ఇస్తుంది, జీర్ణక్రియలో తోడ్పడుతుంది. రోగనిరోధక శక్తిని అద్భుతంగా పెంచడంలో సహాయపడుతుంది, తద్వారా ఇన్ఫెక్షన్లను ఎదుర్కొనే రక్షణ కవచం శరీరానికి లభిస్తుంది.

**గాయాలను నయం చేస్తుంది :** గోధుమ గడ్డి జ్యూస్ యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు కలిగి ఉంటుంది. ఇది శరీరంలోని నొప్పులు, వాపులు, మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇందులోని క్లోరోఫిలిన్ సమ్మేళనం, బాక్టీరియోస్టాటిక్ గుణాలు గాయాలను త్వరగా నయం చేయడంలో పాత్రవహిస్తుంది, అంతేకాకుండా రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది.

**కాలేయ ఆరోగ్యం కోసం :** కాలేయం ఒక ముఖ్యమైన అవయవం. ఇది ఆరోగ్యంగా ఉంటే, మనిషి ఆరోగ్యంగా ఉంటాడు. ఎందుకంటే శరీరంలోని టాక్సిన్లను నిర్విరికరణ చేయడంలో కాలేయం ప్రధాన పాత్ర పోషిస్తోంది. గోధుమ గడ్డి రసంలో కోలిన్, అధిక మినరల్ కంటెంట్ కారణంగా, ఇది కూడా ఒక డీటాక్సింగ్ పానీయంలా పనిచేసి కాలేయంపై పనిభారాన్ని తగ్గిస్తుంది, తద్వారా కాలేయంను ఆరోగ్యంగా ఉంచుతుంది. కాలేయం పనితీరును పెంచుతుంది.

**క్యాన్సర్ నివారణ :** వీట్‌గ్రాస్ జ్యూస్ అనేది యాంటీక్యాన్సర్ థెరపీకి ప్రత్యామ్నాయ ఔషధం (సి.ఎ.ఎం.). ఇందులో ఉండే అధిక యాంటీఆక్సిడెంట్ కంటెంట్ క్లోరోఫిల్, లాట్రిల్, యాంటీఆక్సిడెంట్ ఎంజైమ్ సూపర్ ఆక్సైడ్ డిస్ముటేస్ (ఎస్.ఒ.డి.). వంటివి శరీరంలో క్యాన్సర్ కణాలు పెరగకుండా నిరోధిస్తాయి.

**హైబీపీని తగ్గిస్తుంది :** అధిక రక్తపోటును తగ్గించడానికి గోధుమగడ్డి జ్యూస్ సహజమైన ఔషధం. దీనిలో ఉండే ఫైబర్ కంటెంట్ జీర్ణవ్యవస్థ నుండి కొలెస్ట్రాల్‌ను తుడిచివేయడానికి, అలాగే శరీరం అంతటా రక్త మార్గాలను విస్తరిండానికి సహాయపడుతుంది. తద్వారా రక్తపోటును నియంత్రిస్తుంది.

**దయాబెటిస్‌ను అదుపు చేస్తుంది :** కొన్ని అధ్యయనాల ప్రకారం, గోధుమ గడ్డిలో ఇన్సులిన్ లాంటి ప్రభావాన్ని కలిగి ఉండే సమ్మేళనాలను కలిగి ఉన్నందున, ఇది టైప్ 2 డయాబెటిన్‌ను అదుపు చేయడంలో సహాయపడుతుంది. అలాగే ఆహారాల గ్లైసెమిక్ సూచికను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది.

**పోషకాహార లోపాన్ని తీరుస్తుంది :** వీట్ గ్రాస్ జ్యూస్ అధిక-నాణ్యత ప్రోటీన్‌లు, ఎంజైమ్‌లు, విటమిన్లు, ఖనిజాలను సరఫరా చేస్తుంది. తద్వారా శరీరానికి ఎటువంటి ముఖ్యమైన పోషకాహారం లోటు ఉండదు. ఇది పోషకాహార లోపాలను తీరుస్తుంది. శరీరంలో శక్తిని పునరుద్ధరిస్తుంది.

**ఎర్ర రక్త కణాల అభివృద్ధి:** గోధుమ గడ్డి రసం తాగితే ఎర్ర రక్త కణాలు అభివృద్ధి చెందుతాయి. దీనిలో బి12, ఫోలిక్ ఆసిడ్, ఐరన్ పుష్కలంగా ఉండి ఎర్ర రక్తకణాల పెరుగుదలకు దోహదం చేస్తాయి.

**అధిక రక్తపోటు నివారిణి:** గోధుమ గడ్డి రసాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే అధిక రక్తపోటు రాదు. జీర్ణకోశం లోని కొలెస్ట్రాల్‌ను ఇది కడిగేస్తుంది.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది :** ముఖ్యంగా క్యాన్సర్ రోగులకు గోధుమ గడ్డి రసం తాగడం వలన వారిలో రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యం కుదుట పడుతుంది.

**శక్తి ప్రదాయిని:** గోధుమ గడ్డి రసంలో ప్రొటీన్‌లు, ఎంజైమ్స్, విటమిన్లు, మినరల్స్ ఉన్న కారణాన ఈ రసాన్ని సేవించిన వారికి శక్తిని చేకూరుస్తుంది.

**నూతనోత్తేజం కలిగిస్తుంది:** గోధుమ గడ్డిలో క్లోరోఫిల్ ఉండటం వలన బ్యాక్టీరియాను నివారించి శరీరానికి నూతనోత్తేజం కలిగిస్తుంది.

**బరువును పెంచుతుంది :** గోధుమ గడ్డి పెంపకం ఖర్చుతో కూడిన పని కాదు. బరువు పెరగని వారికి ఇది శరీరంలోని మెటబాలిజాన్ని సరిచేస్తుంది - బరువును పెంచుతుంది.

**అర్థరైటిస్ పేషెంట్స్‌కు మంచిది :** గోధుమ గడ్డిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇది అర్థరైటిస్ కారణంగా వచ్చే బోన్ స్టిఫ్నెస్, నొప్పి, వాపు వంటి లక్షణాల నుంచి ఉపశమనం ఇస్తుంది. గోధుమ గడ్డిలో ఉండే క్లోరోఫిల్ ఇన్ఫ్లమేషన్‌ను తగ్గిస్తుందని టెస్ట్-ట్యూబ్ అధ్యయనాలు స్పష్టం చేశాయి.

**ప్లేట్లెట్స్ పెరుగుతాయ్ :** యూనివర్సల్ ఫార్మసీ అండ్ లైఫ్ సైన్సెస్‌కు చెందిన నిపుణులు గతంలో చేసిన ఓ అధ్యయనంలో గోధుమ గడ్డి కారణంగా ప్లేట్లెట్స్ సంఖ్య పెరిగినట్లు తేలింది. దీనివల్ల ఎర్ర రక్తకణాలు, హీమోగ్లోబిన్, తెల్ల రక్త కణాల సంఖ్య కూడా పెరిగిందట. గోధుమ గడ్డిలో ఉండే క్లోరోఫిల్ హీమోగ్లోబిన్ నిర్మాణాన్ని పోలి ఉండి, అచ్చం దానిలానే పనిచేస్తుందట. ముఖ్యంగా కీమోథెరపీ సమయంలో గోధుమ గడ్డి రసం తీసుకుంటే మంచిదని నిపుణులు అంటున్నారు.

**చర్మ రక్షణ :** ఒక గ్లాసు రసాన్ని సేవిస్తే చర్మం పై ముడుతలు రావు. ముడుతలు మటుమాయ మవడమే కాక చర్మం కాంతివంతంగా, ప్రకాశ వంతంగా ఉంటుంది. కన్నుల కింద నల్లటి వలయాలూ, మచ్చలూ రాకుండా నిరోధిస్తుంది. నేడు కాస్మటిక పరిశ్రమ గోధుమగడ్డి రసాన్ని వారి ఉత్పత్తులలో అధికంగా ఉపయోగిస్తున్నారు. ఇది చర్మానికి టానిక్‌గా పనిచేస్తుంది. రోజూ ఆహారంలో గోధుమ గడ్డి రసాన్ని ఒక పోషక పదార్థంగా ఉపయోగించవచ్చు. ఈ రసాన్ని




ఆరెంజ్, యాపిల్, పైనాపిల్, లెమన్ తదితర జ్యూస్‌లతో కలిపి తాగవచ్చు. గోధుమ గడ్డి పొడిని కూడా పోషక పదార్థంగా వాడవచ్చును. నేడు గోధుమ గడ్డి టాబ్లెట్లు ఆహారానికి ప్రత్యామ్నాయంగా మార్కెట్లో విక్రయం చేస్తున్నారు.

**గోధుమ గడ్డి పంట ఎందుకు?**

- గోధుమ గడ్డి చిన్న స్థలంలో, తక్కువ సమయంలో పండించవచ్చు.
- దీని పెంపకం సాధారణమైనది, ఇంటి తోటలలో సులభంగా సాగు చేయవచ్చు.
- ఇది మార్కెట్లో అధిక డిమాండ్ ఉన్న పచ్చగడ్డి పంట, ముఖ్యంగా ఆరోగ్య పరిశ్రమల్లో.

**వాతావరణం:** గోధుమ గడ్డి సమశీతోష్ణ వాతావరణంలో బాగా పెరుగుతుంది. వాంఛనీయ ఉష్ణోగ్రత: 20-25 డిగ్రీలు.

**నేల :** పి.ఎచ్. 6.5-7.5 తో లోమీ, బాగా ఎండిపోయిన నేల. నీటితో నిండిన లేదా లవణీయ నేలలు పనికిరావు.

**భూమిని తయారుచేయడం:** దున్నడం ద్వారా మట్టిని చక్కగా సిద్ధం చేయండి.

**విత్తన రేటు:** ఎకరానికి 15-20 కిలోలు.

**విత్తన శుద్ధి :** విత్తనం ద్వారా సంక్రమించే వ్యాధులను నివారించడానికి థైరామ్ లేదా కాప్టాన్ (2-3 గ్రా/కిలో విత్తనం) వంటి శిలీంధ్రనాశకాలతో విత్తనాలను శుద్ధి చేయండి.

**విత్తే సమయం:**

**శీతాకాల ప్రాంతాల కోసం:** అక్టోబర్ నుండి నవంబర్ వరకు.

**శాశ్వత వ్యవస్థలు లేదా ఇండోర్ ట్రేలు కోసం:** నియంత్రిత పరిస్థితుల్లో సంవత్సరం పొడవునా సాగు చేయవచ్చు.

**విత్తే లోతు :** 2-3 సెం.మీ. లోతులో విత్తుకోవాలి

**అంతరం:** విత్తనాలను సమానంగా వెదజల్లటం లేదా సరి పంపిణీ కోసం డ్రిల్ పద్ధతిని ఉపయోగించండి.

**నీటిపారుదల :** విత్తిన వెంటనే తేలికపాటి నీటిపారుదల అందించండి.

**పొలంలో పెరిగిన గోధుమ గడ్డి:** ప్రతి 7-10 రోజులకు ఒకసారి లేదా నేలలోని తేమను బట్టి నీరు పెట్టండి.

**ఫాగ్ఇండోర్ ట్రేలు:** తేమను నిర్వహించడానికి ప్రతిరోజూ తేలికపాటి నీటిపారుదల అందించండి

**పొలం సాగు:**

**బేసల్ డోస్:** హెక్టారుకు 10-15 టన్నుల బాగా కుళ్ళిన ఎరువు వేయండి.

**రసాయన ఎరువులు :** ఎన్.పి.కె. (50:30:20 కిలో / హె.) వేయండి.

**సేంద్రియ సాగు :** వర్మీకంపోస్ట్, కంపోస్ట్ టీ లేదా ద్రవ జీవ-ఎరువులను ఉపయోగించండి. విత్తిన 15-20 రోజుల తర్వాత చేతి కలుపు తీయాలి. తెగులు నియంత్రణ కోసం, శిలీంధ్ర వ్యాధులకు వేపనూనె లేదా ట్రైకోడెర్మా వంటి బయోలాజికల్ ఏజెంట్లను ఉపయోగించండి.

**హార్వెస్టింగ్ :**

- పొలంలో పెరిగిన గోధుమ గడ్డిమొదటి కోత కోసం 10-12సెం. మీ ఎత్తులో (విత్తిన 7-10 రోజుల తర్వాత) కోయండి.
- తదుపరి పంటలను ప్రతి 7-10 రోజులకు 4-6 వారాల వరకు చేయవచ్చు.
- ఇండోర్ ట్రేలు - ఆకులు సుమారు 15సెం.మీ ఎత్తు ఉన్నప్పుడు కోయండి.
- మట్టి లేదా ట్రే ఉపరితలంపై 1-2సెం.మీ ఎత్తులో గోధుమ గడ్డిని కత్తిరించడానికి శుభ్రమైన కత్తెర లేదా కొడవలిని ఉపయోగించండి.
- పంటను 3-4 సార్లు ప్రతి 7-10 రోజులకు పునరావృతం చేయవచ్చు.

**దిగుబడి :**

**సగటు దిగుబడి:** ఎకరానికి 2-3 టన్నుల తాజా బయోమాస్ కోత (పొలంలో పెరిగిన).

**పొలంలో సాగు :** ఒక కోతకు ఎకరానికి 2-3 టన్నుల తాజా బయోమాస్.

**ఇండోర్ సాగు:** సుమారు. చక్రానికి ఒక ట్రేకి 500-700 గ్రాములు.

**తీసుకోవలసిన జాగ్రత్తలు :** గోధుమ గడ్డి రసం నిర్ణీత పరిణామంలోనే తీసుకోవాలి. అధికంగా తీసుకుంటే సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి. తల నొప్పి, జీర్ణకోశ వ్యాధులు, పళ్లరంగు మారడం, మగతగా ఉండడం జరుగుతుంది. గోధుమ రసాన్ని తాజాగానే, వెంటనే వాడాలి. నిలువ ఉంచి తీసుకోరాదు. ఈ రసం ఆహారానికి ప్రత్యామ్నాయం కాదు. అయితే, ఆహారంలో భాగంగా దీనిని తీసుకోవచ్చు.

ఎవరికైతే గోధుమ రసం పడదో, వారు మానివేయడం మంచిది. డాక్టర్ లేదా న్యూట్రిషియన్ ఎక్స్‌పర్ట్ లేదా పౌష్టికాహార నిపుణుల సలహా మేరకు ఈ రసాన్ని తాగాలి.

**ఇంట్లో గోధుమ గడ్డి పెంపకం :** గోధుమ గడ్డిని మనం ఇంట్లోనే పెంచుకుని దానినుండి రసం తీసుకోవచ్చును. గోధుమలను ఓ గిన్నెలో 8 నుండి 10 గంటలవరకు నానబెట్టాలి. ప్రతి నాలుగు గంటలకూ నీరు మార్చాలి. రెండు అంగుళాల రంధ్రాలు గలిగిన ఓ ట్రేను తీసుకోవాలి. దానిలో మూడింతలు మట్టిని వేయాలి. ఆ మట్టిపై నీటిని పోయాలి. గోధుమలను సమానంగా ఆ మట్టిలో వేయాలి. కిటికీ సమీపాన గాలి తగిలేటట్లు మొక్కలకు పేపర్ టవల్‌ను ఉంచాలి. సరాసరి సూర్యరశ్మి పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. రోజూ ఉదయాన్నే నీరు పోయాలి. సాయంకాలం కొంచెం నీరు చిమ్మితే సరిపోతుంది. ఐదో రోజుకి మొక్కలు ఒక అంగుళం ఎదుగుతాయి. ఇప్పుడు కొంచెం నీరు రోజుకు ఒకసారి పెడితే సరిపోతుంది. పదో రోజుకి గోధుమ గడ్డి 6, 7 అంగుళాల ఎత్తుకి పెరుగుతుంది. ఈ సమయంలో గడ్డిని కోసి రసాన్ని తీసుకోవచ్చు. పది రోజుల తర్వాత గోధుమ మొక్కలు 7-8 ఇంచీల మేరకు మొలకెత్తుతాయి. అప్పుడు వాటిని వేళ్ళతో సహా పెకిలించండి. వేర్లను వేరు చేసుకోండి. మిగిలిన మొక్క భాగాలను, ఆకులను రుబ్బుకోండి. రుబ్బుకున్న పదార్థాన్ని వడకట్టుకోండి. వడకట్టగా వచ్చిన రసాన్ని వెంటనే సేవించండి. కాస్త ఆలస్యమైతే ఇందులోని శక్తి తగ్గిపోతుంది. వారానికి ఓ సారి ఈ రసాన్ని సేవిస్తుంటే ఎలాంటి భయంకరమైన వ్యాధి అయినా తగ్గిపోతుంది.

Nutrient comparison of 1 oz (28.35 g) of wheatgrass juice, broccoli and spinach.

| Nutrient | Wheatgrass Juice | Broccoli | Spinach |
|---|---|---|---|
| Protein | 860 mg | 800 mg | 810 mg |
| Beta-carotene | 120 IU | 177 IU | 2658 IU |
| Vitamin E | 880 mcg | 220 mcg | 580 mcg |
| Vitamin C | 1 mg | 25.3 mg | 8 mg |
| Vitamin $B_{12}$ | 0.30 mcg | 0 mcg | 0 mcg |
| Phosphorus | 21 mg | 19 mg | 14 mg |
| Magnesium | 8 mg | 6 mg | 22 mg |
| Calcium | 7.2 mg | 13 mg | 28 mg |
| Iron | 0.66 mg | 0.21 mg | 0.77 mg |
| Potassium | 42 mg | 90 mg | 158 mg |

# వర్షం తీరు - పెట్టిన పేరు

సేకరణ : డి.వి.రామక్రిష్ణారావు, సంపాదక మండలి సభ్యులు, వ్యవసాయ పాడిపంటలు, వ్యవసాయ సంచాలకుల కార్యాలయం, హైదరాబాద్

వానల కాలం.. వానలు కురుస్తున్నాయి. ఎప్పుడూ ఒకే వాన కురిస్తే ఎలా? ఇన్ని రకాల వానలు కురిస్తే ఎంత బాగుంటుందో కదా!

గాంధారి వాన = కంటికి ఎదురుగా ఉన్నది కనిపించనంత జోరుగా కురిసే వాన

మాపుసారి వాన = సాయంత్రం కురిసే వాన

విసరవాన = మృగశిరకార్తెలో కురిసే వాన

దుబ్బురువాన = తుప్పర/తుంపర వాన

సానిపి వాన = అలుకు(కళ్లాపి) జల్లినంత కురిసే వాన

సూరునీల్ల వాన = ఇంటి చూరు నుండి ధార పడేంత వాన

బట్టదడుపు వాన = ఒంటి మీదున్న బట్టలు తడిపేంత వాన

తెప్పెవాన = ఒక చిన్న మేఘం నుంచి పడే వాన

సాలు వాన = ఒక నాగలిసాలుకు సరిపడా వాన

ఇరువాలు వాన = రెండుసాల్లకు, విత్తనాలకు సరిపడా వాన

మడికట్టు వాన = బురదపొలం దున్నేటంత వాన

ముంతపోత వాన = ముంతతోటి పోసినంత వాన

కుండపోత వాన = కుండతో కుమ్మరించినంత వాన

ముసురు వాన = విడువకుండా కురిసే వాన

దరోదరి వాన = ఎడతెగకుండా కురిసే వాన

బొయ్యబొయ్య గొట్టే వాన = హోరుగాలితో కూడిన వాన

రాళ్ల వాన = వడగండ్ల వాన

కప్పదాటు వాన = అక్కడక్కడా కొంచెం కురిసే వాన

తప్పడ తప్పడ వాన = టపటపా కొంచెంసేపు కురిసే వాన.

దొంగ వాన = రాత్రంతా కురిసి తెల్లారి కనిపించని వాన

కోపులు నిండే వాన = రోడ్డు పక్కన గుంతలు నిండేంత వాన

ఏక్దార వాన = ఏకధారగా కురిసే వాన

మొదటివాన = విత్తనాలకు బలమిచ్చే వాన

సాలేటి వాన = భూమి తడిసేంత భారీ వాన

సాలు పెట్టు వాన = దున్నేందుకు సరిపోయేంత వాన

# వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రం

డా.ఆర్. విజయ కుమారి, జి.రామ కృష్ణ, పి.వెంకటేష్, ఎ.శ్రీనివాస్, వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం,
వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగంలో వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రంను ఒక పరిశోధన పథకంగా వ్యవసాయ పంటల ముందస్తు ధరలను అంచనా వేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారి ఆర్థిక సహాయంతో స్థాపించారు. ఈ కేంద్రం 2024-25 సంవత్సరం యాసంగి (రబీ), ఎండాకాలంలో సాగు చేసే వివిధ రకాల పంటల ముందస్తు ధరలను పంట కోత సమయంలో ఏ విధంగా ఉంటాయో అంచనా వేశారు. ఈ ముందస్తు ధరలను అంచనా వేయడానికి రాష్ట్ర ప్రధాన మర్కెట్లలోని 22 సంవత్సరాల నెలవారీ మోడల్ ధరలు, 7 సంవత్సరాల పక్షం రోజుల మోడల్ ధరలను తీసుకొని విశ్లేషణ చేశారు. ఈ విశ్లేషణ ఫలితాలు, మార్కెట్ సర్వేలను అనుసరించి 2024-25 యాసంగి, ఎండాకాలం పంట కోత సమయంలో ధర ఏ విధంగా ఉంటాయో అంచనా వేశారు, దానిని అనుసరించి:

| 2024-25 యాసంగి పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు: | | | |
|---|---|---|---|
| **పంటలు** | **ప్రధాన మార్కెట్** | **అంచనా ధరలు వర్తించే సమయం** | **అంచనా ధరలు (రూ/క్వి)** |
| వరి (సాధారణం) | సూర్యాపేట్ | మార్చి-మే | 2320-2530 |
| వరి (గ్రేడ్ ఎ) | జమ్మికుంట | మార్చి-మే | 2630-2970 |
| **2024-25 ఎండాకాలం పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు:** | | | |
| **పంటలు** | **ప్రధాన మార్కెట్** | **అంచనా ధరలు వర్తించే సమయం** | **అంచనా ధరలు (రూ/క్వి)** |
| టమాట | బోయినపల్లి | మార్చి-ఏప్రిల్ | 850-1050 |
| వంకాయ | బోయినపల్లి | మార్చి-ఏప్రిల్ | 1730-2180 |
| బెండ | బోయినపల్లి | మార్చి-ఏప్రిల్ | 1850-2250 |
| బత్తాయి | గడ్డి అన్నారం | మార్చి-ఏప్రిల్ | 3400-3700 |
| మామిడి | గడ్డి అన్నారం | మార్చి -మే | 4100-4850 |

ముందస్తు ధరల గురించిన సమాచారం కోసం దిగువ ఇవ్వబడిన ఫోన్ నెంబర్ల ని సంప్రదించగలరు.

డా. ఆర్. విజయకుమారి, ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్, మొబైల్ నం.: 9948780355

ఈ మెయిల్ : amic.pjtsau@gmail.com, వెబ్ సైట్: https://pjtsau.edu.in/agri-marketing-intelligence.html

**గమనిక:** పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్లలో గత 22 సంవత్సరాల నెలవారీ మోడల్ ధరలు, 7 సంవత్సరాల పక్షం రోజుల మోడల్ ధరలను విశ్లేషించి అంచనా వేశారు. పంట రకం, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా అంచనా ధరలలో మార్పు ఉండవచ్చు. కావున భవిష్యత్‌లో పంట ధరల మార్పుకు ఈ కేంద్రం ఏ విధమైన బాధ్యత వహించదు.

సాగు.. సంగతులు

# సాగు... సంగతులు..43

(వ్యవసాయంలో రైతులు మెరుగైన నిర్ణయాలు చేయడానికి ఉపయోగపడే సమాచారాన్ని వైవిధ్య వ్యవసాయ పద్ధతులను, అందుబాటులోకి వస్తున్న, వచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన వివరాలను ఒక దగ్గర రైతులకు అందజేసే ఉద్దేశంతోనే ఈ శీర్షిక. రైతులకు ఉపయోగపడే, మన వ్యవసాయ మెరుగుదలకు ఉపయోగపడేవన్నీ సాగు సంగతులే..)

సేకరణ-సంకలనం : కె.విజయ్ కుమార్, వ్యవసాయ అదనపు సంచాలకులు,
డి.వి.రామక్రిష్ణారావు, సంపాదక మండలి సభ్యులు, వ్యవసాయ పాడిపంటలు, వ్యవసాయ కమిషనర్ కార్యాలయం, హైదరాబాద్

## రైతులకు ఉపయోగపడే యంత్రాలు

వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడిస్తే నష్టాల నుంచి బయటపడవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు, మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ఈ ప్రశ్నకు సమాధానంగా రైతులకు ఉపయోగపడే విధంగా దేశీయంగా రూపొందించిన 50 వరకు యంత్రాలను కర్ణాటక రాష్ట్రం సేడంలో జరిగిన భారతీయ సంస్కృతి ఉత్సవ్‌లో ప్రదర్శించారు. ఇక్కడ గోధుమల నుంచి పిండి తయారు చేయడం, వేరుశనగ నుంచి నూనె తీయడం, పల్లీలకు కోటింగ్ ద్వారా నమకీన్ ఉత్పత్తులు, మిర్చి పసుపు నుంచి పొడి తయారు చేయడం వరకు అన్నదాతలకు ఉపయోగపడే యంత్రాలను ప్రదర్శించారు. పంటలకు సరైన ధర లేనప్పుడు ముడి సరుకు నుంచి వేర్వేరు ఆహార వస్తువుల ఉత్పత్తి ద్వారా ఆదాయం పొందవచ్చు. ధర ఎక్కువగా ఉన్న యంత్రాలను ఇద్దరు ముగ్గురు రైతులు కలిపి కొనుగోలు చేయవచ్చు. మార్కెట్ అనుభవాల ఆధారంగా అవసరాన్ని బట్టి ఎవరికి వారు కొనుక్కోవచ్చని నిర్వాహకులు తెలియజేశారు.

## నెల్లూరు జాతి గోవుకు డిమాండ్

ఇటీవల బ్రెజిల్ లోని మీనాస్ గ్రైరస్‌లో జరిగిన వేలంలో నెల్లూరు జాతికి చెందిన వియాటిన - 19 అనే ఆవు 4.8 మిలియన్ డాలర్లకు అమ్ముడుపోయి రికార్డ్ సృష్టించింది. రూపాయలలో సుమారు రూ.40 కోట్లకు పైగా ధర పలికింది. ఇది సుమారు 1101 కిలోలు బరువు ఉండటం విశేషం. సాధారణంగా ఇదే జాతికి చెందిన ఆవుల కంటే దీని బరువు రెట్టింపు కావడం గమనార్హం. వియాటినా - 19 అత్యధిక ధర పలికిన ఆవుగా గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకుంది. పశు సంపద పెంచేందుకు గాను వియాటిన-19 ద్వారా సేకరించిన అండాలను ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతను తట్టుకునే సామర్థ్యం ఉన్న వీటికి ఉష్ణ మండల, ఉప ఉష్ణ మండల ప్రాంతాల్లో భారీ డిమాండ్ ఉంది. 1800 లలో ఈ జాతి బ్రెజిల్ కు ఎగుమతి అయ్యింది. కండరాల నిర్మాణం, రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉండటం వీటిని ప్రత్యేకంగా నిలుపుతున్నాయి.

## కిసాన్ అగ్రి షో - 2025

మాదాపూర్ లోని హైటెక్స్‌లో 2025 ఫిబ్రవరి 7నుంచి 9 వరకు మూడు రోజులపాటు జరిగిన కిసాన్ అగ్రి షో - 2025 ను వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్ర పరికరాల పనితీరును చూసి, రైతులు ఏ విధంగా వాడుకుంటే ఖర్చు తగ్గుతుందో తెలుసుకోవాలని అన్నారు. ఇటువంటి అగ్రిషోలను జిల్లాల వారీగా కూడా ఏర్పాటు చేసి ఇక్కడకు రాని రైతులకు కూడా యంత్ర పరికరాలు పై అవగాహన కల్పించాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న యాంత్రీకరణ ఫలితాలను తెలంగాణ రైతులకు అందించాలని కోరారు. ఈ ఏడాది నుంచి యంత్రాల కొనుగోలుకు సబ్సిడీలు ఇచ్చి పెద్ద ఎత్తున చిన్న,సన్నకారు రైతులను ప్రోత్సహించనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. వ్యవసాయ యంత్రాలు, ట్రాక్టర్లు,వివిధ రకాల పనిముట్లు, వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయంలో ఆవిష్కరణలు, స్టార్టర్లు వ్యవసాయ ఇన్పుట్లు, రక్షిత సాగుతో పాటు వ్యవసాయం కోసం మొబైల్ యాప్ లు, ఇతర సేవలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. 140 పైగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. వివిధ పథకాల కింద ఇప్పటికే రూ. 40 వేల కోట్ల నిధులను రైతులకు నేరుగా చెల్లించినట్లు ఈ సందర్భంగా మంత్రి తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్యదర్శి ఎం రఘునందన్ రావు ఐఏఎస్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి గోపి ఐఏఎస్, కిసాన్ ఫోరం ప్రైవేట్ లిమిటెడ్ కన్వీనర్ నిరంజన్ దేశ్ పాండే సహా వివిధ స్థాయి అధికారులు, శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఐ ఐ ఎం ఆర్ వ్యవస్థాపక దినోత్సవం

2025 ఫిబ్రవరి 9న ఐఐఎంఆర్ వ్యవస్థాపక దినోత్సవం హైదారాబాద్ రాజేంద్రనగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా భారత చిరుధాన్యాల పరిశోధనా సంస్థ (ఐ ఐ ఎం ఆర్) డైరెక్టర్ సి తారా సత్యవతి మాట్లాడుతూ– ఊరూరా చిరుధాన్యాలు సాగు కావాలని, ఇంటింటికి వాటి ఆహారం చేరాలని ఆమె కోరారు. రైతులు పెద్ద ఎత్తున చిరుధాన్యాల సాగు చేపట్టి వాటికి పూర్వ వైభవం తీసుకురావాలని అన్నారు. ఇందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయని అన్నారు. సాగు విస్తరణతో పాటు, ఆహార శుద్ధి, వినియోగం, ఉత్పత్తుల తయారీకి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత వ్యవసాయ పరిశోధనా మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆర్ సి అగర్వాల్ మాట్లాడుతూ చిరుధాన్యాలకు ఉజ్వల భవిష్యత్తు ఉందని అన్నారు. వీటిపై అంకురాల ద్వారా విస్తృత ప్రయోగాలు జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఎంఆర్ శాస్త్రవేత్తలు,విద్యార్థులు, పరిశోధకులు, అంకుర వ్యవస్థాపకులు పాల్గొన్నారు.

## సాంకేతికతను అందిపుచ్చుకుంటున్న రైతాంగం

దేశవ్యాప్తంగా రైతాంగం ఆన్లైన్ బాట పడుతోంది. గ్రామీణ స్థాయికి వడివడిగా చేరుకుంటున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతాంగం వినియోగించుకుంటోంది. డిజిటల్ పేమెంట్ల విషయంలో వేగంగా ముందుకెళ్తోందని గణాంకాలు చెబుతున్నాయి. గత రెండేళ్ల కాలంలో రైతుల డిజిటల్ పేమెంట్లు గణనీయంగా పెరిగాయని తెలుస్తోంది. 2022లో 11% రైతులు మాత్రమే ఆన్లైన్ ద్వారా చెల్లింపులు చేసేవారని, రెండేళ్ల తర్వాత అంటే 2024లో అది 43 శాతానికి పెరిగిందని మెకన్సి అనే సంస్థ నిర్వహించిన అధ్యయనంలో తెలిసింది. వ్యక్తిగత, పంటల బీమా, ప్రీమియంలు మొదలు పురుగుమందుల కొనుగోళ్ళు, ఇతర అవసరాలకు కూడా రైతులు ఆన్లైన్ ద్వారా చెల్లింపులు చేస్తున్నారని ఈ సర్వేలో వెల్లడయింది.

## సాగు వైవిధ్యానికి చిరునామాగా సంగారెడ్డి

రాష్ట్రంలో సాధారణ సాగు చూస్తే ఏదో ఒకటి రెండు పంటలు ప్రధానంగా సాగు కావడం గమనిస్తాం. ఒక జిల్లాలో వరి ఎక్కువగా సాగైతే, మరో జిల్లాలో పత్తి, ఇంకో జిల్లాలో మొక్కజొన్న ఎక్కువగా సాగవ్వడం కనబడుతుంది. కానీ సంగారెడ్డి జిల్లా మాత్రం వైవిధ్యమైన పంటల సాగుకు నిలయంగా మారింది. జిల్లా వ్యాప్తంగా వాము, అల్లం, పసుపు, ధనియాలు, ఎండుమిర్చి, మెంతులు, వెల్లుల్లి వంటి పది రకాల పంటలు సుమారు 2600 ఎకరాల్లో ఇక్కడ సాగవుతున్నాయి.

## రైతుకు యూనిక్ ఐడి

కేంద్ర ప్రభుత్వం రైతులకు అందజేసే వివిధ పథకాలను మరింత సమగ్రంగా లబ్ధిదారులకు చేరడం కోసం యూనిక్ ఐడి పద్ధతిని రూపొందించింది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో “ఫార్మర్ రిజిస్ట్రీ “ పేరుతో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ మొదలైంది. రాష్ట్రంలో కూడా ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. డిజిటలైజేషన్‌లో భాగంగా “ఫార్మర్ రిజిస్ట్రీ “ పేరుతో ప్రతి రైతుకు యునిక్ ఐడి తీసుకొచ్చే ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. 14 అంకెలతో కూడిన ఈ యూనిక్ ఐడిని ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ ద్వారా త్వరలో రాష్ట్రంలో ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ ప్రక్రియ ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైంది.

## సేంద్రియ సాగు పెరుగుతోంది

రసాయన అవశేషాలు లేని సేంద్రియ ఆహార ఉత్పత్తుల సాగు వ్యాపారం ప్రపంచవ్యాప్తంగా ఏటేటా విస్తరిస్తూ 2023లో ప్రపంచవ్యాప్తంగా 108 దేశాల్లో 9.89 కోట్ల హెక్టార్లకు సేంద్రియ సాగు విస్తరించింది. 2022 తో పోల్చితే 2023లో సేంద్రీయ ప్రకృతి సాగు విస్తీర్ణం 2.6% (25 లక్షల హెక్టార్లు) పెరిగింది. జర్మనీలోని నరేంబర్గ్‌లో జరిగిన అంతర్జాతీయ సేంద్రీయ ఆహార ఉత్పత్తుల వాణిజ్యప్రదర్శనలో 2025 ఫిబ్రవరి 11న విడుదలైన “ద వరల్డ్ ఆఫ్ ఆర్గానిక్ అగ్రికల్చర్ 2025” వార్షిక సర్వే నివేదిక ఈ తాజా గణాంకాలను వెలువరించింది. ప్రపంచవ్యాప్తంగా 43 లక్షల మంది రైతులు సేంద్రియ సాగు చేస్తుండగా 24 లక్షల మంది సర్టిఫైడ్ సేంద్రియ రైతులు మనదేశంలోనే ఉన్నారు. ఉగాండా 4.04 లక్షలు మంది, ఇథియోపియా 1.21 లక్షలు మందితో రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. విస్తీర్ణపరంగా చూస్తే 5.3 కోట్ల హెక్టార్లలో సర్టిఫైడ్ సేంద్రియ సేద్యంతో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో ఉండగా, 4.5 లక్షల హెక్టార్లతో భారత్ రెండో స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం సాగు



భూమిలోని 2.1 శాతంలో సర్టిఫైడ్ సేంద్రియ సేద్యం జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. సేంద్రీయ ఉత్పత్తుల వినియోగంలో అమెరికా మొదటి స్థానంలో ఉంది.

### నాబార్డ్ స్టేట్ ఫోకస్ పేపర్ 2025

జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డ్ ) ప్రాధాన్య పత్రంను 2025 ఫిబ్రవరి 14న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సేంద్రీయ సాగు పెద్ద ఎత్తున పెరగాలని, మహిళా సంఘాలను ప్రోత్సహించాలని, పూలు, పండ్లు, కూరగాయల సాగు విస్తరించాలని సూచించారు. రైతులు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పనుల్లో ఎలా నడుస్తున్నాయో బ్యాంకులు చూడాలి. వ్యవసాయ రంగానికి మరింత రుణ సాయం అందించాలి. రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక సౌకర్యాల అభివృద్ధి, డిజిటల్ బ్యాంకింగ్ రంగ విస్తరణకు కృషి చేయాలని సూచించారు. నీటి కొరత ప్రాంతాలను గుర్తించి మరింత సహకారం అందించాలని అన్నారు. మామిడి, పసుపు, మిర్చి, చిరుధాన్యాల పంటలకు తెలంగాణ ప్రసిద్ధి చెందిందని, నాబార్డు కోల్డ్ స్టోరేజ్ ఏర్పాట్లు ప్రోత్సహించడం, అంతర్జాతీయ ప్రమాణాలు ప్రకారం రైతులకు శిక్షణ వంటి కార్యక్రమాలను చేపట్టాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి బ్యాంకర్లు మరింత సహకరించాలని కోరారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు అందించాలని అన్నారు. పశుపోషణ, మత్స్య పరిశ్రమ, కృషి ఆధారిత పరిశ్రమలు వంటి వాటిలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల ఆదాయాన్ని పెంచడానికి చిరుధాన్యాల సాగును ప్రోత్సహించవలసిన అవసరం ఉందని అన్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి రూ. 3,85,854 కోట్ల రుణ సాయం అందించాలని జాతీయ వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) రాష్ట్రంలోని బ్యాంకులకు నిర్దేశించింది. గత ఏడాది లక్ష్యం కంటే 37.80% అధికం. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్యదర్శి ఎం రఘునందన్ రావు ఐఏఎస్, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, ఆర్బిఐ జిఎం అనూజ్ రంజన్, ఆర్థిక శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఐ.ఎ.ఎస్., నాబార్డ్ జిఎం ఆర్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

### పెద్దకుర్మపల్లి రైతుకు జాతీయ పురస్కారం

కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం పెద్దకుర్మపల్లి గ్రామానికి చెందిన రైతు మావురం మల్లికార్జున్ రెడ్డికి జాతీయ పురస్కారం లభించింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసిఏఆర్) ఆధ్వర్యంలో ఏటా దేశవ్యాప్తంగా ఉన్న ఉత్తమ రైతులను ఎంపిక చేసి ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫెలో ఫార్మర్, ఇన్నోవేటివ్ ఫార్మర్ విభాగాల్లో పురస్కారాలు అందిస్తోంది. ఈ ఏడాది ఈ ఫెలో ఫార్మర్ పురస్కార విభాగంలో ఆరుగురు రైతులను ఎంపిక చేయగా అందులో దక్షిణ భారతదేశం నుంచి మల్లికార్జున రెడ్డి ఉన్నారు. సేంద్రియ,సమీకృత వ్యవసాయం చేస్తూ వాటిపై ఇతర రైతులకు అవగాహన కలిగిస్తున్నందుకు ఆయన ఎంపిక అయ్యారు.

### షుగర్ ఉన్నవారు కూడా ఈ బియ్యం తినొచ్చు

షుగర్ పెంచని, ప్రోటీన్ లోపాన్ని ఎదుర్కొనే మరో రెండు అద్భుత వంగడాలను అందుబాటులో తెస్తున్నట్లు ఇరి ( ఐ ఆర్ ఆర్ ఐ ) ప్రధాన శాస్త్రవేత్త కన్యూమర్ డ్రివెన్ గ్రెయిన్ క్వాలిటీ అండ్ న్యూట్రిషన్ యూనిట్ డైరెక్టర్ నెసే శ్రీనివాసులు తెలిపారు. లో గ్లైస్మిక్ ఇండెక్స్ (55%) కలిగిన "ఐఆర్ఆర్ఐ 147" ను ఈ ఏడాది వర్షాకాలంలోనే మనదేశంలో అందుబాటులోకి రానుంది. అలాగే అల్ట్రాలో గ్లైసమిక్ ఇండెక్స్ (45%) ప్లస్ హై ప్రోటీన్ (16%) అందించే మరో వంగడం కూడా ఇదే ఏడాదిలో అందుబాటులోకి రానున్నట్లు శాస్త్రవేత్త ఇటీవల తన భారత పర్యటనలో భాగంగా హైదారాబాద్ వచ్చినపుడు ఒక ఇంటర్వ్యూలో తెలిపారు.

### పీఎం కిసాన్ నిధులు 19వ విడత

పీఎం కిసాన్ నిధి పథకం కింద 19వ విడత గా 9.8 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ.22,000 కోట్లను ప్రధాని మోదీ 2025 ఫిబ్రవరి 24న బదిలీ చేశారు. బీహార్ లోని భాగల్పూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ నిధులు విడుదల చేశారు.




# ఫోన్ – ఇన్ – లైవ్

రైతులు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
040-27031431, 27031432, 27031433

## దూరదర్శన్ కేంద్రం వారి ఫోన్-ఇన్-లైవ్ కార్యక్రమాలు

దూరదర్శన్ కేంద్రం, రామాంతపూర్, హైదరాబాద్ ద్వారా రాష్ట్రమంతటా మార్చి 2025లో ప్రసారం చేయనున్న ఫోన్-ఇన్-లైవ్ కార్యక్రమాల వివరాలు ఈ కింద పొందుపరిచాం. రాష్ట్ర రైతాంగం ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

| తేది | విషయం | శాస్త్రవేత్త | చిరునామా |
|---|---|---|---|
| 03.03.2025<br>సోమవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | హరిత గృహాల్లో జెర్బర, కార్నేషన్ సాగు | డా.జి.జ్యోతి<br>శాస్త్రవేత్త & హెడ్ | పూల పరిశోధనా స్థానం,<br>రాజేంద్రనగర్, హైదరాబాద్<br>ఫోన్ : 9440091020<br>dr.jyothi.gadde@gmail.com |
| 04.03.2025<br>మంగళవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | సమస్యాత్మక కలుపు మొక్కల యాజమాన్యం | డా.బి.పద్మజ<br>ప్రధాన శాస్త్రవేత్త | ఎ.ఐ.సి.ఆర్.పి. ఆన్ వీడ్ మానేజ్‌మెంట్<br>రాజేంద్రనగర్, హైదరాబాద్<br>ఫోన్ : 9440040605<br>bhimireddymadhuri@gmail.com |
| 05.03.2025<br>బుధవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | చేపల చెరువుల యాజమాన్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు | ఎం.డి.ఖదీర్ అహ్మద్<br>డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ | డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ కార్యాలయం, మత్స్యభవన్,<br>మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్<br>ఫోన్ : 8106746326<br>khadeerahmed6@gmail.com |
| 06.03.2025<br>గురువారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | మామిడి కాయ పెరుగుదల దశలో చేపట్టాల్సిన చర్యలు | డా.వి.సుచిత్ర<br>సీనియర్ శాస్త్రవేత్త & హెడ్ | పూల పరిశోధనా స్థానం,<br>సంగారెడ్డి జిల్లా<br>ఫోన్ : 9492767348<br>varakalasuchi3@gmail.com |
| 07.03.2025<br>శుక్రవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | లాభసాటిగా పాడి పరిశ్రమలో పునరుత్పత్తి ప్రాముఖ్యత | డా.ఇ.సునీల్ ఆనంద్ కుమార్<br>అసోసియేట్ ప్రొఫెసర్ & హెడ్ | పశువైద్య కళాశాల,<br>మమ్నూరు, వరంగల్<br>ఫోన్ : 9484995172<br>dresunilanand@gmail.com |
| 10.03.2025<br>సోమవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | అగ్రో ఫారెస్ట్ విధానంలో లాభసాటి అయిన వ్యవసాయం | డా.ఎ.వి.రామాంజనేయులు<br>ప్రధాన శాస్త్రవేత్త | ఎ.ఐ.సి.పి.ఆర్. ఆన్ అగ్రో ఫారెస్ట్రీ<br>రాజేంద్రనగర్, హైదరాబాద్<br>ఫోన్ : 9441312264<br>avr_agron@rediffmail.com |
| 11.03.2025<br>మంగళవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | వేసవిలో పండించే టమాట, వంగ సాగు వివరాలు, మెళకువలు | డా.జె.శ్రీనివాస్<br>అసిస్టెంట్ ప్రొఫెసర్ | ఉద్యాన కళాశాల,<br>మోజెర్ల, వనపర్తి జిల్లా<br>ఫోన్ : 9951487739<br>srinivasjogdande@gmail.com |
| 12.03.2025<br>బుధవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | పెంపుడు కుక్కల్లో సాధారణంగా వచ్చే రోగాలు, వాటి నివారణ | డా.ప్రవీణ్ కుమార్<br>అసిస్టెంట్ డైరెక్టర్ | ప్రాంతీయ పశువైద్యశాల,<br>తాండూరు, వికారాబాద్ జిల్లా<br>ఫోన్ : 9848046171<br>mpk.vet@gmail.com |
| 13.03.2025<br>గురువారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | ప్రస్తుతం ఉన్న వివిధ పంటల్లో తెగుళ్ళు - సమగ్ర సస్యరక్షణ | డా.ఎ.విజయ్ భాస్కర్ రెడ్డి<br>సీనియర్ శాస్త్రవేత్త | వ్యవసాయ పరిశోధనా స్థానం,<br>కరీంనగర్<br>ఫోన్ : 9849817896<br>apvijayabhaskar@gmail.com |
| 14.03.2025<br>శుక్రవారం<br>సాయంత్రం<br>6.00-7.00 గంటలకు | వేసవిలో పట్టు కాయలను చంద్రికలనుండి తీసేటప్పుడు, మార్కెట్‌కు తరలించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు | జి.నాగరత్న<br>అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సెరీకల్చర్ | సెరీకల్చర్ డైరెక్టర్ కార్యాలయం,<br>హైదరాబాద్<br>ఫోన్ : 9393558720<br>ratnagoud215@gmail.com |




# ఫోన్ – ఇన్ – లైవ్

రైతులు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
040-27031431, 27031432, 27031433


## దూరదర్శన్ కేంద్రం వారి ఫోన్-ఇన్-లైవ్ కార్యక్రమాలు

| తేది | విషయం | శాస్త్రవేత్త | చిరునామా |
|---|---|---|---|
| 17.03.2025 సోమవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | అధిక పాల దిగుబడికి పాడి పశువుల మేపు | డా.ఎం.వెంకటేశ్వర్లు ప్రొఫెసర్ & యూనివర్సిటీ హెడ్ | పశువైద్య కళాశాల, కోరుట్ల, ఫోన్ : 9440875665 malisetty46@gmail.com |
| 18.03.2025 మంగళవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | వేసవి అపరాల సాగు, విత్తనోత్పత్తిలో మెళకువలు | డా.కె.రుక్మిని దేవి ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ | వ్యవసాయ పరిశోధనా స్థానం, మధిర ఫోన్ : 7675050041 rukminiars@gmail.com |
| 19.03.2025 బుధవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | పక్షులలో బర్డ్ ఫ్లూ వ్యాధి లక్షణాలు, నివారణ | డా.బి.విజయభాస్కర్ రెడ్డి అసిస్టెంట్ డైరెక్టర్ | వి.బి.ఆర్.ఐ, శాంతి నగర్ హైదరాబాద్ ఫోన్ : 9494209420 vbrboddu@gmail.com |
| 20.03.2025 గురువారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | వేసవి తీగజాతి కూరగాయలలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు | డా.షహనాజ్ అసోసియేట్ ప్రొఫెసర్ | ఉద్యాన కళాశాల, మోజర్ల, వనపర్తి జిల్లా ఫోన్ : 7683053157 shahanaz.ento@gmail.com |
| 21.03.2025 శుక్రవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | తెలంగాణలో భూగర్భ జలాల లభ్యత, వేసవిలో రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు | పి.జ్యోతి కుమార్, డైరెక్టర్ | భూగర్భజలశాఖ, హెడ్ ఆఫీస్ ఖైరతాబాద్, హైదరాబాద్ ఫోన్ : 7032982008 ddhg2gwd@gmail.com |
| 24.03.2025 సోమవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | వేసవి పంటల్లో చీడపీడల యాజమాన్యం | కె.రాహుల్ విశ్వకర్మ శాస్త్రవేత్త | డాట్ సెంటర్, జోగిపేట్ ఫోన్ : 7013192530 chryso666@gmail.com |
| 25.03.2025 మంగళవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | సమగ్ర వ్యవసాయ విధానంలో రైతుకు కచ్ఛితంగా ఆదాయం | ఫిర్దోజ్ షహన శాస్త్రవేత్త | ఆర్.ఎస్.& ఆర్.ఆర్.ఎస్., రుద్రూరు ఫోన్ : 9182375732 shahanaagro34@gmail.com |
| 26.03.2025 బుధవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | పుట్టగొడుగుల పెంపకంలో మెళకువలు | డా.ఎం.ప్రమీల సీనియర్ శాస్త్రవేత్త | వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్ ఫోన్ : 9866706545 mangalpudip@yahoo.com |
| 27.03.2025 గురువారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | భూసార పరీక్ష - మట్టి నమూనా సేకరణ పద్ధతులు, ఉపయోగాలు | డా.ఎ.మాధవి ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ | వ్యవసాయ పరిశోధనా స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్ ఫోన్ : 9848976765 madhavi.adusumilli@gmail.com |
| 28.03.2025 శుక్రవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | వ్యవసాయానికి అనుబంధగా ప్రత్యామ్నాయ కోళ్ళ పెంపకంతో ఉపాధి, అదనపు ఆదాయం | డా.డి.రాంబాబు అసోసియేట్ ప్రొఫెసర్ & హెడ్ | పశువైద్య కళాశాల, కోరుట్ల ఫోన్ : 9440363457 ramvetdoc@rediffmail.com |
| 31.03.2025 సోమవారం సాయంత్రం 6.00-7.00 గంటలకు | కీరదోస సాగులో మెళకువలు | డా.వి.మురళి సీనియర్ శాస్త్రవేత్త & హెడ్ | ఉద్యాన పరిశోధనా స్థానం, ఆదిలాబాద్, ఫోన్ : 6304749921 muralivuyyuru@gmail.com |

## ప్రొఫెసర్ జయశంకర్
## తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం
రాజేంద్రనగర్, హైదరాబాద్, తెలంగాణ

# ఓ రైతన్న... వ్యవసాయంలో ఆధునిక సమాచారం కావాలా...

## అయితే మీ స్మార్ట్‌ఫోన్‌లో కేవలం మూడు(3) క్లిక్‌ల ద్వారా పొందండి



1 మీ స్మార్ట్‌ఫోన్ కెమెరా / గూగుల్ లెన్స్ తో క్యూ ఆర్. కోడ్‌ను స్కాన్ చేయండి
2 పి.జె.టి.యస్.ఎ.యు. అగ్రికల్చరల్ వీడియోస్ హోమ్ పేజిలో SUBSCRIBE అనే ఐకాన్ మీద క్లిక్ చేయండి
3 గంట ఆకారంలో ఉన్న సింబల్‌ను క్లిక్ చేయండి

- మా ఛానల్‌లో సభ్యులుగా నమోదు అవ్వండి
- మీ వ్యవసాయ విశ్వవిద్యాలయం అందించే నూతన వీడియో సమాచారం నోటిఫికేషన్ ద్వారా పొందండి
- మీ గుప్పిట్లో మీ వ్యవసాయ సమాచారం

SCAN ME

ఆధునిక వ్యవసాయ సమాచార సమాహారం - పి.జె.టి.యస్.ఎ.యు. అగ్రికల్చరల్ వీడియోస్

## యూట్యూబ్ ఛానల్



VYAVASAYA PADIPANTALU A Telugu Monthly Journal of Department of Agriculture - RNI Regn. No. TELTEL / 2012 / 47334 - MARCH-2025

# మన పంటలకు నేస్తాలు, బదనికలు, పరాన్న జీవులు...!

## అనవసర పురుగు మందుల వినియోగాన్ని ఆపేద్దాం...
## పంటకు మేలు చేసే జీవులను కాపాడుకుందాం...!










































Printed & Published by **Dr. B. Gopi, I.A.S,** Director of Agriculture,
Government of Telangana, Basheer Bagh, Hyderabad - 500 001 on behalf of Commissioner & Director of Agriculture,
Telangana, through Telangana State Agro Industries Development Corporation Limited (TSAIDC Ltd.)
**Designed** at M/s.Sri Chaithanya Graphics, Flat No.109, Tirumala Apartments, Skyline Road, Basheerbagh, Hyderabad - 500029. **Editor : K. Vijay Kumar**